విష్ణు:- కూపమనగా రంధ్రము. అదియే జీవుల శిరంబులందుండు బ్రహ్మరంధ్రము. అందుఁగల సహస్రారమున మహావిష్ణువు శక్తిసహితుడై తేజోరూపమునగలడు. అందుచేతనే శిరస్సు పూజార్హమైన స్థలము. అందున్న కారణమున విష్ణువు కూప్యనామకుడై నమస్కరింపబడుచున్నాడు.

బీజాక్షరసంపుటి —

కూప్యనామమున "క్ + ఊ + ప్ + య్ + అ" అని ఐదక్షరములు కలవు. అవి పంచాగ్నులను, పంచేంద్రియములను సూచించును. ఇందు ప్రాజాపత్యబీజము, భూబీజమైన ఊకారముతోడను, పర్జన్యవాయుదేవబీజములతోడనుగూడియున్నవి. ఉపాసకులు ప్రాణాయామమున భూచక్రమునందు ప్రజాపతి పర్జన్యులను ధ్యానించి జపించుటచే, భూమిలోఁగల జలరాసులను గనుగొని, వాయుశక్తితో వానిని బైటపెట్టి వర్షింపఁజేయుగలవారలగుదురని తెలియుచున్నది. అంతేకాదు భూమిలోఁగల తైలజలలోహాదులను గనుగొనువారలు కాగలరని తెలియుచున్నది.

196. నామము- శివ: "నమోవట్యాయచ"

శి. భా. భా:— భూమిపైగలరంధ్రమునకు అవటమనిపేరు. దానిలో జలరూపముననుండుటచే మహాదేవుడు అవట్యనామకుడాయెను. భూరంధ్రమున గల సర్పాదిజీవులను రక్షించుటకై అందున్న కారణమున శివునకు అవట్యనామమువాటిల్లెను. అ = శివునియొక్క, వటః = కోశము అవటము అనగా హిమాలయపుగుహ. అందు తపంబునకుండువాడు కావున శివుడు అవట్యనామకుడాయెననియుఁ జెప్పవచ్చును.

విష్ణు:- అ = విష్ణువు. వటము = అతనిని ఆవరించియుండుకోశము అవటము. అదియే జీవుల హృదయకుహరము. అందుండుటచే విష్ణువు అవట్యనామకుడాయెను. అ = ఓంకారమును, వటము = ఆవరించియుండుకోశము వేదత్రయము. ఋగ్యజుస్సామవేదస్వరూపము. దానిలోనుండుటచేతనే వేదవేద్యుడై విష్ణువు అవట్యనామకుడాయెననియుఁ జెప్పవచ్చును.

ANNAMACHARYA KALA MANDIRAM TIRUPATI. No.......Dt.......... 2918 LIBRARY

బీజాక్షరసంపుటి-

అవర్ష్యా నామమున "అ+వ్+అ+ర్+య్+అ" అని ఆరక్షరములు కలవు. అవి షడృతువులను, షట్చక్రములను సూచించును. ఇందలి మూడకారములు త్రిమూర్తులను సూచించును. వీనిలో సూర్యబీజమైన ఉకారము వరుణవాయుబీజములమధ్యనున్నది. అందుచే నైనామము నుపాశించువాడు జలవాయు ప్రేషకయంత్రములసాయమున సూర్యమండల గామి కాగలడనియును, జలవాయు శక్తుల తోడ్పాటుచే సూర్యకిరణ శక్తులను గ్రహించి సకల రోగనివారకుడు కాగలడనియును దెలియుచున్నది సూర్యోపాసకులకు ఇది ప్రధాననామము.

— 12. వ. యజుస్సు —

"నమోవర్ష్యాయచావర్ష్యాయచ"

అర్థము:-

వర్ష్యాయచ = వర్షజలరూపుడైనట్టియును, అవర్ష్యాయచ = సముద్రాది జలరూపుడైనట్టి శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా.భా. :— మేఘము, వర్షము జలరూపములు. జలము శివుని రూపములలో నొకటి. కావున మహాదేవుడు వర్షజలమందును, సముద్రాది జలమందు నుండి జీవులను రక్షించుచు, నమస్కరింపబడుచున్నాడు.

197 నామము- శివః- "నమోవర్ష్యాయచ"

భ.ఖా.ఖా. :— "చత్వారివా అపాగ్ంరూపాణి, మేఘోవిద్యుత్, స్తనయిత్నుర్వృష్టిః" అను శ్రుతిచే జలరూపములలో వర్షమొకటియని తెలియుచున్నది. అందు మహాశివుడు జలరూపమునను౦డుటచే వర్ష్యనామకుడై నమస్కరింపబడుచున్నాడు.

విష్ణు:—
వర్ష పదమునకు సంవత్సరమని యర్థము కలదు. వర్షమునందు మహావిష్ణువు కాలమునుదెల్పు సూర్యుని రూపముననుండెను. "వత్సరోవత్సలో వత్సః"అను విష్ణు సహస్రసూక్తియందలి వత్సరపదము విష్ణువునే తెల్పుచున్నది. వత్సరవర్షపదములు రెండును సమానార్థకములై విష్ణువునే తెల్పును కాన విష్ణువు వర్ష్యనామకుడాయెనని తెలియుచున్నది.

బీజాక్షరసంపుటి:-

వర్ష్య నామమున "వ్+అ+ర్+ష్+య్+అ" అని ఆరక్షరములు కలవు. అవి షడృతువులను, షడింద్రియములను సూచించును. ఇందు అకారముతోబాటు వరుణాగ్నివాయుబీజములతో గూడినసూర్యబీజము షకారము కలదు. సూర్యప్రధానముగా ఈ నామము నుపాసించువారు జలాగ్నివాయు ప్రకోపములచే నేర్పడిన రోగములను నివారించువారును జలాగ్నివాయు శక్తులతోగూడిన యంత్ర సహాయమున సూర్యమండల గాములును సూర్య కిరణ శక్తిగ్రాహకులును గాగలరని తెలియుచున్నది. అంతేకాదు, శరీరమున నేర్పడు నానావర్ణపు మచ్చలతో గూడిన చర్మరోగములను నివారించు వారలును గాగలరని తెలియుచున్నది.

198 వ. నామము- శివ:- "నమోఽవర్ష్యాయచ"

భ.ఖా.ఖా. :— వర్షింపకయే జలముగల సముద్రాదులందు మహాదేవుడు జలరూపమునను, బడబాగ్నిరూపమునను ఉండుటచే అవర్ష్యనామకుడై నమస్కరింపబడుచున్నాడు.

విషు-

వర్షింపనివి అవర్షములు. సముద్రము పర్వతమున్నగునవి. వాని యందుండువాడు అవర్ష్యుడు. మహావిష్ణువు క్షీరసముద్రమున శేషశాయియై యుండెను. అతడే "రసోఽహమప్సుకౌంతేయ!" అను గీతాసూక్తిచే సముద్రాది జలమున రసరూపముననున్నట్లు తెలియుచున్నది అందుచే విష్ణువు అవర్ష్యనామకుడాయెను. రత్నగర్భుడు = సముద్రుడు రత్నగర్భోధనేశ్వరః" అను విష్ణుసహస్రసూక్తిలో సముద్రార్థకమైన రత్నగర్భపదము విష్ణునామముగాగలదు రత్నగర్భుడు, అవర్ష్యుడు" అను రెండు నామములును సమానార్థకములే. రత్నగర్భుడును (సముద్రుడును) వర్షింపనివాడేకదా! కావున విష్ణువునకు అవర్ష్యనామముచెల్లును. అవర్షము = పర్వతముఅని చెప్పఁ నను శేషాచలభద్రాచలాది పర్వతములందును విష్ణువుండుటచే ఆతనికి అవర్ష్యనామముచెల్లును. విష్ణువవలె శివుడును శ్రీశైలపర్వతమునగలడు కాన అవర్షనామకుడగును. "అచలశ్చలః" అను విష్ణుసహస్రసూక్తిలో అచలపదము విష్ణుపరముగాఁగలదు. "స్థావరాణాంహిమాలయః" అను గీతాసూక్తిచే హిమాలయమున విష్ణువిభూతియున్నట్లు తెలియుచున్నది. హిమాలయము అవర్షకమే అందుండుటచే విష్ణువు అవర్ష్యనామకుడగును. ఈవిధముగా విష్ణువు నమస్కరింపఁబడుచున్నాడు.

బీజాక్షరసంపుటి:-

వర్ష్యనామముకంటె అవర్ష్యనామమున అకారము మాత్రము అధికముగాగలదు. ఇందుగల వీజాక్షరములును సప్తకిరణములను, సప్తధాతువులను సూచించును. ఈనామము నుపాసించువాడును వర్ష్యనామోపాసకుడు పొందు శక్తులనే పొందగలడు.

— 13. వ. యజుస్సు —

"నమోమేఘ్యాయచవిద్యుత్యాయచ"

అర్థము:-

మేఘ్యాయచ = మేఘమునందున్నట్టియును, విద్యుత్యాయ = మెఱపుతో సహసంచరించునట్టి శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— మహాదేవుడు మేఘమునందు జలవాయ్వగ్నిరూపముననుండెను అతడు విద్యుత్తునందు (మెఱపునందు) సువర్ణచ్ఛాయరూపముననుండెను. అందుచే ఆతనిని నమస్కరించుచున్నారు.

199 నామము:- శివ:- "నమోమేఘ్యాయచ"

శ.భా.భా. :— "ధూమజ్యోతిస్సలిలమరుతాంసన్నిపాతఃక్వమేఘః" అను కాళిదాససూక్తిచే "పొగ, అగ్ని, నీరు, గాలి" అను నాల్గింటికలయికచే మేఘము ఏర్పడినట్లు తెలియుచున్నది. వాయ్వగ్నిజలములు శివస్వరూపములు మేఘమున జలాగ్నివాయురూపమున నుండిలోకమునకుమేలుచేయుటచే మహాశివుడు మేఘ్యనామకుడాయెనని తెలియుచున్నది

విష్ణు:-

"జ్యోతిషాంరవిరంశుమాన్" "పవనఃపవతామస్మి" అను గీతాసూక్తులచే జ్యోతిస్సు, పవనము (గాలి) విష్ణువిభూతులని తెలియుచున్నవి. పైరెండును మేఘమునందుగలవు. కావున విష్ణువునకు మేఘ్యనామము ఉచితమని తెలియుచున్నది.

బీజాక్షరసంపుటి —

మేధ్యనామమున "మ్+ఏ+ఘ్+య్+అ" అని ఐదక్షరములు కలవు. అవి దంచాగ్నులను, పంచకోశములను సూచించును. ఇందు మదన బీజము వీరభద్రబీజమైన ఏకారముతోడును భైరవబీజమైన ఘకారము వాయు సర్వదేవబీజములతోడను గూడియున్నవి. పైనామము శైవులకు ముఖ్యోపాస్యము. ప్రాణాయామమున బైనామము నుపాసించువారు బాహ్యాభ్యన్తర శత్రుసంహారకులై సర్వసిద్ధుల నొనంగగలరని తెలియుచున్నది. అంతేకాదు, భౌతికములైన వాయువులతో నిండిన ఆయుధములను నిర్మింపగలవారలును అట్టి వాయుశక్తితో సర్వశత్రుసంహారకులును గాగలరని తెలియుచున్నది.

200 నామము:- శివ:- "నమోవిద్యుత్యాయచ"

భ.భా.భా. :— మహాశివుని రూపములలో నొకటగు జలము ప్రకృతిలో "మేఘము, విద్యుత్తు, స్తనయిత్నువు, వృష్టి" అను నాలుగు రూపములతో నున్నట్లు

"చత్వారివాఅపాగ్ంరూపాణి,
మేఘో విద్యుత్, స్తనయిత్నుర్వృష్టిః"

అనెడి ఆరుణ మంత్రముచే దెలియుచున్నది, అట్టి విద్యుత్తులోగల అగ్నియే శివునిరూపమైన వైద్యుతమని ప్రసిద్ధమైనది. వైద్యుతము, విద్యుత్యము ఒక్కటియే. కాన విద్యుత్తులో అగ్నిరూపముననున్న శివుడు విద్యుత్యనామకుడై నమస్కరింపబడుచున్నాడు.

విష్ణువు:—

"విశేషణద్యోతతఇతివిద్యుత్" అనువ్యుత్పత్తిచే విశేషముగా ప్రకాశించు విష్ణువు విద్యుత్తు అయెను. అందుగల తేజస్సే విద్యుత్యము. అదియే మహా

ప్రళయమున సహస్ర సూర్యతేజస్సుతో తుల్యమై యుండును. "తేజస్తేజస్వినామహమ్" అను గీతాసూక్తిచే తేజస్వులైన సూర్యచంద్రాగ్ని విద్యుత్తులందలి తేజస్సు విష్ణువిభూతియని తెలియుచున్నది. ఈ యర్థముననే "సహస్రార్చిస్సప్త జిహ్వః" అను విష్ణుసహస్రసూక్తిలోని సహస్రార్చి పదము విష్ణునామముగా పేర్కొనబడెను. సహస్రార్చి విద్యుత్య పదములు రెండును సమాన విషయములు కాన విష్ణువు విద్యుత్యనామకుడై నమస్కరింపబడెను.

విద్యుత్యనామమున "వ్ + ఇ + ద్ + య్ + ఉ + త్ + య్ + అ" అని ఎనిమిదక్షరములుకలవు. అవి అష్ట ప్రకృతులను, అష్టాంగములను సూచించును. ఇందు వరుణ విష్ణువాయువాస్తుసకల దేవబీజములు, దుర్గాబీజమైన దకారముతో గూడియున్నవి. ఇది దుర్గోపాసనకు ముఖ్యము. దుర్గాదేవి అగ్ని స్వరూపిణి. అందుచే నీనామము నుపాసించువారు సర్వార్థసిద్ధిదాయకులగుదురు. అంతేకాదు, సర్వవ్యాపకములైనట్టి జలాగ్నివాయ్వస్త్రముల నిర్మింపగలవారలై సకల భయంకరులై సర్వప్రపంచమును వశమొనర్చుకొని, రక్షింపగలవారలగుదురని తెలియుచున్నది.

-: 14. వ. యజుస్సు :-

"నమఈధ్రియాయచాతప్యాయచ"

అర్థము:-

ఈధ్రియాయ = నిర్మలముగా ప్రకాశించు శరత్కాలమేఘమున నున్నట్టియును, ఆతప్యాయచ = ఆతపముచే వర్షించు మేఘముననున్నట్టి శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము-

సా భా:— ప్రకృతిలోగల సకల వస్తువులందును బరమేశ్వరుడుకలడు. కాన అతడు నిర్జలమై నిర్మలముగా బ్రకాశించుమేఘముననుండెను. ఆతపముచే వర్షించుమేఘమునందును ఉండెను.

201 వ. నామము:- శివ:- "నమఈధ్రియాయచ"

భ భా. భా. మహాదేవుడు చక్కగా బ్రకాశించు శరత్కాలమేఘమున శ్వేత తేజోరూపుడైయుండి ప్రకృతిని బ్రకాశింపజేయును. అందుచే ఈధ్రినామకుడై యుండెను. అంతేకాదు. ఈ = మాయాశక్తిని, తనలో జలరూపమునదాల్చి యుండుటచే ఈధ్రియనామకుడాయెననియుజెప్పవచ్చును.

విష్ణు:—

శరత్కాలమేఘమున సకలమును ఆకర్షించి ఆనందపఱచుకాంతిరూపమున మహావిష్ణువుఉండెను. విష్ణుసహస్రమున శర్వరీకరనామము విష్ణుపరముగాగలదు. శర్వరీకరుడైన (రాత్రింకరుడైన) చంద్రునిలోగలప్రభ విష్ణుతేజస్సే. అది శరత్కాలమేఘమునందునుగలదు కావున విష్ణువు ఈధ్రియుడాయెను. ఈ = మాయాశక్తిస్వరూపిణియైన లక్ష్మీదేవిని తనవక్షంబునదాల్చి యుండువాడు కావున విష్ణువు ఈధ్రియనామకుడాయెను.

బీజాక్షరసంపుటి —

ఈధ్రియనామమున "ఈ+ధ్+ర్+ఇ+య్+అ" అని ఆరక్షరములుకలవు. అవి షడృతువులను షడింద్రియములను సూచించును. ఇందు మాయాశక్తిని, విష్ణువును సర్వదేవతలనుదెల్పు అచ్చులుకలవు. వాని నడుమను ధనదవాయ్వగ్నిబీజములుకలవు. ప్రాణాయామ ప్రక్రియలో శక్తి విష్ణువులను ధ్యానించి, పైనామము నుపాసించువారు దైవశక్తినార్జించుకొని

వాయ్వగ్నుల నుత్పాదించుయంత్రములను గనుగొని, వానిసాయమున భూజలస్థ ధనములను వెలిబుచ్చఁగలవారలగుదురు. వాయ్వగ్నిప్రకోపముచే గల్గు రోగములను నిర్మూలింపఁగలవారలగుదురని తెలియుచున్నది.

202 వ. నామము:- శివ:- "నమఆతప్యాయచ"

భ. భా. భా:— శివుడు సూర్యాగ్నిస్వరూపుడగుటచే సముద్రారణ్యాదులను, సకలచేతనాచేతనములను ఆతపముననుండి తపింపజేయును. విషక్రిములను దుర్వాసనలను దొలగించి, సకలమును ఆరోగ్యవంతముగావించును. అందుచే శివుడు ఆతప్యనామకుడాయెను.

విష్ణు:-

అజ్పూర్వకమగు "తప = తవనే" అనుధాతువునుండిఏర్పడిన ఆతప్య పదమునకు సంపూర్ణముగా తపంబొనర్చుటకును, ప్రత్యక్షముగావించుకొనుట కును దగినవాడగు విష్ణువు అని అర్థము. కావుననే ధ్రువాదులాతనినిగూర్చి తపంబొనర్చిరి. అందుచే విష్ణువు ఆతప్యనామకుడాయెను.

బీజాక్షరసంపుటి—

ఆతప్యపదమున "ఆ+త్+అ+ప్+య్+అ" అని ఆరక్షరములు కలవు. అవి షడావరణలను, షడింద్రియములను సూచించును. పరాశక్తి ప్రధానముగాఁ బైనామము నుపాసించి వాతరోగములను నిర్మూలింపగల వారును వాయుప్రేషకయంత్రములను నిర్మించువారును కృత్రిమమేఘ నిర్మాతలునుగాఁగలరని తెలియుచున్నది.

— 15. వ. యజుస్సు —

'నమోవాత్యాయచరేష్మియాయచ'

అర్థము:-

వాత్యాయ = వాయువుతో గూడినవర్షముకురిపించువాడును, రేష్మియాయచ = సకలభూతములు నశించుప్రళయకాలమున నుండువాడును ఇసుక రాళ్లు మున్నగువానితో గూడిన వర్షమునొసంగువాడునగు శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— పరమశివుడు సంహారకర్తయగుటచే వ్యష్టిగా, సమష్టిగాను శిక్షలనొసంగ సమర్థుడు. అందుచేతనే పెనుగాలులతో గూడిన వర్షముకురిపించియు, ఇసుక, రాళ్ళు, వడగండ్లు, అగ్నికణములు, మున్నగువానితో గూడిన, వర్షముకురిపించియు, జీవులను శిక్షించును. అందుచే ఆతనిని నమస్కరించుచున్నారు.

203 వ. నామము- శివ;- "నమోవాత్యాయచ"

భ. భా. భా:— మహాదేవుడు వర్షముకురిపించి ప్రకృతిని, బోషించును. ప్రపంచమంతటను వర్షముపడుటకు వాయుసహాయము అవసరము. వాయువు శివస్వరూపము కావున వాయువుతోగూడిన వృష్టిలోఁదానుండెను. అంతే కాదు. గాలివానలో అగ్నిస్వరూపుడైయుండివేడిగాలులు వీపించి, ప్రకృతిని శిక్షించును. కావున శివుడు వాత్యనామకుడాయెను.

విష్ణు:—

"పవనఃపవతామస్మి" అను గీతాసూక్తిచే వాయువు విష్ణు విభూతియని తెలియుచున్నది అందుచే విష్ణువు జీవులకు జీవనము నొసంగుటచే ముని వాయు

రూపమున ఉండెను. అందుచే విష్ణువు వాత్యానామకుడాయెను. "పవనః పావనోఽనలః" అను విష్ణుసహస్రసూక్తిలోఁగల పవననామమును ఈవాత్యనామమును సమానభావముగలవి. కావున విష్ణువునకును వాత్యానామము చెల్లును. పృధివిలోఁ బుణ్యగంధమువీచుటకు విష్ణువు వాయురూపుడై యుండుటచే వాయునామము విష్ణువునకు ఏర్పడెను. అందుచేతనే వాష్ప్రావాయురధోక్షజః" అను విష్ణుసహస్రసూక్తిలో వాయునామము విష్ణుపరముగాగలదు. వాత్యవాయునామములును సమానభావములే. కావున విష్ణువు వాత్యానామకుడాయెను.

బీజాక్షరసంపుటి:-

వాత్యానామమున "వ్+అ+త్+య్+అ" అని ఐదక్షరములు కలవు. అవి పంచాగ్నులను, పంచకోశములను సూచించును. పైనామమున వరుణవాస్తువాయుబీజములు అకారాకారములతోగూడియున్నవి. పరాశక్తి ప్రధానముగాఁ బైనామము నుపాసించువారు, జలోదరవాతపిశాచాదిబాధలను దొలగించగలరు. అంతేకాదు. జలవాయుయంత్రములను గనుగొని, వాని సాయమున నూతనయంత్రనిర్మాతలుకాఁగలరని తెలియుచున్నది

204 నామము- శివ:- "నమోరేష్మ్యియాయచ"

భ. భా. భాః— పరమశివుని ప్రభావముచే భూతప్రేతాదులు మిక్కిలి వేగముగా నశించును యుగాన్తకాలమున "సంవర్త"మని ప్రసిద్ధమైనవాయువు శిలాపాషాణములను వర్షింపఁజేసి సర్వమును నాశనముచేయును. దానినే "రేష్మ" అందురు. అది శివస్వరూపము. గ్రీష్మఋతువునుగూడ రేష్మయందురు. గాలిచే ఎగిరిపడు ఇసుకరేణువులుకూడ రేష్మలు అనుఁబడును. వానియందును శివశక్తికలదు. కావున శివుడు రేష్మియనామకుడాయెను.

విష్ణు:—

"భూతాత్మాభూతభావనః" అను విష్ణుసహస్రసూక్తిచే రేష్మలు అనగా నశించునట్టి భూతములు విష్ణువు వానిలోఁ దానాత్మయైయున్నాడని తెలియు

చున్నది. కావున భూతాత్మనామమును, "రేష్మియ" యనునామమును సమానార్థకములేయని తెలియుచున్నది రేష్మియుడనగా రేష్మలందున్న వాడనితెలియుచున్నది. విష్ణు శక్తిగలవాయుభేదమే సంవర్తము. అందుండి విష్ణువు ప్రళయమున భయంకరముగావీచి, సర్వమును నశింపఁజేయును. పైకారణములచే విష్ణువునకును రేష్మియనామము సార్థకమేయనితెలియు చున్నది.

బీజాక్షరసంపుటి—

రేష్మియనామమున "ర్ + ఏ + ష్ + మ్ + ఇ + య్ + అ" అని విడ క్షరములుకలవు. అవి సప్తధాతువులను సూచించును. వానిలో వీరభద్ర బీజము అగ్నిబీజమైన రేఫముతోడను, సూర్యమదనబీజములు విష్ణుబీజమగు ఇకారముతోడను, వాయుబీజముదేవబీజమగు అకారముతోడనుగూడియున్నవి. పైనామమును సూర్యప్రధానముగా నుపాసించువారు లోకములందలి శత్రు శక్తులను నశింపజేయగలవారును, కామోద్రేకముతోఁ బ్రవర్తించి సంపా దించిన అగ్నివాయుప్రకోపజాతరోగములను నివారించువారునుగాఁగలరని తెలియుచున్నది. ప్రాణాగ్నిప్రాణవాయుసహాయమున సూర్యమండలగాము లగుటయేకాక సూర్యకిరణశక్తిగ్రాహకులై లోకరక్షకులుకాఁగలరనియును దెలియుచున్నది.

— 16. వ. యజుస్సు —

"నమోవాస్తవ్యాయచవాస్తుపాయచ"

అర్థము:-

వాస్తవ్యాయచ = ధనరూపముననను, గవాశ్వాదిరూపముననుఉండుటయే కాక, తత్కార్యరూపముననున్నటియును, వాస్తుపాయచ = గృహనిర్మాణ భూమియైన వాస్తువును బాలించువాడునగు శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా భా:— భగవంతుడు శివుడు సకలచరాలరవస్తువులందును గలడు. ముఖ్యముగా జనులజీవనాధారమైన ధనమునందును, గవాశ్వాదులందును గలడు. గృహనిర్మాణమునకు అవసరమగు భూమిలో వాస్తుపురుషరూపముననుండి జీవులను రక్షించును కావున అతనికి నమస్కారము.

205 నామము- శివ: "నవాస్తవ్యాయచ"

భ. భా. భా:— "మేధనంచమేవసుచమేవసతిశ్చమే" అను చమకమంత్రమున జీవులు అపేక్షించుధనమునందుండి శివుడు జీవులను రక్షించును. అని కలదు. గోవులు అశ్వములు మున్నగువానిలోనుండి మహాశివుడు క్షీరాదిజీవన సామగ్రినిచ్చుననియును దెలియుచున్నది. యోగక్షేమంవహామ్యహమ్" అను సూక్తిలో జెప్పినట్లు జీవులవస్తుభారమును వహించియు రక్షించుచున్నాడు. కావున వాస్తవ్యనామము శివునకేర్పడెను.

విష్ణు:—

"గతిర్భర్తాప్రభుః" నేను సకలమునకును గతినైయున్నాను. "మత్తః సర్వంప్రవర్తతే" నానుండే సర్వమును బ్రవర్తించుచున్నది. "జీవనం సర్వభూతేషు" సర్వప్రాణులందునుగల జీవమునునేనే. అనిగీతలో భగవంతుడు చెప్పినాడు. కాన విష్ణువు వస్తువులందు అనగా ధనము గోవులు, అశ్వములు మున్నగువానియందుండి జీవుల సకల జీవనమును నడుపుచున్నాడు. కావున విష్ణువు వాస్తవ్యనామకుడాయెనని తెలియుచున్నది.

బీజాక్షరసంపుటి-

వాస్తవ్యనామమున "వ్ + అ + స్ + త్ + అ + వ్ + య్ + అ" అని ఎనిమిదక్షరములు కలవు. అవి అష్టసిద్ధులను, శరీరమందలి అష్టచక్రములను సూచించును. ఇందు పరాశక్తిబీజములు రెండుకలవు. కావున శక్త్యుపాసనకు ఇది ప్రధాననామము. పైనామము నుపాసించువారు సకల చర్మరోగములను, భూతదిబాధలను, జలవాతసంబంధిరోగములను నివారింపగలవారలగుదురని తెలియుచున్నది. అంతేకాదు జలవాయువులందుఁగల అగ్నిని వెలిబుచ్చుయంత్రములను నిర్మింపగలరనియుఁ దెలియుచున్నది.

206 నామము- శివ- "నమోవాస్తుపాయచ"

భ. భా. బా:— వాస్తుప్రభావము "అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశత్వము, వశిత్వము" అను రీతిని అష్టవిధములై యున్నది. అందుండి లోకములనుగాపాడును, గాన శివుడు వాస్తుపనామకుడాయెను. "నమోరుద్రాయవాస్తోష్పతయే" అను శ్రుతిచే వాస్తువనగా స్వామియై రక్షించువాడు కాన వాస్తుపనామకుడాయెను. వాస్తోష్పతి వాస్తుప పదములు సమానములే. అవి ఇంద్రుని దెల్పును. శివుడు ఇంద్రరూపుడై లోకములను రక్షించును; కాన వాస్తుపనామకుడై నమస్కరింపబడుచున్నాడు.

విష్ణు-

"వస్తువేవాస్తువు" అని వ్యాకరణమున వస్తుపదమువాస్తుపదముగా మారును. వాస్తువు అనగా సత్యము. విష్ణువు సత్యస్వరూపుడైయుండి, ప = రక్షించుచున్నాడు; కాన వాస్తుపనామకుడాయెను. వాస్తు అనగా నివాసభూమి అదియే జీవులకు, శరణము = రక్షకము. "నివాసశ్శరణం సుహృత్" అని గీతలోఁ జెప్పినట్లు విష్ణువువాస్తువై నివాసస్వరూపుడై జీవులను రక్షించుచున్నాడు. కావున విష్ణువునకు వాస్తుపనామముచెల్లును.

బీజాక్షరసంపుటి:-

వాస్తుపనామమున "వ్+అ+స్+త్+ఉ+ప్+అ" అని ఏడక్షర ములుకలవు. అవి సప్తవాయుమండలములను, సప్తధాతువులను సూచించును. పైనామమున శక్తిబీజములు రెండుకలవు. కావునఁ బ్రాణాయామమున శక్తిని బ్రధానముగా ధ్యానించి, ఉపాసించి, మహిమనార్జించి, శారీరికరోగనివారక యంత్ర నిర్మాతలును, జలవాయుప్రేషకయంత్రనిర్మాతలును గృత్రిమమేఘ నిర్మాతలునై వృష్టికరులును, రాజవశీకరులునుగాఁ గలరనితెలియుచున్నది.

భ భా. భాష్యము:— సప్తమానువాకమంత్రపురశ్చరణవిధానము ఇందుఁ గలదు. ఒకదినమున ఉపవాసమొనర్చి, 8 వందల జపముచేసినఁ బురశ్చరణ గావించినవాడగును. చతుర్వర్ణములవారును వశముకావలెనని కోరినచో అశ్వత్థోదుంబరవటప్లక్షసమిధలను దధిమధుఘృతములతోఁ దడిపి, 10 వేల హోమము ఈయనువాకముతో జేయవలెను. మేధాశక్తికావలెనని కోరినవాడు కపిల గోవునేతితో 5 వేలహోమముచేయవలెను. వానికి మేధావియైనపుత్రుడు జన్మించును పుష్టికావలెనని కోరినవాడు, అపూపములతో 9 వేలహోమము చేయ వలెను. ఆరోగ్యమును గాంక్షించువాడు ఖాదిరసమిధలను దధిమధుఘృత ములతోఁ దడిపి, 5 వేలహోమముచేయవలెను. సౌందర్యకాంక్షి 10 వేల మామిడి చిగుళ్ళను దధిమధుఘృతములతోఁ దడిపి హోమము చేయవలెను. శ్రీకాముకుడు కాన్తారమున స్వాకారప్రమాణముగల అగ్నికుండమును ద్రవ్వి అందుంచిన మథితాగ్నిలోఁ దెల్లకమలములను దధిమధుఘృతములతోఁ దడిపి 5 వేలహోమముచేయవలెను. ఇట్లాచరించినచో వానివంశము పరమేశ్వర ప్రసాదముచే భూమియున్నపర్యంతము వృద్ధినొందును. కార్పాసవస్త్రకాంక్షి, ప్రత్తిగింజలను తేనెతోఁ దడిపి 10 వేలహోమముచేయవలెను. గోవులుకావలె నని కాంక్షించువాడు గోవులమందలో ఈయనువాకమును జపించుచు 10వేల ప్రదక్షిణములుచేసినచో గోవులనుబొందును. పుత్రకాముడు పలాశసమిధలను

దధిమధుఘృతములతోఁదడిపి, 10 వేలహోమముచేసినచో వంశకరుడైన పుత్రుని బొందును. ఆయుర్దాయమును గాంక్షించువాడు దూర్వాలను నేతిలో దడిపి, ప్రతిసంవత్సరము 10వేల హోమముచేసినచో శతసంవత్సరములు జీవించును. విద్యలనుగోరువాడు అశ్వత్థసమిధలను నేతితోఁదడిపి, 100 వేల హోమముచేసినచో సర్వవిద్యాపారంగతుడగును. రాజ్యమును గాంక్షించువాడు సౌగంధికసమిధలనుతేనెలోఁ దడిపి, 5 లక్షలహోమముచేసినచోఁ జక్రవర్తియై జన్మించును.

పిమ్మట ముక్త్యుపాయము చెప్పబడుచున్నది. మోక్షమును గాంక్షించువాడు తొలుత చాంద్రాయణవ్రతమునాచరించి, ఈయనువాకమును 21 వేలు జపించి అటుపిమ్మట 5 వేల ప్రదక్షిణములు ఆచరించి ప్రాణాయామము ఒనర్చిన పిమ్మట శంభునిసన్నిధిని అగ్నిలోఁ బలాశాశ్వత్థసమిధలను మధుఘృతములతోఁదడిపి, 3 లక్షలహోమముచేసినచో శంభుని ప్రసాదమువలన ముక్తుడగును అన్త్యకులజాతులు సైతము రౌరవనరకమునఁ బడ్యమానులైనను శివపురమున రమింతురు ఇంద్రపంచకముగడిచిన పిమ్మటను ఆయా కులజాతులు పైనఁ జెప్పినట్లుచేసి పృథివియున్నంతకాలము వృద్ధినొందుదురు

ధ్యానము:-

శ్లో॥ జటాభిర్లంబమానాభిర్నృత్యంతమభయప్రదం।
దేవంశుచిస్మితంధ్యాయేత్ వ్యాఘ్రచర్మపరిష్కృతమ్॥

తాత్పర్యము-

వ్రేలాడుచున్నజటలతో నాట్యముచేయునట్టియును, అభయమొసంగువాడును, తెల్లని చిఱునవ్వుగలవాడును, వ్యాఘ్రచర్మముదాల్చినవాడునగు మహాదేవుని ధ్యానించవలెను.

ఈశ్లోకమును జపించినను, ఈ యనువాకమంత్రములను జపించి, హోమప్రదక్షిణలు గావించినను పైనఁజెప్పినఫలములను అందఁగలరని తెలియుచున్నది.

రుద్రాభిషేకమహాత్మ్యము

:: అష్టమానువాకము :-

ఈ యనువాకమందును అన్యతరతోనమస్కారములైన యజుస్సులు చెప్పఁబడుచున్నవి.

"ఓంనమస్సోమాయచ రుద్రాయచ"

అర్థము:-

సోమాయచ = ఉమతోఁగూడియున్నట్టియును, రుద్రాయచ = సకల జీవులరోదనహేతువైన దుఃఖమును ద్రవింపఁజేయునట్టి, శివునకు నమః = నమస్కారము.

తాత్పర్యము-

సా. భా:— మహాదేవుడు అర్ధనారీశ్వరావతారమునఁ బార్వతీదేవితోఁగూడి యుండెను. అతడు సకలజీవులను దుఃఖింపఁజేయుకష్టములను నశింపఁజేయును కాన అతనిని నమస్కరించుచున్నారు

207 నామము- శివః "ఓంనమస్సోమాయచ"

భ. భా. భా:— "నమస్సోమాయ" మొదలు "నమోవఃకిరికేభ్యః" అను నంతవరకునుగలవి ఒకే మంత్రముగానున్నవి. దీనికి భగవంతుడే" ఋషి. మహానుష్టుప్ ఛందస్సు. దేవతయును భగవంతుడే. ఇటదేవుని అనుగ్రహ రూపములైన మంత్రములు ప్రదర్శింపఁ బడుచున్నవి. మహాశివుని అనుగ్రహ రూపమును ప్రకటించుటకు రుద్రుడు, పశుపతి మున్నగుపదములు పూర్వోక్తములైనను మరల చెప్పఁబడుచున్నవి.

జీవులపట్లను, అందునను భక్తులపట్లను దనకుఁగలప్రసాదమును, దయను బ్రదర్శించుటకై మహాశివుడు ఉమాసహితుడై కనఁబడి నమస్కరింప బడుచున్నాడు. సోముడు అనగాఁ జంద్రుడు. రుద్రుడు చంద్రాత్ముడై అమృత కిరణములద్వారా, ఆహారమును సమర్పించి, సకలచేతనాచేతనములను ఆనందపఱచుటయేకాక పితృదేవ మనుష్యులకు ముఖ్యముగాఁ దృప్తికల్గించు చున్నాడు. సోమయాగాత్మకుడై సోమయాగరూపమున బురుషులకు అభివృద్ధిని జేకూర్చుచున్నాడు. సోమరూపుడై = వాయురూపుడై జీవులను బ్రతికించు చున్నాడు. పైకారణములచే శివుడు సోమనామకుడై నమస్కరింపబడుచున్నాడు

విష్ణు-

మహావిష్ణువు చంద్రరూపుడై ఓషధులను బోషించుటచే సోమనామకుడై "సోమపోఽ మృతపస్సోమః" అని విష్ణుసహస్రసూక్తిలోఁ బేర్కొనబడెను. పాలసముద్రమును మధించునపుడు విష్ణువుకూర్మరూపుడై మంథరపర్వత మును జలమునఁ దేల్చియుంచుటచే అందుండి అమృతముఉద్భవించెను. "సూతేఅమృతమితిసోమః" అనువ్యుత్పత్తిచే ఈయర్థమే ప్రకటింపఁబడు చున్నది. కావున విష్ణువుసోమనామకుడాయెను. సోమపదమునకు, గాలి, యముడు అనియు నర్థములుకలవు. విష్ణువుయమరూపుడై సకల జీవులను శిక్షించుచు సన్మార్గమున నియమించుచున్నాడు. కావున విష్ణువు సోమనామకు డాయెననియుఁ జెప్పవచ్చును.

బీజాక్షరసంపుటి:-

సోమనామమున "స్+ఓ+మ్+అ" అని నాల్గక్షరములుకలవు. అవి ధర్మార్థకామమోక్షములను అంతఃకరణచతుష్టయమును సూచించును. ఇందు సకారౌకారములు శక్తిశివబీజములు. వానితో మదనబీజములుకూడియున్నవి. పైనామమును శివశక్త్యభేదముగా నుపాసించువారై సర్వశక్తులను సము పార్జించుకొని విజ్ఞానులై స్థితికరులును సర్వఫలప్రదులును గాఁగలరని

తెలియుచున్నది. అంతేకాదు. అణిమాద్యష్టసిద్ధులనొందినవారై సర్వకార్య జయప్రదులును అగుదురనితెలియుచున్నది

208 నామము- శివ:- "నమోరుద్రాయచ"

భ. భా. భా:— ఈరుద్రనామార్థము శివవిష్ణుబీజాక్షరాది పరముగా ఇంతకముందు వివరింపబడెను.

— 2. వ. యజుస్సు —

"నమస్తామ్రాయచారుణాయచ"

అర్థము:-

తామ్రాయచ = ఉదయకాలమున అదిత్యరూపుడగుటచే అత్యంత రక్తవర్ణుడైయున్నట్టియును, అరుణాయచ = ఉదయానంతరమున ఇంచుకంతరక్తవర్ణుడైయుండునట్టి శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— పరమశివుడు సూర్యస్వరూపుడు. సూర్యుడు ఉదయకాలమున మిక్కిలి యెఱ్ఱగానుండును. అతడే ఉదయించినపిమ్మట ఇంచుకంతరక్తవర్ణుడై యుండును. మహాదేవుడు సూర్యరూపమునఁ బ్రకాశించి, జీవులను మేల్కొలిపి జ్ఞానమునొసంగును. సకల జంతువులకును వారివారికర్మలను అచరించుటకుఁ బురికొల్పి, ఆరోగ్యదాతయైకాపాడును.

209, 210. నామములు-

తామ్ర అరుణనామముల యర్థము, శివవిష్ణు బీజాక్షరసంపుటి పరముగా ఇంతకుమున్నే వివరింపబడెను. శ్రీవిష్ణుసూరిగారి భాష్యానుసారమైన అర్థము శాక్తాద్వైతపరముగవ్రాయబడు గ్రంథభాగమున ముందు వివరింపబడును.

-: తృతీయ యజుస్సు :-

'నమశ్శంగాయచ పశుపతయేచ'

అర్థము:-

శంగాయచ = సుఖమును బొందించువాడును, సుఖము నుత్పాదించు వాడును, పశుపతయేచ = భయహేతువులైన పాపరోగచోరాదులనుండి రక్షించువాడునగు మహాదేవునకు నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. సా:— భగవంతుడైన మహాదేవుడు సూర్యాదిరూపములతో జీవులకు సుఖమును జేకూర్చును. పాపరోగచోరాదులనుండి భయపడు జీవులను రక్షించును. కాన అతనికి అందఱును నమస్కరించుచున్నారు.

211 వ. నామము:- శివ:-

భ. భా. భా:— పరమశివుడు జీవులకు సూర్యస్వరూపుడై ఆరోగ్యమును, అగ్నిస్వరూపుడై జీర్ణశక్తిని, వాయుస్వరూపుడై ప్రాణశక్తిని, చంద్రస్వరూపుడై జీవశక్తిని ఒసంగి సుఖమును జేకూర్చుటచే శంగనామకుడాయెను.

విష్ణు:—

"సుఘోషస్సుఖదస్సుహృత్" "సుఖదోనైకదోఽగ్రజః" అను విష్ణు సహస్రసూక్తులలో "సుఖదః" అను నామము విష్ణుపరముగాఁగలదు. విష్ణువు రావణాదిదుష్టులను సంహరించి, లోకమునకు సుఖముచేకూర్చెను. మకర మునుఖండించి, గజేంద్రునకు సుఖముచేకూర్చెను. ప్రహ్లాదునకు సుఖము నిచ్చెను. శంగః = సుఖమునుజేకూర్చువాడు అను నర్థముగల శంగ నామము సుఖదనామమును, సమానార్థకములేకాన విష్ణువును శంగనామకుడేయని తెలియుచున్నది.

బీజాక్షరసంపుటి—

శంగనామమున "శ్+అ+మ్+గ్+అ" అనియైదక్షరములుకలవు అవి పంచభూతములను, పంచేంద్రియములనుసూచించును. ఈనామమును లక్ష్మీగణపతి ప్రధానముగా నుపాసించువారికి సకల సంపదలును లభించును నిర్విఘ్నముగా సకల కార్యములునెఱవేర్చి, సకలకాంక్షలను బొందఁగల వారలగుదురని తెలియుచున్నది.

212 నామము:- "నమఃపశుపతయేచ"

అను నామముయొక్క అర్థము ఇంతకుమున్నే వివరింపఁబడెను.

-: 4. వ. యజుస్సు :-

"నమఉగ్రాయచ భీమాయచ"

అర్థము:-

ఉగ్రాయచ = విరోధులను నశింపఁజేయుటకుఁగ్రోధయుక్తుడైనట్టియును, భీమాయచ = దర్శనమాత్రమున విరోధులకు భయహేతువైనట్టి శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— మహాదేవుడు జీవులకుఁగల బాహ్యశత్రువులను, అంతరంగిక శత్రువులను నశింపఁజేయుటకు ఉగ్రరూపముననుండెను. ఆతడుకంటితోఁ జూచినమాత్రాన శత్రువులకు భయమొదలించి, జీవులను రక్షించుచుండెను. అందుచే అతనికి నమస్సులర్పించుచున్నారు.

213 వ. నామము- శివ:- "నమఉగ్రాయచ"

భ. భా. భా:— "భయకృత్ భయనాశనః" అని పెద్దలుచెప్పినట్లు భగవంతుడైన మహాదేవుడు కర్మఫలానుభవమునకు అనుకూలముగా పాపరోగ నరకాదులను జేకూర్చి, జీవులకు భయము ఒదవించుచున్నాడు అతడే యజమానియు, అధిష్ఠాతయునగుటచే జీవులను రక్షించుటకుగాను, వారిరోగాదులను అడంచుచున్నాడు. అతడే వారికిఁగల కామక్రోధాద్యాంతరంగిక శత్రువులను, బాహ్యశత్రువులైన రాక్షసులను నాశనముచేయుటకై ఉగ్రమూర్తిగానున్నాడు. కావున శివుడుగ్రనామకుడాయెను.

విష్ణు:—

ఉగ్రస్సంవత్సరోదక్షః" అను విష్ణుసహస్రసూక్తిలో ఉగ్రనామము విష్ణుపరముగాఁగలదు. "భీషోదేతిసూర్యః" అను శ్రుతిలోఁ జెప్పినట్లు సూర్యాదులకు విష్ణువు భయమొదవించుటకు నారసింహాదిభయంకరరూపమునను న్నాడు. కావున విష్ణువును ఉగ్రనామకుడాయెను.

బీజాక్షరసంపుటి-

ఉగ్రనామమున "ఉ+గ్+ర్+అ" అని నాల్గక్షరములుకలవు అవి చతురగ్నులను అంతఃకరణచతుష్టయమును సూచించును. ఇందు వాయ్వగ్ని బీజములు గణపతిదేవబీజములతోఁగూడియున్నవి. పైనామమును గణపతి ప్రధానముగా నుపాసించి వాయ్వగ్నిభేదములను గనుగొని వానిచే సంహరింపదగు ఆయుధములను శీఘ్రముగా నిర్మింపఁగలవారలగుచున్నారు; వాతాగ్నిమాంద్యాదిరోగనివారకులునగుచున్నారు; అని తెలియుచున్నది.

214 నామము- శివ- "నమోభీమాయచ"

భ. భా. భా:— మహాశివుడు భీముడు; అనగాఁ బాపరోగాదులకే భయహేతువు. ఆతనిమహిమచే జీవుల నాక్రమించియున్న పాపరోగాదులు వడా

పంచలగును. ఈతనివలన సకల లోకములను బీడించు రాక్షసులు భీతులు అగుదురు ఈతడాకాశమూర్తికి అధిష్ఠాతకావున ఆకాశమునందును రాక్షసాదులుండుటకు వెఱచెదరు.

"భీషాస్మాద్వాతఃపవతే భీషోదేతిసూర్యః—మృత్యుర్ధావతి పంచమఇతి"

అను శ్రుతిచే వాయువు, సూర్యుడు, అగ్ని, ఇంద్రుడు, ఈతనిమూర్తులైనను, ఈతనివలన భీతులైమెలుగుచున్నారట. బ్రహ్మాండమంతటిసిబట్టి మ్రింగునట్టి మృత్యువుసైతము ఈతనివలన భీతుడై పఱువులిడుచున్నాడట. కావుననే మహాశివుడు భీమనామకుడాయెనని తెలియుచున్నది.

విష్ణు:-

"అతులశ్శరభోభీమః భీమోభీమపరాక్రమః" అను విష్ణుసహస్రనూక్తులలో భీమనామము విష్ణుపరముగాఁగలదు. విష్ణువు సర్వభయంకరుడు. హిరణ్యాక్షాదులను ద్రుంచినాడు. శ్రీరామావతారమున సముద్రుడుకూడ భయపడి, ప్రత్యక్షమై, అమోఘమగు అతని బాణమును దనలోదాగియున్న రాక్షసులుగల ప్రాంతమున విడిచిపెట్టించినాడు. ఇట్టి గాథలెన్నియోకలవు. "మహద్భయంవజ్రముద్యతమ్" అను శ్రుతిలోఁ బరమాత్మ వజ్రమువలె అప్రతిహతుడు; భయకారకుడు; అని తెలియుచున్నది. కావున విష్ణువును భీమనామకుడాయెనని తెలియుచున్నది,

బీజాక్షరసంపుటి:-

భీమనామమున "భ్ + ఈ + మ్ + అ" అని నాల్గుఅక్షరములుకలవు. అవి చతురగ్నులను, అంతఃకరణచతుష్టయమును సూచించును. ఇందు భార్గవబీజము, మాయాశక్తిబీజముతోఁగూడియున్నది. కావునఁ బైనామమును ఉపాసించువారు జ్ఞానులై శాక్తేయులై సకలైహికకామములను బరిత్యజించగలరని తెలియుచున్నది. అంతేకాదు. లౌకిక వ్యవహారములందు సకల సిద్ధులను బొందఁగలరనియుఁ తెలియుచున్నది.

— 5. వ. యజుస్సు —

"నమో అగ్రేవధాయచ దూరేవధాయచ"

అర్థము:-

అగ్రేవధాయచ = అగ్రమునందు వధగలవాడు, అనగా ఎదుటనున్న వారిని వధించునట్టియును, దూరేవధాయచ = దూరమందు వధగలవాడు, అనగా దూరమందున్నవానిని వధించునట్టి శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— మహాదేవుడు సర్వవ్యాపకుడు. అతనికెందును అడ్డులేదు. అతడు ఎదురుగానున్న శత్రువులనుగాని, దూరమందున్నశత్రువులనుగాని చంపగలడు ఆకారణమున లేశమంతదోషముగలవారైనను భయంపడి అతనిని నమస్కరింతురు.

215 నామము శివ:- "నమో అగ్రేవధాయచ"

భ. భా. భా:—

నమోఽస్తురుద్రేభ్యోయేపృధివ్యాంయేఽన్తరిక్షే"

అను శ్రుతిచేత పరమేశ్వరుడు పృధివిలోను, అంతరిక్షమున దివియందు అంతటను ఉన్నట్లుతెలియుచున్నది. మహాదేవుని స్వరూపములే పంచభూతములు. వానిలో అణుశక్తి కలదు. వాని ఆయుధములైన త్రిశూలాదులందును, అణుశక్తికలదు అందుచే అతడు సకలాయుధములందును, శతఘ్ని మున్నగువానిలోనుండి, ఎదురుగానున్నవైరులను, వ్యతిరేకశక్తులను, శత్రు దేశములను సైతము వధించి, భస్మముచేయగలడు. అందుచే అతనికి అగ్రే వధనామము సార్థకము.

విష్ణు-

"పురుషఏవేదగ్ంసర్వమ్; పాదోఽస్య విశ్వాభూతాని;
చక్షోస్సూర్యోఽజాయత; ముఖాదింద్రశ్చాగ్నిశ్చ"

అను శ్రుతులచే బ్రహ్మాండమంతయును విష్ణుస్వరూపమేయనియును, అతని నేత్రములనుండి సూర్యుడు, ముఖమునుండి ఇంద్రాగ్నులు ప్రభవించినట్లును దెలియుచున్నది. అందుచే విష్ణుస్వరూపములే పంచభూతములనియును, అతని ముఖనేత్రములు అగ్నిమండలములనియును దెలియుచున్నది. అందుచే అతని ఆయుధములును అణ్వస్త్రములేయని తెలియుచున్నది. కాన అతడు ఎదురుగా నున్న శత్రువులను శత్రుదేశములనుగూడ ధ్వంసముచేయఁగలవాడనియును దెలియుచున్నది. అందుచే విష్ణువు అగ్రేవధనామకుడని చెప్పవచ్చును.

సం

అగ్రేవధనామమున "అ+గ్+ర్+ఏ+వ్+అ+ధ్+అ" అని యెనిమిదక్షరములుకలవు. అవి అష్టప్రకృతులను, శరీరస్థాష్టచక్రములను సూచించును. ఈనామమున వీరభద్రబీజమైన ఏకారము, అగ్నిబీజము రేఫము, వరుణబీజమగు వకారమును ప్రధానములు. వీనిని ప్రధానముగాఁ జేసి, పైనామము నుపాసించువారు జలాగ్నిరోగములను దొలగించఁగలవార లును, జలాగ్నిశక్తులచే భూమిలోని సకల ధనములను వెలిదీయఁగలవారలును అగుదురని తెలియుచున్నది. అంతేకాదు. ఈనాటి నూతనాయుధములైన అణు బాంబులను, ఉదజనిబాంబులను నిర్మింపఁగలవారలును అగుదురని తెలియు చున్నది. అణూదజనిశక్తులను ధరించు ఆయుధములను నిర్విఘ్నముగాఁ బ్రయోగించి, వీరభద్రునివలె సర్వసంహారకులగుటయేకాక, అణ్వాదిశక్తులను శాంతిసాధనములుగా వినియోగింపఁగలవారలును అగుదురని తెలియుచున్నది

216 నామము- శివ- "నమోదూరేవధాయచ"

భ. భా. భా:— పరమేశ్వరుడు తననేత్రాగ్నిచే దూరమునందుండు శత్రువు లను, దూరకాలమునందుండు దురాత్ములను ద్రుంచఁగలడు. ఖండాంతర వేధులు ఈతనిశక్తిజనితములే. కాన మహాశివుడు దూరేవధనామకుడై నమస్క రింపఁబడుచున్నాడు.

విష్ణు:—

"చక్షోస్సూర్యోఅజాయత" అను శ్రుతిచే సూర్యుడు విష్ణునేత్రముల నుండి ఉద్భవించినట్లుతెలియుచున్నది. ఆసూర్యమండలము అణ్వాగ్నిసంపూ ర్ణము. దానినెవ్వరును జేరలేరు. అట్టి అణ్వాగ్నివిష్ణుచక్రమునఁగలదు. అదియే సుదర్శనచక్రము దానితో ఎంతటిదూరమందున్న శత్రువులనైనను ఆతడు వధించఁగల్గినాడు. ఈనాటి ఖండాంతవేధులు ఆసుదర్శన చక్రపుటణువులే. వానితో దూరమందలివారిని వధించిన కారణమున విష్ణువును దూరేవధనామ కుడై నమస్కరింపఁబడుచున్నాడు.

బీజాక్షరసంపుటి-

దూరేవధనామమున "ద్+ఊ+ర్+ఏ+వ్+అ+ధ్+అ" అని యెనిమిదక్షరములుకలవు. అవి అష్టదిశలను, అష్టాంగములను సూచించును. దుర్గాబీజమైన దకారము భూమిబీజమైన ఊకారముతోడను, అగ్నిబీజము వీరభద్రబీజముతోడనుగూడియున్నవి ఈనామమును భూమియైన మూలా ధారమున దుర్గాగ్ని వీరభద్రులను ధ్యానించి, బాహ్యాంతర శత్రువులను, బాహ్యాంతరోగములను నివారింపఁగలరు సకల ధనరాసులను భూజలములను అన్వేషించి, పొందఁగలరు. అంతేకాదు. అగ్రేవధపదముచే డెలియు, అణ్వా ద్యస్త్రములనేకాక, దూరదేశధ్వంసక ఖండాంతరవేధులను దూరగమనము లైన రాకెట్లను, నిర్మింపఁగలవారలగుదురు. తమ తపశ్శక్తిచే భూజలాంతరస్థ

విధ్వంసకవస్తువులను అగ్నిశక్తితో వెలిబుచ్చఁగలవారలగుదురు. వాని నిర్మాణమునకవసరమైన ధనవస్తురాసులను జేకూర్చఁగలరు ఈనామమున గల దుర్గాగ్నివీరభద్రజలములు, విధ్వంసకరశక్తిసంపన్నములు. కాన ఉపాస కులు ఆశక్తులను బడయఁగలరని తెలియుచున్నది.

— 6. వ. యజుస్సు —

"నమోహన్త్రేచహనీయసేచ"

అర్థము:-

హన్త్రేచ = దూరసమీప వర్తిశత్రువులను ధ్వంసముచేయువాడును, శత్రు ధ్వంసకరూపముననున్నవాడును, హనీయసేచ = సర్వాతి శాయిశక్తిచే సర్వు లను సంహరించువాడునగు, శివునకు నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— అగ్రముననఁగాని దూరముననఁగానియున్న విరోధులను మహా దేవుడు అనాయాసముగా సంహరింపఁగలడు. లోకమున శత్రుహన్తకులైన వీరులందఱును రుద్రరూపులే శత్రుసంహారకవస్తువులన్నియు రుద్రతేజస్సం పూర్ణములే. సర్వాతిశాయిపరాక్రమసంపన్నుడై సర్వులను సంహరించువాడును మహారుద్రుడే. అందుచేతనే సర్వేశ్వరుడు అర్జునితో

శ్లో॥ మయైవైతేనిహతాఃపూర్వమేవ। నిమిత్తమాత్రంభవసవ్యసాచిన్॥

ఓసవ్యసాచీ! అర్జున! నీవునిమిత్తమాత్రముగానుండవయ్యా! నాచేఁబూర్వమే శత్రువులందఱును సంహరింపఁబడినారు; అని చెప్పినాడు. అందుచే ఆసర్వే శ్వరునకు నమస్కారము.

217 నామము- శివ:

భ. భా. భా.— సృష్టించుట బ్రహ్మవిధి. రక్షించుట విష్ణువిధి. సంహరించుట శివునివిధి. ముగ్వురును బరమాత్మస్వరూపులే. ఆతని మూర్తులే ఒక్కడే ముగ్వురుగామారినను, వారుగావించువిధుల ననుసరించి, భిన్నులుగా భావింపఁబడుచున్నారు. సంహరించువారందఱిలోను, నాశనముచేయువస్తువులన్నింటిలోను, శివశక్తికలదు. కావున శివుడు హన్తృనామకుడాయెను. శివశక్తి సూర్యునిలోఁగలదు. సూర్యుడు అష్టవిధస్వరూపుడై బ్రహ్మాండమంతటిలోఁగలదుష్టజీవులను సంహరించును.

"అరోగో భ్రాజఃపటరః పతంగః। స్వర్ణరో జ్యోతిషీమాన్
విభాసః। కశ్యపోఽష్టమః"
అనెడి అరుణశ్రుతిలో అష్టవిధ సూర్యమండలములు పేర్కొనఁబడెను.
"అగ్నిశ్చజాతవేదాశ్చ। సహోజా అరుణాప్రభుః।
వైశ్వానరోనర్యాపాశ్చ। పంక్తిరాధాశ్చసప్తమః। విసర్పేవాష్టమోఽగ్నీనామ్" అను శ్రుతిలో అష్టవిధాగ్నులుపేర్కొనఁబడెను. ఆయగ్నియే సముద్రమున బడబారూపమునను, అరణ్యములందు దవాగ్నిరూపమునను, జీవులలో జఠరాగ్నిరూపమునను, మేఘములందు వైద్యుతాగ్నిరూపముననుండి విశ్వక్రిమి సంహారముచేయుచున్నది. సముద్రజలము నుప్పొంగనీయక సమస్థితిలోనుంచుచున్నది. అటవికమృగసంఖ్యను అధికముకానీయక అరికట్టుచున్నది. ఈనాటి అణ్వాయుధములందును, ఖండాంతరవేధులందును, మారణాయుధములందును శివతేజస్సే, అగ్నిరూపమునఁగలదు. పైకారణములచే పరమశివుడు హన్తృనామకుడై నమస్కరింపబడుచున్నాడు.

విష్ణు:-

జగద్రక్షణకై విష్ణువు దశావతారములనుదాల్చి, సోమకహిరణ్యాక్షాది రాక్షసులనెందఱినో సంహరించెను. "అణోరణీయాన్ మహతో మహీయాన్" అను శ్రుతిచేఁదెలియు అణుశక్తి విష్ణుతేజస్సే విష్ణువు మహాహన్తకావుననే విష్ణుసహస్రమున "సర్వశస్త్రభృతాంవరః" "సర్వప్రహరణాయుధః" అను

నామముతోఁ బేర్కొనఁబడెను. "విదారణః" అను విష్ణునామమునకు సమస్త మును జీల్చిచెండాడువాడని యర్థముకలదు. "ఊరుక్రమ్హత్" అను సూక్తిలో విష్ణువు అణుశక్తిగాఁబేర్కొనఁబడెను. కావున విష్ణువునకు "హన్తృ"నామము చెల్లునని తెలియుచున్నది.

సం

"హన్తృ" నామమున "హ్+అ+న్+త్+ఋ" అని యైదక్షర ములుకలవు. అవి పంచాగ్నులను బంచకోశములను సూచించును. ఇందలి హకారము శివబీజము నకారతకారములు సావిత్రీవాస్తుబీజములు. అవి సకల దేవబీజముతోడను బ్రహ్మబీజముతోడనుగూడియున్నవి. పైనామము నుపా సించువారు పాపవినాశకులు, పితృగ్రహవినాశకులును అగుదురు. అంతేకాదు శక్తిశివులు ఇరువురును సంహారకరులేకాన ఈనాటిమారణాయుధ విశేషము లన్నింటిని దయాదుచేయుటకు పైలైనయంత్రములను సృష్టించఁగలవారలు అగుదురని తెలియుచున్నది.

218 నామము- శివ:- "నమోహనీయచ"

భ. భా. భా:— మహాదేవుడు విశ్వాతిశాయి బలముకలవాడై జీవులకన్నిటికిని ప్రభువుగానుండెను. అతనితేజస్సును ఏతేజస్సుమించలేదు. అందుచే అతని చేతనే మహాప్రళయమున సమస్తబ్రహ్మాండమును, సంహరింపఁబడును. కావున "హనీయాన్" అను నామము అతనికి సార్థకమాయెను.

విష్ణు:-

"తమేవభాన్తమనుభాతిసర్వమ్" ప్రకాశించునట్టి ఆతనిని అనుసరించియే సర్వమును బ్రకాశించుచున్నది. "యదాదిత్యగతంతేజః" సూర్యకాంతి సర్వత్రవ్యాపించినట్లే విష్ణుతేజస్సు సర్వత్రవ్యాపించును. అందుచే విష్ణువు నకు "జ్యోతిర్గణేశ్వరః" అను నామము సహస్ర సూక్తులలోఁగలదు. సకల తేజోగణములకును ఆతడే ఈశ్వరుడు కావున ఆతడే సర్వమును అతిశయ ముగా సంహరించుచున్నాడు అందుచే విష్ణువునకు "హనీయాన్" అను నామము సార్థకమాయెను.

బీజాక్షరసంపుటి:-

"హనీయాన్" అను నామమున "హ్ + అ + న్ + ఈ + య్ + అ + న్" అనియేడు అక్షరములుకలవు. అవి సప్తవాయుమండలములను, మనో బుద్ధులతోడి పంచేంద్రియములనుసూచించును. ఇందలి హకారము సర్వ సంహారక శివబీజము మాయాశక్తిపరాశక్తి బీజములు అకారేకారములు. వాని మధ్యను వాయుబీజముతోఁగూడిన సావిత్రీబీజములు రెండుకలవు. శక్తినుండి యేర్పడిన బ్రహ్మాండమును శివసహితయై మాయాస్వరూపిణియైన పరాశక్తియే సంహరించును. అజ్ఞానధ్వంసమునొనర్చి, జ్ఞానమొసంగునది సావిత్రీదేవి. ఆమెయే పాపవినాశిని. ఇదిశక్తిప్రధానమైన నామము. ప్రాణాయామక్రియలో శక్తిసహిత శివునుపాసించి, తపోఽగ్నిజ్వాలలతోసర్వమును సంహరింపఁగలరు. అంతేకాదు. బ్రహ్మాండధ్వంసకసకల మారణాయుధములను నిర్మింపఁగలరు. సకలరోగనివారకౌషధ నిర్మాతలై సర్వమును రక్షింపఁగలరని తెలియుచున్నది.

— 7. వ. యజుస్సు —

"నమో వృక్షేభ్యో హరికేశేభ్యః"

అర్థము:-

వృక్షేభ్యః = కల్పవృక్షాదిస్వరూపుడును, హరికేశేభ్యః = హరితవర్ణము లును, కేశసదృశములునగు ఆకులుగల వృక్షములు స్వరూపముగాఁగలవాడు నగు శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— పరమేశ్వరుడు సకల సస్యలతాగుల్మ వృక్షస్వరూపుడు. కేశసదృశములై ఆకుపచ్చగానుండు ఆకులుగల కల్పవృక్షాదులును శివ

స్వరూపములే. కావున జీవకోటి కవసరమగు ఆహారమునిచ్చిపోషించియు, కల్పవృక్షస్వరూపుడై సకలకాంక్షలను నెఱవేర్చుచున్నాడు. అందుచే నిత్యము ఆతనిని నమస్కరింతురు.

219, 220. నామములు- వృక్షేభ్యః, హరికేశేభ్యః

అను రెండు నామములకు, శివ, విష్ణు, బీజాక్షరసంపుటిపరముగాఁగల అర్ధ వివరణములు ఇంతకుమున్ను వివరింపఁబడెను.

-: 8. వ. యజుస్సు :-

"నమస్తారాయ"

అర్థము:-

తారాయ = ఓంకారరూపమైన ప్రణవముచేఁ బ్రతిపాదింపఁబడు శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— ఋగ్యజుస్సామవేదస్వరూపమగునట్టియును, అకార, ఉకార, మకారాత్మకమునగు ప్రణవముచే మహాదేవుడు ప్రతిపాదింపబడును. కావున ఆతనికి నమస్కారము.

221 వ. నామము- శివః- "నమస్తారాయ"

భ. భా. భా:— మహాదేవుడు జననమరణస్వరూపమైన సంసారమునుండి జీవులను దరింపఁజేయును. సంసారము సముద్రమువలె గంభీరము; మహా జంతువులను బోలినకష్టములతో నిండియుండును. అట్టి సంసారబాధలులేక యుండ జీవులను దరింపఁజేయువాడు పరమ శివుడు

అత్రహి జంతోః ప్రాణైరుత్క్రమమాణస్య రుద్రస్తారకం బ్రహ్మవ్యాచష్టే"
అను జాబాలోపనిషత్సూక్తిలో మహారుద్రుడు ప్రాణోత్క్రమణము (ప్రాణాలు పోవుట) పొందినప్పుడు తరింపఁజేయుటకు జీవులకు బ్రహ్మనుపదేశించెనని కలదు. అందుచే రుద్రుడు తారకుడు అంతేకాదు. శివుడు నాల్గుఆశ్రమముల వారిని సకల జాతులవారిని దరింపఁజేయుటకుఁ త్రిగుణాత్మక ప్రణవరూపము దాల్చెను తారమేతారకము = కంటిలోని నల్లగ్రుడ్డు శివుడు జీవులనేత్రము లందు నల్లగ్రుడ్డురూపముననను, అందు తేజోరూపముననుఉండి, అంధకారము నుండియు, అజ్ఞానమునుండియు జీవులను దొలగించును. తారము అనగా నాదము. అతడు ఘంటలో నాదరూపముననుండి, జీవులదృష్టిని దనపై మరల్చి, భక్తిజ్ఞానములను ఒసంగివారిని రక్షించును. పైకారణములచే మహాదేవుడు తారకనామధారియై నమస్కరింపఁబడును.

విష్ణుః—

విష్ణువు జగద్రక్షకుడు. తనపాలనలోఁగల జీవులను జ్ఞానవంతులఁ గావించి, గర్భనరకమునుండియు, జన్మదుఃఖమునుండియు, జరామరణముల నుండియు, వాటివల్లభయమును దొలగించి, తనలోఁజేరుటయను ముక్తిని ఒసంగును. ప్రహ్లాదుడు, ధ్రువుడు, గజేంద్రుడు మున్నగు భక్తులగాథలు పైవిషయమునకుఁదార్కాణము. కావుననే "శోకస్తారణస్తారః" అను విష్ణు సహస్రసూక్తిలో విష్ణుపరముగాఁ దారనామము పేర్కొనఁబడెను. శ్రీరామ చంద్రుడు జీవులకు మార్గదర్శకుడుగాఁ బ్రవర్తించి, సద్విషయములుబోధించి, తరింపఁజేయుటచే దాను "తార" నామకుడాయెను. అందుచేతనే అతనికిఁ జెందిన శ్రీరామనామమును దారకమంత్రముగాఁ బెద్దలుచెప్పుదురు. సప్తర్షులు బోధించి, ఉపదేశించిన రామనామకతారకమంత్రమును జపించుటచేతనే, దారులుకాచిదోపిడీలు హత్యలునుజేసిన బోయవాడు, వాల్మీకియై శ్రీమద్రామాయణమునురచించి, ఆదికవియాయెను. అవతారపురుషుడైన శ్రీరాముడు విష్ణువే కాన తారనామము అతనికిఁజెల్లును. తారనామమేవ్యాకరణమున"క"

ప్రత్యయముచేరుటచేఁ దారకనామమాయెను. అంతేకాదు. విష్ణువు ప్రణవస్వరూపుడై జీవులను సంసారసాగరమునుండి దరిచేర్చి, రక్షించుననుటకు "ఋచేలుని" గాథయేతార్కాణము కావుననే "తారణస్తారస్సవితాప్రపితామహః" అను విష్ణుసహస్రసూక్తిలో దారనామము విష్ణుపరముగాఁ బేర్కొనబడెను కావున విష్ణువుకూడ తారనామకుడాయెను.

బీజాక్షరసంపుటి:-

తారనామమున "త్+అ+ర్+అ" అని నాల్గక్షరములుకలవు. అవి చతురగ్నులను, అంతఃకరణచతుష్టయమును సూచించును. పైనామమును అగ్నిప్రధానముగా నుపాసించి ఆయురారోగ్యైశ్వర్యాదులను బొందఁగలరు. అగ్నిమాంద్యము, రక్తరోగము, తెల్లమచ్చలు, బొల్లి మున్నగురోగములను నివారించుగొనఁగలరు. పరులకుఁ బ్రాప్తించిన రోగములను నివారింపఁగలరు. పరాశక్తిసహాయమున అగ్నిమండలమైన సూర్యమండలమునకును బోఁగల యంత్రములను నిర్మింపఁగలరు

— 6. వ. యజుస్సు —

"నమశ్శంభవేచమయోభవేచ"

అర్థము:-

శంభవేచ = "శం" అనగా సుఖము నుత్పాదించువాడును, మయోభవేచ = లోకములకు సుఖమును భావించువాడునగు శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా భా: — మహాదేవుడు సుఖహేతువు. అతనివలననే సుఖముకల్గుచున్నది. అతడు నిరతము లోకసుఖమునే మనస్సునభావించును. అందుచే అతనికి నమస్కారము.

222 నామము- శివః- "నమశ్శంభవేచ"

భ. భా. భా:— పరమశివుడు సూర్యాగ్నిచంద్రేంద్రపర్జన్యస్వరూపుడగుటచే అతనివలననే లోకమునకు సుఖము కల్గుకారణమునను శంభుడాయెను. శం = ఆనందరూపసుఖము అతడేయని "ఆనందోబ్రహ్మేతివిజానాత్" అను శ్రుతివలనఁ దెలియుచున్నది. సుఖమార్గద్రష్టయునాతడే. కాన అతనికి శంభునామము ఏర్పడెను; అని తెలియుచున్నది.

విష్ణు:—

"స్వయంభూశ్శంభురాదిత్యః" అను విష్ణు సహస్రనామోక్తితో శంభు నామము విష్ణుపరముగాఁగలదు. విష్ణువు గజేంద్రాదిభక్తులకు సుఖమును జేకూర్చును. కావున శంభునామకుడాయెనని తెలియుచున్నది.

బీజాక్షరసంపుటి:-

శంభునామమున "శ్ + అ + మ్ + భ్ + ఉ" అని యైదక్షరములు కలవు. అవి వేదోక్తపంచఋతువులను బంచప్రాణములను సూచించును. పైనామమున లక్ష్మీబీజము అకారమకారములతోడను, భార్గవబీజము ఉకారముతోడనుగూడియుండుటచేఁ బైనామమును వాయుచక్రమున ఉపాసించి, భూమిలోనను జలమునందునుగల సకల సంపదలను, సకలవిద్యలను బొందఁగలడని తెలియుచున్నది. తన్మూలమున సకల సుఖములను బొందఁగలడని యును దెలియుచున్నది. అంతేకాదు. వాతరోగములను రక్తపుఁబోటు పాండువు మున్నగురోగములను స్వయముగాఁ బోఁగొట్టుకొనుటయేకాక, పరులకువాటిల్లినను బైరోగములను బోఁగొట్టఁగలడనియును దెలియుచున్నది.

223 నామము శివ:- "నమోమయోభవేచ"

భ. భా. భా:— మయమును అనగా ఐహికాముష్మిక సుఖములను జీవులకు జేకూర్చువాడు పరమేశ్వరుడే. అతనిదయవలననే ప్రాణులు భూలోకమున సకల సుఖములను భార్యాపుత్రాదులవలనను, భూభవనకనకవస్త్రాదుల వలను అనుభవించుచున్నవి. అతని ప్రేరణచేతనే సత్కార్యములనాచరించి, ఆముష్మికమును అనగా స్వర్గలోకసౌఖ్యమును బొందుచున్నవి. అతడు అభ్యుదయరూపముననను, మోక్షరూపముననుండి, జీవులకు అసుఖమును జేకూర్చుచున్నాడు. తుదకు మయరూపమున అనగా ఒంటెలరూపముననుండి, ఎడారులలోఁ బయనించువారికి, సుఖమును జేకూర్చుచున్నాడు. మయము అనగా

అశ్వము పరమశివుడు అశ్వరూపముననుండి రాజాదులకు యుద్ధములు మున్నగువానిలోఁ దోడ్పడి, విజయరూపసుఖము నుజేకూర్చుచున్నాడు. కావున శివుడు మయోభవనామకుడై నమస్కరింపఁబడుచున్నాడు.

విష్ణు:—

మహాశివుడేకాదు, మహావిష్ణువుకూడ గజేంద్రునికిఁ బ్రాణరక్షణ మొసంగియు, కుచేలునకు సంపదల నొసంగియు, ధ్రువునకు శాశ్వతమండలము నొసంగియుఁ, బ్రహ్లాదునకు అగర్భవిజ్ఞానమును ప్రాణప్రమాదవిముక్తిని శాశ్వతానందమును జేకూర్చి ఇహపరలోక సౌఖ్యప్రదాతయని ప్రతిష్ఠ నందినాడు.

శ్లో॥ జ్ఞానానందమయం దేవం నిర్మలస్ఫటికాకృతిం।
ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవముపాస్మహే॥

అను సూక్తిని బరిశీలించినచో మహావిష్ణువు మయోభవుడు అశ్వముఖుడు అనగా హయగ్రీవుడై భక్తులకు నిర్మలస్ఫటికారమును బ్రదర్శించి, సర్వవిద్యలను, జ్ఞానాందమునొసంగి సౌఖ్యదాతయైనట్లు తెలియుచున్నది. మయదురూపమున నుండి పాండవులకు నవరత్నమయభవనమునొసంగి సుఖము చేకూర్చినాడు. శ్రీకృష్ణరూపముననుండి వారికి విజయమును మోక్షమును ఒసంగినాడు. మయోభవుడు సుఖదుడు అను నామములు సమానార్థకములు. కావుననే "సుఖదోనైకదోఽగ్రజః" అను విష్ణు సహస్రసూక్తిలో సుఖదనామము విష్ణు పరముగానున్నది. అందుచే ఆతనికి మయోభవనామము చెల్లునని చెప్పవచ్చును.

బీజాక్షరసంపుటి-

"మయోభవ" నామమున "మ్+అ+య్+ఓ+భ్+అ+వ్+అ" అని ఎనిమిదక్షరములుకలవు. అవి అష్టవిధప్రకృతిని, శరీరస్థాష్టచక్రములను

సూచించును. ఇందు మదనబీజము అకారముతోడను, వాయుబీజము ఈశ్వర బీజమైన ఓకారముతోడను, భార్గవవరుణబీజములు ఆకారముతోడను గూడియున్నవి. ఈనామము నుపాసించువారు, ఇహపరలోకసుఖములను, ప్రాణాయామధారణశక్తిని, జలప్రేషణశక్తినిబొందఁగలరు. అంతేకాదు. అష్టైశ్వర్యములను, సకల విద్యలను భూమిలోని సకలవస్తుజాలమును బొంద గలరు. చర్మరోగములను, వాతరోగములను, రక్తదోషరోగములను, భూతాది బాధలను, జలోదరాదిరోగములను బోఁగొట్టుకొనఁగలరు. వాయుశక్తి సహాయ మునఁ జిన్నమెదడుకుఁజెందినరోగములను దొలగించుకొనఁగలరని తెలియు చున్నది.

— 10. వ. యజుస్సు —

"నమశ్శంకరాయచమయస్కరాయచ"

అర్థము:-

శంకరాయచ = విషయసుఖమునుజేకూర్చువాడును, మయస్కరాయచ = మోక్షసుఖమును జేకూర్చువాడునగు శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— విషయసుఖమని, మోక్షసుఖమని సుఖమురెండు విధములు. పైమంత్రమున జీవులకు ఈరెండు సుఖములను బరుఁడే జేకూర్చి నట్టుకలదు. ఇందుఁదానే స్వయముగాపానిని జేకూర్చినట్లు చెప్పఁబడెను. తల్లిదండ్రులుమున్నగు వారిరూపమున లౌకిక సుఖములను జీవులకు మహే

శ్వరుడుచేకూర్చెను. ఆచార్యుడు, శాస్త్రము మున్నగువానిరూపమున జీవులకు మోక్షసుఖమును ఈశానుడే చేకూర్చెను. ఈవిషయము శివపురాణము, హర విలాసము అనెడి సంస్కృతాంధ్రగ్రంథములవలనఁ దెలియుచున్నది. కావున ఆ శివుని అందఱును నమస్కరించుచున్నారు.

224 వ. నామము- "నమశ్శంకరాయచ"

సూచన:—

ఈ శంకరనామముయొక్క అర్థము శివ విష్ణు బీజాక్షరసంపుటిపరముగా ఇంతకుమున్నే వివరింపఁబడెను.

225 నామము:- శివ+విష్ణు:- "నమోమయస్కరాయచ"

మయోభవానామార్థమునందే మయస్కరనామార్థము ఇమిడియున్నది. అందే ఈమయస్కరనామార్థము శివ విష్ణుపరముగా వివరింపఁబడెను.

బీజాక్షరసంపుటి—

మయస్కరనామమున మ్+అ+య్+అ+స్+క+అ+ర్+అ" అని తొమ్మిదక్షరములుకలవు. ఇవి నవగ్రహములను, శరీరస్థ నవద్వారములను సూచించును. ఈనామము నుపాసించువారు వాయ్వగ్నిస్వరూపిణియగు శక్తినిధ్యానించి, సకాలవర్షములు కురిపించియు, కృత్రిమమార్గమున సైతము వర్షము కురిపించియుఁ బంటలు పండింపఁగలరు. జీవులకు శివుడు సకల విధ సుఖములను జేకూర్చునని తెలియుచున్నది.

-: 11. వ. యజుస్సు :-

'నమశ్శివాయచ శివతరాయచ"

అర్థము:-

శివాయచ = కల్యాణస్వరూపుడై, స్వయముగా నిష్కల్మషముగానుండు నట్టియును, శివతరాయచ = మిక్కిలి కల్యాణస్వరూపుడుగానుండునట్టి శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— మహాదేవుడు అష్టసిద్ధులుకలవాడు కావున లోకములకు స్వయముగాఁ గల్యాణమునొసంగఁగలడు. అంతయధికముగా జీవులకుఁ గల్యాణము చేకూర్చువాడు ఇంకొకడులేడని తెలియుచున్నది.

226 నామము- శివ- "నమశ్శివాయచ"

శ. భా. భా:— మహాదేవుడు నిష్కల్మషుడును, సత్త్వరజస్తమోగుణహీనుడు నగుచున్నాడు. కల్యాణ స్వరూపుడాతడే అభ్యుదయము, నిశ్శ్రేయసము (మోక్షము) అనెడికల్యాణములను శివుడు జీవులకుఁ జేకూర్చును. "శివః పంథాశ్శివోఽభ్యుపాయః" అను సూక్తిచేఁ గల్యాణమార్గస్వరూపుడును, గల్యాణప్రాప్తికి ఉపాయమైనవాడును శివుడేయని తెలియుచున్నది.

"శివఏకోధ్యేయః, శివంకరస్సర్వమన్యత్పరిత్యజ్య"
అన్యమును సర్వమునువిడిచి, శివునొక్కనేధ్యానింపవలెను; అతడే శివంకరుడు అని అథర్వశిఖావచనముచేఁ దెలియుచున్నది.

శ్లో॥ సమేధయతియన్నిత్యం సర్వార్థాన్‌సర్వకర్మసు।
శివమిచ్ఛన్ మనుష్యాణాంతస్మాద్దేవశ్శివస్స్మృతః"

అనెడి మహాభారతవచనముచే శివుడొక్కడే సర్వకర్మలందును విజయము చేకూర్చుచు, నిత్యము జీవుల సర్వార్థములను వృద్ధిచేయుచున్నాడనియును, అతడే మనుష్యులకుఁ గల్యాణము కలుగవలెననికోరుచున్నాడనియును,అందు వలన ఆదేవుడే శివుడని తలంపఁబడుచున్నాడనియును దెలియుచున్నది. సజ్జనమనస్సులు శివునియందేకలవు కాన శివుడాయెను. ఇవ్విధంబున శివ నామము అతనికిఁజెల్లును.

విష్ణు-

విష్ణువు సత్త్వరజస్తమోగుణాతీతమైన శుద్ధస్వరూపముకలవాడు. కావున "సర్వశ్శర్వశ్శివస్థాణుః" అను సహస్రసూక్తిలో శివనామము విష్ణుపరముగా గలదు. ''సబ్రహ్మసశివః అను శ్రుతిలోఁ త్రిగుణాతీతుడైన విష్ణువు బ్రహ్మగా, శివుడుగాఁబేర్కొనఁబడెను. తననామమును స్మరించుభక్తులను పావనము చేయువాడు కావున "క్షేమకృచ్ఛివః" అను విష్ణు సహస్రసూక్తిలో శివ నామము విష్ణుపరముగాఁ బ్రయోగింపఁబడెను. అంతేకాదు. పరమానంద రూపుడై శాంతించుకారణమున విష్ణువు శివుడాయెను. నిర్వికారుడై సజ్జ మనస్సులో మహావిష్ణువుశయనించును. శుభప్రదుడై భక్తులను రక్షించును. పైకారణములచే విష్ణువునకును శివనామము సార్థకమాయెనని తెలియుచున్నది

బీజాక్షరసంపుటి:-

శివనామమున "శ్ + ఇ + వ్ + అ'' అని నాల్గక్షరములుకలవు. ఇవి చతుర్వర్గములను అంతఃకరణచతుష్టయమును సూచించును. జలచక్రమున లక్ష్మీప్రధానముగాఁ బైనామము నుపాసించువారు సకల సంపదలను బొంద గలరు. రోగనాశకులుకాఁగలరు. జలమందలి ధనధాన్యములను వస్తుజాతమును గనుగొనఁగలరు; అని తెలియుచున్నది.

227 వ. నామము:- శివ+విష్ణు- "నమశ్శివతరాయచ"

అత్యంతశుభంకరులైనకారణమున శివతరనామము శివకేశవుఁను ఇరువురిని దెలియఁజేయును.

బీజాక్షరసంపుటి—

శివతరనామమందలి యెనిమిదక్షరములును అష్టవిధాగ్నులను, అష్ట చక్రములను సూచించును. శివనామముకంటె శివతరనామమున వాస్తు బీజాగ్నిబీజములు అధికముగాఁగలవు. జలాగ్నిచక్రములందు లక్ష్మీరూపశక్తిని ధ్యానించుచు ఈనామము నుపాసించినవారు, మహదైశ్వర్యసంపన్నులును యంత్రసహాయమునను మంత్రశక్తితోడను జలాగ్నిప్రకోపముచేఁ గల్గువ్యాధు లను నివారింపఁగలవారలగుదురు జలాగ్నిప్రమాదనివారకయంత్రనిర్మాత లును ఉదజని, అణువుమున్నగువానితో నిండినయంత్రములను నిర్మింపఁ గలవారలై శత్రుభయంకరులుకాఁగలరని తెలియుచున్నది.

-: 12. వ. యజుస్సు :-

"నమస్తీర్థ్యాయచకూల్యాయచ"

అర్థము:-

తీర్థ్యాయచ = ప్రయాగాదితీర్థములందు సన్నిహితుడైయుండునట్టియును, కూల్యాయచ = నదీతీరములందుఁ బ్రతిష్ఠింపఁబడిన లింగరూపముననుండునట్టి శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— మహాదేవుడు తన భక్తులను నిష్కల్మషులుగాఁ జేయుటకుఁ బ్రయాగాదితీర్థములందు సన్నిహితుడైయుండెను. అతడు గంగాదిపుణ్యనదుల

తీరములందు లింగరూపమునఁ బ్రతిష్ఠింపఁబడియుండి తనభక్తులనుగాపాడు చుండెను. అందుచే అతని నమస్కరించుచున్నారు.

228 వ. నామము- శివ;- "నమస్తీర్థ్యాయచ"

భ. భా. భా:— మహాశివుడు ఆధారవిశేషవశమున జగత్తును అనుగ్రహించు చున్నాడు; అని యిపుడుచెప్పెను. తీర్థముఅనగాఁ బ్రయాగాదిపుణ్యక్షేత్రము. అందుఁదనమహిమనుంచి పరమేశ్వరుడు జీవుల నుద్ధరించుచున్నాడు. కావున దీర్థ్యనామకుడాయెను. తీర్థము అనగా గురువు. శివుడు గురువుగానుండి, సకల మునులకు జ్ఞానమును, విద్యలను ఒసంగెను. అదియే శివుని దక్షిణామూర్తి స్వరూపము. అందుచేఁ దీర్థ్యనామకుడాయెననియుఁ దెలియుచున్నది. అంతే కాదు తీర్థమునందు అగ్నిలోఁ దనతేజస్సునుంచి, రక్షించెను. కావునఁ దీర్థ్య నామకుడై శివుడు నమస్కరింపఁబడుచున్నాడనియును జెప్పవచ్చును.

విష్ణు-

తీర్థపదమునకు శాస్త్రమనియు నర్థముకలదు. శాస్త్రములందు శివమహిమతోఁ బాటు, విష్ణుమహిమయుఁ జేర్కొనఁబడెను తీర్థములను శాస్త్రాదివిద్యలను హయగ్రీవరూపమున విష్ణువు లోకములకొసంగెను. అందుచేతనే "మనోజవస్తీర్థకరః" అను విష్ణుసహస్రసూక్తిలోఁ దీర్థకరనామము విష్ణుపరముగాఁ జేర్కొనఁబడెను తీర్థకరతీర్థ్యనామములు సమానార్థకములని తెలియుచున్నది. కావున విష్ణువునకును దీర్థ్యనామముచెల్లును ప్రయాగాదితీర్థములందుండి, విష్ణువు జీవులనుద్ధరించుచున్నాడు. కావున దీర్థ్యనామకుడై విష్ణువు నమస్కరింపఁబడుచున్నాడు.

బీజాక్షరసంపుటి;-

తీర్థ్యనామమున "త్ + ఈ + ర్ + థ్ + య్ + అ" అని ఆరక్షరములు కలవు. అవి షడృతువులను షట్చక్రములను సూచించును. అగ్నిస్వరూపిణి యగుకుండలినీశక్తిని ప్రాణాయామప్రక్రియలో ఈశరీరయంత్రమున ఉత్థాపించి, పైనామమును జపించి, ఈంకారవాచ్యయగుశక్తిని వశపఱచుకొని ఆమె మహిమవలన ఉపాసకులు ధర్మసంస్థాపనచేయఁగలరు. అణిమాదిశక్తులను ఆర్జించుకొని వాయ్వగ్ని ప్రేషకయంత్రములను సృష్టింపఁగలవారలగుదురు; అని తెలియుచున్నది

229 నామము శివ:- "నమఃకూల్యాయచ"

ప్ర. భా. భా:— కావేరి మున్నగు మహానదీతీరములందు లింగ రూపమున మహాదేవుడుకలడు. కాశీవిశ్వేశ్వరుడు అందఱకుఁదార్కాణము. అందుచే శివుడు కూల్యనామకుడాయెను పంచభూతముల రూపమున జీవులనావరించియుండఁ దగినవాడు మహాదేవుడు. కావున, గూల్యనామకుడాయెను. "కూల = ఆవరణే" అను ధాతువునుండియేర్పడిన కూలపదమునకు ఆవరించియుండువాడని యర్థముకలదు.

విష్ణు:

కూలమనగా జలాశయము. కాళీయుడను సర్పరాజు యమునానదీ జలాశయమునందుండెను. అతడు ఆనదీతీరవాసులగు గోగోపాలకులను, ప్రాణులను ఆప్రాంతమున సంచరింపనీలుకలుగనీయక, తనవిషాగ్నిజ్వాలలచేఁ బీడించుచుండెను. దానిబారినుండి తప్పించి, వారిని రక్షించుటకు, ఆకాళీయుని అడంచుటకును, మహావిష్ణువు ఆయమునాకూలమున దుమికి, అందుండి వానినడంచి, దూరముగాఁ బారద్రోలెను. అందుచే విష్ణువుకూల్యనామకుడాయెను. అంతేకాదు. కూల్యుడనగా జీవుల హృదయమునను జఠరాగ్ని

రూపమున అవరించియున్నవాడనియునర్థముకలదు. "అహంవైశ్వానరో భూత్వాప్రాణినాందేహమాశ్రితః" నేనువైశ్వానరుడనై (అగ్నినై) ప్రాణుల దేహములనాశ్రయించి, అవరించియున్నవాడనని చెప్పిన గీతాసూక్తియే అందులకు ప్రమాణము. అంతేకాదు.

"అంతర్బహిశ్చతత్సర్వంవ్యాప్యనారాయణస్థితః"

అను శ్రుతిలో ప్రాణులదేహాంతర్బహిర్భాగములను వ్యాపించినారాయణుడు = విష్ణువు, కలడని చెప్పఁబడెనుగదా! కావున విష్ణువుకూల్యనామకుడై నమస్కరింపఁబడుచున్నాడు.

బీజాక్షరసంపుటి-

కూల్యనామమున "క్+ఊ+ల్+య్+అ" అని ఐదక్షరములు కలవు అవి పంచభూతములను, ఐంచకోశములను సూచించును. ఈనామము నుపాసించువారు భూచక్రమున వాయుధారణమొనర్చి, ప్రజాపతినిధ్యానించి నూతనవస్తుసృజనశక్తిని సంపాదింపఁగలరు. భూతాదిబాధలను దొలగింపఁ గలరు. భూమిపైని కృత్రిమవర్షముకురిపించఁగలవారలై, వాతరోగాదులను దొలగించి, ఆనందకరులుకాఁగలరని తెలియుచున్నది. యోగదృష్టితో భూమిలోనున్న వస్తుజాలమునుగనుగొనఁగలవారలగుదురు.

-: 13. వ. యజుస్సు :-

"నమఃపార్యాయచావార్యాయచ"

అర్థము:-

పార్యాయచ = సంసారసముద్రమునుదాటించి, మోక్షకాములచే ధ్యానింప దగినవాడును, అవార్యాయచ = సంసారమధ్యమునన్నవారికిఁ గామ్యఫల

ముల నొసంగువాడునగు శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— సంసారము సముద్రమువంటిది. అందుఁగల భార్యాపుత్రాదులు మకరాదులను, బోలినవారు. వారినుండివాటిల్లుచిక్కులను గష్టములను బోగొట్టుకొని మోక్షమును బొందఁగోరినవారు పరమేశ్వరుని ధ్యానింతురు. అతడు వారిని సంసారసముద్రతీరము చేర్చిరక్షించును. అవారము అనగా అర్వాక్తీరము. అదియే సంసారమధ్యము. అందుండి జీవులు కామ్యఫలములను అపేక్షింపగా మహాదేవుడు భక్తులు వాంఛించుకోరికలను దీర్చును.

230 నామము- శివ:- "నమఃపార్యాయచ"

భ. భా. భా:— పార = తీరకర్మసమాప్తౌ" అనుధాతువునుండి, "పార" అనుపదమేర్పడెను. పారమందుండువాడు పార్యుడు. అనగా మోక్షకాములై తనను అర్థించుభక్తులకర్మలను నశింపఁజేసి, సంసారదుఃఖములను బాపి, పరమశివుడువారిని రక్షించును. అందులకే అతడు నద్యాదులతీరములందు లింగరూపముననుండి, భక్తులకు సులభుడగును. కావున శివుడు పార్యనాముకుడాయెను.

విష్ణు:-

పరము అనగా ఉత్తమమగు వైకుంఠస్థానము. అందుండుటచే విష్ణువు పార్యుడాయెను. గోదావర్యాది మహానదుల పారమందుండు భద్రాచలాది క్షేత్రములందు భగవంతుడు శ్రీరామాదులరూపములనుండి, భక్తులను గాపాడును. తీరకర్మసమాప్తిలో మునిగియుండును. అర్జునుడు, తిన్నడు మున్నగు భక్తులను గాపాడి, మోక్షమొసంగుకారణమున విష్ణువు పార్యనామకుడాయెను.

బీజాక్షరసంపుటి:-

"పార్యనామమున "ప్+అ+ర్+య్+అ" అని ఐదక్షరములు కలవు. అవి పంచాగ్నులను పంచకోశములను సూచించును. ఈనామమును వాయ్వగ్నిప్రధానముగా వాయుస్థానమున ఉపాసించినచో ఉపాసకులు వాయ్వగ్నిశక్తి సంపన్నులై ముక్తులుకాఁగలరు కృత్రిమమేఘ్రస్రష్టలై వర్షము కురిపించఁగలవారలగుదురు. అగ్నిమాంద్య వాతరోగాదినివారకులుకాఁగలరు. భూత ప్రేతపిశాచాది బాధానివారకులునుగాఁగలరని తెలియుచున్నది.

231 నామము:- శివ— "నమోఽవార్యాయచ"

భ. భా. భా:— అవారము అనగా సముద్రముయొక్క అర్వాక్తీరము. విశుద్ధమైన సముద్రతీరమునకుఁ పారము అనిపేరు. విశుద్ధులైన శివారాధకులు అందుండి ముముక్షువులు అగుదురు. అవిశుద్ధమైన (అపవిత్రమైన) సముద్రతీరమునకు అవారమనిపేరు. అందుండు జీవులు ఐహికవాంఛలతోనుందురు. వారు పరమశివుని పూజించి, కామ్యఫలములను పొందుదురు. సర్వాంతర్యామియైన పరమశివుడు ఆ జీవులను రక్షించుచుండును. కావున అవార్య నామకుడాయెనని తెలియుచున్నది.

విష్ణు:

"నవిద్యతే, వాః = జలంయత్రతీతదవారమ్" అను వ్యుత్పత్తిచే నీరు లేనితావునకు అవారమనిపేరున్నట్లు తెలియుచున్నది. అవారములు అనగా, శేషాద్రి, భద్రాద్రిమున్నగు పర్వతములు. వానిపై, విష్ణు, శ్రీవేంకటేశ్వర శ్రీరామాదినామములతోనున్నవాడు. అందుచే విష్ణువు అవార్యనామకుడాయెనని తెలియుచున్నది.

బీజాక్షరసంపుటి:-

అవార్యనామమున "అ+వ్+అ+ర్+య్+అ" అని ఆరక్షరములు కలవు. అవి షడృతువులను, షట్చక్రములను సూచించును. ఈనామమును శక్తిప్రధానముగా నుపాసించినవారు జలాగ్నివాయురూపధారులై భగవంతునిలోఁజేరఁగలరు. అంతేకాదు పరాశక్తికృపాలబ్ధవిజ్ఞానముచే జలసంచారక, అగ్నిగోళసంచారక, వాయుమండలసంచారక యంత్రనిర్మాతలుకాఁగలరు. తన్మూలమున నిధినిక్షేపాదులను వెలిబుచ్చఁగలరు. జలాగ్నివాయుప్రేషక యంత్రముల నిర్మింపఁగలరు. జలాగ్నివాయుప్రకోపజనిత రోగనివారకులు కాఁగలరని దెలియుచున్నది.

-: 14. వ. యజుస్సు :-

"నమః ప్రతరణాయచోత్తరణాయచ"

అర్థము:-

ప్రతరణాయచ = ప్రకృష్టమైన (గొప్పవగు) మంత్రజపాదులయొక్క రూపమునఁ బాపతరణమునకు హేతువైనట్టియును, ఉత్తరణాయచ = తత్త్వజ్ఞానరూపమున సంపూర్ణముగా సంసారమునుండి దాటించువాడునగు శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా: — భక్తులు మహాదేవునకుఁజెందిన మంత్రజపాదులనాచరించి, పాపములనుండి తరించుచున్నారు. తత్త్వజ్ఞానమార్జించి, జననమరణరూప సంసారమునుండి, పూర్తిగాముక్తులగుచున్నారు. అట్టి శక్తినొసంగుటచే భక్తులు మహాదేవునే సేవింతరు.

232 నామము- శివ- "నమః ప్రతరణాయచ"

భ. భా భా:— తరణ మనగా బ్లవనము = తేలుట, దాటుట అని యర్థము ప్రకృష్టమైన తరణము ప్రతరణము. ఉత్తమయోనులలో జన్మించుటయే ప్రకర్ష. ఉత్తమాధమయోనులలో నెచట జన్మించినను, ఆజన్మ, బంధకారణమేయగును. అందుచే మహాదేవుడు తనను ఆరాధించినవారిని సంసారసముద్రమునుండి తరింపజేయుటకు బ్లవమువలె (తెప్పవలె) ఉండును. వారి నుద్ధరించి, ముక్తులఁ గావించును. కావున శివుడు ప్రతరణనామకుడాయెను.

విష్ణు:-

"అశోకస్తారణస్తారః" "తారస్సవితా ప్రపితామహః" అను విష్ణు సహస్రసూక్తులలో "తారణః, తారః" అను పదములురెండును విష్ణుపరములుగాఁగలవు. విష్ణువుతనభక్తులను, సంసారగర్భ జన్మజరామృత్యువులనుండి తరింపఁజేయును. కావునఁ బైనామములు అతనికివీర్పడెను. "ప్రతరణుడు, తారణుడు" అను పదములు సమానార్థకములేకాన తరణనామము విష్ణువునకు జెల్లునని తెలియుచున్నది.

బీజాక్షరసంపుటి—

ప్రతరణనామమున "ప్+ర్+అ+త్+అ+ర్+అ+ణ్+అ" అని తొమ్మిది అక్షరములుకలవు. అవి నవావరణలను, నవద్వారములను సూచించును. పైనామమును అగ్నిప్రధానముగా నుపాసించువారు నందికేశ్వరదయాపాత్రులై తరింతురు. వారు అగ్నిప్రేషకయంత్రలను, వర్షదాయకయంత్రములను సృష్టించి, దుష్టశిక్షకులుఁ కాఁగలరని తెలియుచున్నది. అనేక విధయంత్రములను నిర్మించు ఇంజనీర్లు కాఁగలరని తెలియుచున్నది.

233 వ. నామము:- శివ "నమఉత్తరణాయ"

భ. భా. భా:— ఉత్తరణుడు అనగాఁ దాటించువాడు. సంసారమునఁ బడఁ ద్రోయుకామక్రోధలోభమోహమదమాత్సర్యములనుండి భక్తులను నిర్గమింప జేసి రక్షించువాడు కాన మహాశివుడు ఉత్తరణనామకుడాయెనని తెలియు చున్నది.

విష్ణు:—

"ఉత్తారణోదుష్కృతిహా" అను విష్ణుసహస్రసూక్తిలో ఉత్తారణపదము విష్ణుపరముగాఁగలదు. పరికింపగా "ఉత్తరణుడు, ఉత్తారణుడు" అను రెండు పదములును సమానార్థకములే. శివుడువలె విష్ణువును భక్తులను భవదుఃఖము నుండి తొలగించువాడే కాన ఉత్తరణనామకుడాయెనని తెలియుచున్నది.

బీజాక్షరసంపుటి—

ఉత్తరణనామమున "ఉ+త్+త్+అ+ర్+అ+ణ్+అ" అని ఎనిమిదక్షరములుకలవు. అవి అష్టసూర్యమండలములను, శరీరమందలి అష్ట చక్రములను సూచించును. ఇందలినందికేశ్వరబీజము ణకారము, వాయు వాస్తు అగ్నిబీజములతోఁగూడియున్నవి. దీనినుపాసించువారు వాయ్వగ్ని పురుషులతోఁగూడిన వాస్తుప్రభావముచే, సూర్యమండలాంతర్గతులై తరింపఁ గలరు. వాయుశక్తిపూర్ణయాత్రసహాయమున అగ్నిగోళములను జేరఁగలరు. అందులకు అవసరమగు యంత్రములను నిర్మింపఁగలరు. సేనానాయకులై శత్రువిజేతలుకాఁగలరని తెలియుచున్నది.

— 15. వ. యజుస్సు —

"నమఆతార్యాయచాలాద్యాయచ"

అర్థము:-

అతార్యాయచ = జీవరూపమున మఱల సంసారగమనమునకు అర్హుడై నట్టియును, అలాద్యాయచ = సంపూర్ణముగా గర్మఫలమును అనుభవించు జీవుడైనట్టి శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— సంసారవిముక్తిసాధనమైన తత్త్వజ్ఞానముకలిగినను దానినుపే క్షించి జీవులు కామ్యకర్మలను అనుష్ఠించుటకు సంసారమునే మఱలవచ్చి చేరుదురు. అట్లువచ్చిచేరుటనే అతారము అందురు మహాదేవుడు జీవరూపుడై సంసారమున జేరనర్హుడైయుండును కావున అతార్యుడాయెను. అలం = సంపూర్ణముగా గర్మఫలమనుభవించును. అందుచే జీవునకు :అలం+ అదుడు = అలాదుడు" అని పేరువాటిల్లెను. "తయోరన్యఃపిప్పలంస్వాద్వత్తి" అను శ్రుతిలో, జ్ఞాని, జీవుడు అను వారిలో అన్యుడైనజీవుడు కర్మఫలాను భవమునకై సంసారమునుజేరునని చెప్పఁబడెను. సంసారప్రేరకుడై సంసార బంధము ననుభవించు జీవుడుగానున్న శివుడు అలాద్యనామకుఁడాయెను. అతనికి నమస్కారము.

234 వ. నామము:- శివ "నమఅతార్యాయచ"

భ. భా. భా:— ప్రారబ్ధాదికర్మములఫలము శేషించినచో దానిననుభవించు టకై జీవుడు సంసారమునుజేరును. శివుడు సంసారమున చైతన్యరూపమున నుండి, సంసారస్థజీవులను అనుగ్రహించి, తరింపఁజేయును. అందుచే అతార్య నామకుడాయెను. అంతేకాదు. లోహములలో రజితము శివునితేజోరూపమైన రేతస్సు. అట్టి రజితరూపముననుండి జీవులనుద్ధరింపయోగ్యుడాయెను. "నమ శ్శివాయ" యనెడి తననామమును స్మరించువారిని ఋణ్యాపాపములనుండి తరింపఁజేసిరక్షించును. జీవులకన్నులలో నల్లగ్రుడ్డురూపముననుండి దృష్టి నొసంగి శివుడు వారిని అంధకారమునుండి దాటించి, రక్షించును తారము అనగా నాదము పరమశివుడు నాదరూపుడై జీవులనానందపఱచును. తద్ద్వారా వారిని దరింపఁజేయనర్హుడైయుండును. కావున శివుడు అతార్యనామకుడై నమస్కరింపఁబడుచునాడు.

విష్ణు:—

తారము అనగాఁ గాంతి. అదియే ప్రకాశము. "ప్రభాస్మి శశిసూర్యయోః" అను గీతాసూక్తిననుసరించి, సూర్యచంద్రులలోఁగల కాంతిని విష్ణుతేజస్సుగా జెప్పవచ్చును. విష్ణువు అతారము అనగా సంపూర్ణమగు కాంతిగానుండి, జీవులను దరింపఁజేయనర్హుడైయుండెను. అందుచేతనే "అశోకస్తారణస్తారః" అను సహస్రసూక్తిలో తారణతారపదములు విష్ణుపరములుగానున్నవి. అందుచే విష్ణువు అతార్యనామకుడాయెను. తారలనగా నక్షత్రములు చంద్రుడునక్షత్రములలోఁ బ్రధానుడు అతడు విష్ణువిభూతి యను విషయము "నక్షత్రాణామహంశశీ" అను గీతాసూక్తిచేఁ దెలియుచున్నది. విష్ణువు చంద్రాది నక్షత్రముల రూపముననుండి, ఎడారులందును సముద్రమందును ప్రయనించువారలకు మార్గదర్శకుడై తరింపఁజేయుచున్నాడు. కావున విష్ణువు అతార్యనామమై నమస్కరింపఁబడుచున్నాడు.

బీజాక్షరసంపుటి:-

అతార్యనామమున "అ + త్ + అ + ర్ + య్ + అ" అని ఆరక్షరములుకలవు. అవి షట్కృత్తికలను షట్కర్మలను సూచించును. ఇందు వాయ్వగ్ని బీజములు పరాశక్తిబీజముమైన అకారద్వయముతోడను, అకారముతోడనుగూడియున్నవి. ఈ నామమును శక్తిప్రధానముగా వాయ్వగ్నిస్థానములందు పాసించినచో ఉపాసకుడు వాయ్వగ్నిస్వరూపుడై శక్తిమహిమలనంది, వాయ్వగ్నులతో నడచుయంత్రములను, వాయ్వగ్నిప్రేషకయంత్రములను సృష్టించఁగలవాడగును. వాయ్వగ్నిదోషజనితరోగనిర్మూలకుడగునని తెలియుచున్నది

235 నామము:- శివ:- "నమోఽలాద్యాయచ"

భ. భా. భా:— అలాదపదమునకు సృష్టి, స్వర్గము అను నర్థములుకలవు. అలాదమనగా సర్గము (సృష్టి) మాటిమాటికిని సంసారసాగరమున మునిఁ

వలె దిరుగుచునుండి, పరమశివుడు సృష్టిలోనుండియే ప్రళయమున సృష్టిని ధ్వంసముచేయును. జీవులను సంసారసాగరమునఁ బడద్రోసి సుడివలెఁ ద్రిప్పుచుహింసించును. పుణ్యఫలభోగానంతరమున స్వర్గమునుండి పడఁద్రోయును. జీవులను దరింపఁజేయువాడును, శిక్షించువాడును బరమశివుడే కావున అతనికి అలాద్యుడను నామమేర్పడెను. అందుచే ఆతనిని నమస్కరించుచున్నారు.

విష్ణు:—

"అంతర్బహిశ్చతత్సర్వంవ్యాప్యనారాయణస్థితః" అను శ్రుతిలోఁ జెప్పినట్లు విష్ణువు అలాదమున (సృష్టిలో) జేతనాచేతనరూపమునఁగలడు. అతడు తనభక్తులైన ప్రహ్లాదాదులను సైతము సంసారముద్రమున జొనిపి; పెక్కుకష్టములను అనుభవింపఁజేసి, తుదకు రక్షించెను. జీవులను రక్షించుటకు విష్ణువుతానును సంసారమున రామకృష్ణాదిరూపములఁ బ్రవేశించి, కష్టములను అనుభవించెను. స్వర్గమునఁ గలదేవతలను సైతము కర్మానుకూలముగాఁ గష్టములననుభవింపఁజేసి, రక్షించెను. కావున విష్ణువునకు అలాద్యుడను నామము ఏర్పడెనని తెలియుచున్నది.

బీజాక్షరసంపుటి-

అలాద్యనామమున "అ+ల్+అ+ద్+య్+అ" అని అరక్షరములుకలవు. అవి షడృతువులను షట్కోశములను సూచించును. ఇందు పృథివీబీజమైన లకారమును దుర్గాబీజమైన దకారమును బరాశక్తిబీజమైన అకారమునుగలవు. అమూడును స్త్రీబీజములే కాన అవి ఇచ్ఛాక్రియాజ్ఞానశక్తులను మూడింటిని సూచించును. విని వాయుసర్వదేవబీజములతోఁగూడియున్నవి. పైనామమును బృథివీచక్రమున దుర్గాప్రధానముగాఁ బ్రాణాయామక్రియలో ఉపాసించినచోవాడు శక్తిసహితపురుషునిలో లీనుడగును. ఈనామము నుపాసించువాడు ప్రాణశక్తిసహాయమున భూమిలోదూరి

అందుఁగల సకల వస్తుజాతమును వెలిబుచ్చఁగలడనియుఁ, జన్మరోగములను నిర్మూలింపఁగలడనియును దెలియుచున్నది.

— 16. వ. యజుస్సు —

"నమశ్శష్ప్యాయచ ఫేన్యాయచ"

అర్థము:-

శష్ప్యాయచ = గంగాతీరాదులలో జన్మించు కుశాంకురాదులకు అర్హుడై యున్నట్టియును, ఫేన్యాయచ = నదీమధ్యగత ఫేనమునకు అర్హుడైయున్నట్టి శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— శష్పములనగా బాలతృణాదులు. లేతగడ్డియున్నగునవి. వానిలో జేరినవే కుశదర్భాదులు. అవి గంగాతీరాదులలో జన్మించినపుడు గంగాది జలసారము వానిలో నుండును అందు దివ్యతేజస్సు ఉండును. అది శివ స్వరూపము. అందుచేతనే కుశదర్భాదులను దేవపితృకార్యములందు ఉపయో గింతురు. అట్టి శష్పములను గుశదర్భాదులను బొందుటకు శివుడు అర్హుడై శష్ప్యనామకుడుఅయెను. నదీజలములరాపిడిచే నదీమధ్యమున, నురగవేర్ప డును. అదియేఫేనము. అందుఁగల శ్వేతకాంతి శివకాంతియే. అందుచే శివుడు ఫేనమును బొందనర్హుడై ఫేన్యనామకుడై నమస్కరింపఁబడుచున్నాడు.

236 నామము:- శివ— "నమశ్శష్ప్యాయచ"

భ. భా. భా:—

"పవిత్రవంతః పరివాజమాసతే। పితైషాం ప్రత్నో అభిరక్షతవ్రతమ్"

అను శ్రుతివలనఁగు శదర్భాదులకుఁ బలిత్రమనునామముకలదని తెలియు చున్నది. ఇందలి శష్ప్యపదముచేఁగుశదర్భాదులుచెప్పఁబడుచున్నవి. వానిలోఁగలతేజస్సు శివస్వరూపము. వానిలో శివుడు గలడన్నమాట కావున ఆతడు శష్ప్యనామకుడాయెను. "శసు = హింసాయాం" అను ధాతువునుండి యేర్పడిన శష్పపదమునకు హింసించునదని యర్థముకలదు. హింసించు వస్తువులందుఁగల సంహారశక్తి శివునకుఁ జెందినదే. వానియందున్నకారణ మున శివుడు శష్ప్యనామకుడాయెనని తెలియుచున్నది.

విష్ణు:

శష్పమనగా దూర్వ. అదిశతమూలయు, శతాంకురయునై తనతో దైవమునర్చించువారిపాపములను బరిహరించును. అందు విష్ణుశక్తివ్యాపించి యుండుటచేతనే దానికి అపాపపరిహారకశక్తిలభించినది. కావున విష్ణువుకూడ శష్ప్యనామకుడాయెను. బుద్ధిసన్నిధిని శష్పమందురు. బుద్ధిసన్నిధినుండునది సహస్రారము. అందు నుండెడివాడు కావున విష్ణువు శష్ప్యనామకుడాయెను.

శష్ప్యనామమున "శ్ + అ + ష్ + ప్ + య్ + అ" అని అక్షరములు కలవు. అవి షడావరణలను, షడింద్రియములను సూచించును. ఇందు ద్వాద శాత్మకుడైన సూర్యునిబీజము షకారము పర్జన్యవాయుదేవబీజములతోఁబాటు లక్ష్మీబీజముతోడనుగూడియున్నది. అందుచే ఈనామము నుపాసించువారికి సూర్యుడుప్రాణశక్తిని, ద్వాదశవిధతేజస్సులనుఒసంగి, వజ్రదేహాలను దివ్య తేజస్కులనుగావించును. వారిపై అమృతస్రావమును వర్షింపఁజేయును.

అంతేకాదు. ఈనామము నుపాసించువారు సూర్యకిరణములనుండి పండ్రెండు విధములైన విద్యుత్తులను స్వీకరించి, వివిధవాయువులశక్తులతో వానిని జోడించి, సూర్యమండలగాములుకాఁగలశక్తి నొసంగఁగలరు. సర్వకాలము లందును సువృష్టికరులను గావింతురని తెలియుచున్నది.

237 నామము- శివ- "నమః ఫేన్యాయచ"

ప్ర. భా. భా:— మహాదేవుడు ఫేనమునందు నీటినురగలోఁ దనదగుశ్వేత తేజస్సును బ్రవేశపెట్టి, ప్రకాశించునుగాన ఫేన్యుడాయెను. మహాశివుడు తన రూపములైన పంచభూతములతో ఉప్పొంగుబ్రహ్మాండమునఁ జేతనాచేతన ముల రూపముననుండును. కావున శివుడు ఫేన్యనామకుడాయెను. "స్ఫాయీ వృద్ధౌ" అను ధాతువునుండియేర్పడుటచే ఫేన్యశబ్దమునకు ఈయర్థమువచ్చెను

విష్ణు;-

సముద్రమునందలి ఫేనమువలెనుండి, అందునుండి జన్మించుటచేఁ జంద్రుడు ఫేనమువంటివాడు. అతనిలోఁ బ్రభారూపముననుండుటచే విష్ణువు ఫేన్యుడాయెను. "స్ఫాయతే = వర్ధత ఇతిఫేనః" అనువ్యుత్పత్తిచేఁ దనరక్ష ణచే నుప్పొంగు బ్రహ్మాండమునకు ఫేనమనిపేరు. అందు సకలవస్తువుల రూపముననుండుటచే విష్ణువు ఫేన్యనామకుడాయెను.

బీజాక్షరసంపుటి;-

ఫేన్యనామమున "ఫ్+ఏ+న్+య్+అ" అని ఐదక్షరములుకలవు. అవి పంచభూతములను, పంచేంద్రియములను సూచించును ఇందు ఫకారై కారములురెండును వీరభద్రపశుపతిబీజములు. అవి సావిత్రీబీజముతోడను, వాయుదేవబీజములతోడనుగూడియున్నవి. పైనామము శాక్తేయులకును, శైవులకును, అద్వైతులకును బ్రధానోపాస్యము. ఈనామము నుపాసించు వారు సకలపాతకములనుండి విముక్తులగుదురు. వైష్ణవమతస్థులు సావిత్రీ

ప్రధానముగాఁ బైనామము నుపాసించి, ముక్తులుకాఁగలరు. భూతప్రేతాది భయమును బోఁగొట్టగలరు. సంహారకరాయుధములనెల్ల నిర్మించి, దుష్టులను ఆదుపులోనుంచఁగలరని తెలియుచున్నది.

-: 17. వ. యజుస్సు :-

"నమస్సికత్యాయచ ప్రవాహ్యాయచ"

అర్థము:-

సికతాయచ = సికతకు అర్హుడైయున్నట్టియును, ప్రవాహ్యాయచ = ప్రవాహమునకు అర్హుడైయున్నట్టిశివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— సైకతలింగరూపముననుండుటచేతను, గంగాప్రవాహమును నెత్తిపైదాల్చుటచేతను, శివుడు, సికతకు (ఇసుకకును) ప్రవాహమునకును అర్హుడై నమస్కరింపబడుచున్నాడు.

238 నామము- శివః

భ. భా. భా:— మానవుడు శ్రద్ధాళువగుచు, స్నానాది తత్పరుడును గంగాదీ తీరవాసియునైయున్నవాడు శష్పాద్యదిధారియైతరించఁగలడు సికతలనగా ఇసుకరేణువులు. వానియందు రజతసువర్ణాదులు తళతళమెఱయుచుండును. వెండి మున్నగులోహములన్నియును శివతేజస్సులే. అగ్నిబీజము పవిత్రతగల దర్భాదులను, సువర్ణాదివస్తువులను ధరించుమానవుడు శివతేజస్సునొంది ఆరోగ్యవంతుడగును. కావున సికతలందుండి సికత్యనామకుడైన శివుని మానవులు నమస్కరింతురు.

విష్ణువు:—

విష్ణువు యమునానదీ సైకతములందు గోపికలతో గూడియుండి, విహరించి, హితబోధ చేసి, గోపికలను భక్తురాండ్రగా వించితరింపఁజేసెను. ఈవిషయము భాగవతమునఁగలదు. అందుందుకారణమున విష్ణువు సికత్యానామకుఁడై నమస్కరింపబడుచున్నాడు.

బీజాక్షరసంపుటి:-

సికత్యానామమున "స్ + ఇ + క్ + అ + త్ + య్ + అ" అని యేడక్షరములుకలవు. అవి సప్తవాయుమండలము.ను, మనోబుద్ధులతోడి పంచేంద్రియములను సూచించును. ఇందలి శక్తిబీజమ. సకారములక్ష్మిని, ఇకారము విష్ణువును సూచించును కాన ఇది లక్ష్మీనారాయణోపాసకులకుఁ బ్రధానము. దీనినుపాసించువారు విష్ణుసాయుజ్యము పొందుదురు. అంతేకాదు. వాయుభేదములను, వాయుప్రేషకయంత్రములను గనుగొనఁగలరు. జలాగ్నివాయుశక్తులచే గృత్రిమవర్షము కురిపింపగలరు. చర్మరోగములను రక్తరోగములను బోఁగొట్టఁగలరు; అనితెలియుచున్నది

239 నామము- శివ:- "నమః ప్రవాహ్యాయచ"

భ. భా. భా:— ప్రవాహముఅనగా నదీస్రోతస్సు. అందుఁగలవేగము, అగ్నిరసము, పరమేశ్వరస్వరూపములు.

"చతుష్టయ్య ఆపోగృహ్ణాతి; చత్వారివా అపాగ్ంరూపాణి; మేఘోవిద్యుత్;
స్తనయిత్నుర్వృష్టిః"

అను శ్రుతిచే మేఘము, విద్యుత్తు (కరంటు) స్తనయిత్నువు (అగ్గిపిడుగు) వృష్టి అనునాల్గును జలదాయకములు. వానిలోఁ బరమేశ్వరుడు తన శక్తిని బ్రవేశపెట్టినాడు. కావున శివుడు ప్రవాహ్యానామకుఁడై నమస్కరింపఁబడుచున్నాడు.

విష్ణు:—

ప్రకృష్టముగా జలమును వహించునది సాగరము (లేక) పర్జన్యము. సాగరము విష్ణువిభూతి. అందు విష్ణువు బడబాగ్నిరూపమునఁగలడు. "సరసామస్మిసాగరః" అను గీతాసూక్తిచేఁ బైవిషయము తెలియుచున్నది. మేఘమునందలి రసము (నీరు అందుండురుచియు) విష్ణుస్వరూపము. రసోఽహమప్సు కౌంతేయ" అను గీతాసూక్తిచే అవిషయము తెలియుచున్నది ప్రవాహ్యము, పర్జన్యము అను రెండును సమానార్థకములు "పర్జన్యఃపావనోఽనిలః" అను విష్ణుసహస్రసూక్తిలోగల బర్జన్యపదము విష్ణునామముగాఁగలదు. పర్జన్యనామమువలెఁబ్రవాహ్యనామముకూడ విష్ణువునకుఁజెందినదే

బీజాక్షరసంపుటి—

ప్రవాహ్యనామమున "ప్+ర్+అ+వ్+అ+హ్+అ" అనియెనిమిదక్షరములుకలవు. అవి అష్టసూర్యమండలములను, శరీరమందలి అష్టచక్రములను సూచించును. ఇందుఁ బర్జన్యాగ్నివరుణవాయుదేవబీజములు శివశక్తిబీజములైన హకారాకారములతోఁగూడియున్నవి. ఇదిశాక్తాద్వైతులకుఁ బ్రధానోపాస్యము. దీనినుపాసించువారు కైలాసమును, వైకుంఠమును బొందుదురు. జలోదరాగ్నిమాంద్యవాత శ్విత్రాదిరోగపరిహారకులై జీవులకు వృద్ధిసిద్ధులనుజేకూర్పఁగలరు. వాయ్వగ్నిజలశక్తులతోఁ గృత్రిమమేఘములను సృష్టించి, వర్షదాయకులుకాఁగలరు. వాయ్వగ్నిజలమండలసంచారులును గాఁగలరని తెలియుచున్నది.

-: నవమానువాకము :-

అష్టమానువాకోక్తనామములకంటె భిన్నములైన నామములు ఇందుఁ జెప్పఁబడుచున్నవి.

— 1. వ. యజుస్సు —

"నమ ఇరిణ్యాయచ ప్రపథ్యాయచ

అర్థము:-

ఇరిణ్యాయచ = ఊషరక్షేత్రములందు (చవిటినేలలో) ఉండునట్టి యును, ప్రపథ్యాయచ = పదిమందినడుచు త్రోవలోనుండునట్టి శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— భగవంతునకు సర్వమును సమానమే. అందుచేఅతడు చవిటినేల లందును, పదిమందినడిచిపోవు మార్గములందునుగలడు. పదుగురు ఆడు మాటయును బదుగురుపోవుత్రోవయును పాడియై ధరలోఁ జెల్లును అప్పాడి యును శివస్వరూపమే. కావుననే ఈవిషయమును సూటిగావేమన "పదుగు రాడుమాట పాటియైధరచెల్లు" అని తనసూక్తిలోఁ బేర్కొనినాడు. అందుచే ఇరిణ్యుడు ప్రపథ్యుడు అను నామములతోఁ బరమశివుడు స్తుతింపఁబడి నమస్కరింపఁబడుచున్నాడు.

240 నామము:- శివ:- "నమఇరిణ్యాయచ"

భ భా. భా:— చవిటినేలలు నివాసయోగ్యములుకావు. అచటనున్నచో ఆహారపానీయాదులు లభింపక నశింతురు. చేతనాచేతనములందు గల శివుడు

వానితోఁబాటుతానును ఇరిణములందుండి అటకుఁ జేరినవానిని నశింపఁజేయును చవిటినేలలోగలమట్టిలో శివస్వరూపమైన అగ్నికలదు. కావున ఆనేలలో అశ్వమునునిలిపి, దానిడెక్కలక్రిందిమట్టినిద్రవ్వి, దానిని గాడిదలచేమోయించితెచ్చి ఉఖాగ్నినిర్మాణమునొనర్చుటకుఁ బయ్యిని తయారుచేయునట్లు వేదమునఁ గలదు. కావున ఇరిణిలోఁగల శివుడు ఇరిణ్యానామకుడాయెను.

విష్ణు:-

చవిటినేలలో ఉప్పుపండింతురు. ఉప్పులో తిన్నఅహారమును జీర్ణము చేయుశక్తికలదు. అదిలేనిదే ఏపదార్థమునను రుచిపుట్టనేరదు. అందుచేతనే "నవరుచులకుఁ దల్లినౌపడాఉప్పుగల్లి" అనుసూక్తియేర్పడినది అయ్యుప్పులో గలరుచియేవైశ్వానరశక్తి అందుచేతనే పరమాత్మ" అహంవైశ్వానరో భూత్వా ప్రాణినాందేహమాశ్రితః। ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నంచతుర్విధమ్" "నేను ఉప్పులోఁ గలరుచియైన వైశ్వానరుడనై ప్రాణులదేహమునఁజేరివారు తినెడి చతుర్విధాహారమును బచనముచేయుచున్నాను" అనిగీతాసూక్తిలోఁ జెప్పినాడు. "ఇందుఁగలడందులేడనిసందేహమువలదు। చక్రిసర్వోపగతుడు." కావున విష్ణువు నివాసయోగ్యముకాని ఇరిణమునందుండియును జీవులకుమేలు చేసి ఇరిణ్యానామకుడాయెనని తెలియుచున్నది.

బీజాక్షరసంపుటి:-

"ఇరిణ్య" నామమున "ఇ+ర్+ఇ+ణ్+య్+అ" అని ఆరక్షరకలవు. అవి షడృతువులను, షడింద్రియములను సూచించును. ఇందలి ఇకారద్వయము విష్ణుబీజము. అది అగ్నిబీజముతోడను, నందిబీజమైన ణకారము వాయుదేవబీజములతోడను, గూడియుండుటచేఁ బైనామము నుపాసించువారు శివకేశవశక్తులను రెండింటిని సంపాదించుకొని ముక్తులుకాఁగలరు అంతే కాదు. అగ్నివాయుభేదములను, తన్మాత్రకవస్తువులను సృజించి, ఆరోగ్యదాతలును భూతప్రేతపిశాచాదిబాధానివారకులునుగాఁగలరు. అగ్నివాయుప్రధానాయుధములద్వారాదుష్టులను శిక్షించి, శిష్టులను రక్షింపఁగలరని తెలియుచున్నది.

241 నామము- శివ:- "నమః ప్రపథ్యాయచ"

భ భా. భా:— పదుగురుపాటించు సన్మార్గము అనగా జపయజ్ఞదానాది మార్గమునందుండి రక్షించువాడును, కర్మఫలప్రదాతయునగుటచే శివుడు ప్రపథ్య నామకుడాయెను. ప్రకృష్టమైనపథమున సూర్యవాయ్వగ్నిస్వరూపుడై యుండి హితకరుడైనకారణమున శివుడు ప్రపథ్యనామకుడాయెననియుఁ జెప్ప వచ్చును. దివి, అంతరిక్షము, పృథివి అను మూడింటికిని జెందినమార్గములే ప్రపథములు. పథమనగామార్గము.

"సూర్యో నో దివస్పాతు వాతో అంతరిక్షాత్, అగ్నిర్నః పార్థివేభ్యః"
అనెడి సౌరమంత్రమువలనఁ బైవిషయము తెలియుచున్నది.

విష్ణు:-

ప్రపథము అనగాఁ బ్రకృష్టమైన కల్యాణమార్గము. అందుండి విష్ణువు తన భక్తులకు శుభములను జేకూర్చును. "భూః పాదౌ యస్య నాభిర్వియదసుర నిలశ్చంద్ర సూర్యౌ చనేత్రే" అను సూక్తిలోఁ జెప్పినవిధముననుసరించి, విష్ణువు సూర్యచంద్రాగ్నివాయుస్వరూపుడని తెలియుచున్నది. అందుచే విష్ణువు జీవులకు సూర్యరూపమున ఆరోగ్యమును, చంద్రరూపమున అన్నమును, వాయురూపమునఁ బ్రాణశక్తిని, అగ్నిరూపమునఁ దేజస్సును, ఒసఁగుచు శ్రేయస్కరుడైన కారణమునఁ బ్రపథ్యనామకుడైనట్లు తెలియుచున్నది.

బీజాక్షరసంపుటి:-

ప్రపథ్యనామమున "ప్ + ర్ + అ + ప్ + అ + థ్ + య్ + అ" అని యెనిమిదక్షరములుకలవు. అవి అష్టప్రకృతులను, అష్టచక్రములను సూచించును. పైనామము నుపాసించువారు ఆత్మారాధకులై, యోగులై

వైకుంఠమునొందఁగలరు. వాయ్వగ్ని పర్జన్యశక్తులతో గృత్రిమమేఘములను సృష్టించి, పాడిపంటలతో దేశమును తులతూగించి, జనులకు వృద్ధిసిద్ధులను జేకూర్పఁగలరు. అగ్నిమాంద్యవాతమత్రిభ ఋణాదిరోగపరిహారకులుకాఁగలరని తెలియుచున్నది.

— 2. వ. యజుస్సు —

"నమఃకిగ్ంశిలాయచక్షయణాయచ"

అర్థము:-

కిగ్ంశిలాయచ = కుత్సితములు అనగా క్షుద్రములైన శిలలుగలప్రదేశమందుండునట్టియు, క్షయణాయచ = నివాసయోగ్యప్రదేశమందున్నట్టి, శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— మహాదేవుడు జీవచైతన్యమునఁజేరినకారణమున జీవులకవసరమగు చేతనాచేతనవస్తువులందెల్లఁగలడు. అందుచేఁ గుత్సితశిలలుగల ప్రదేశములందు లోహరూపమునఁగలడు. నివాసయోగ్యప్రదేశములందు ఆహారవస్త్రభవనాదిరూపముననున్నవాడు. అందుచే అతనికి నమస్కారము.

242 వ. నామము:- శివ "నమఃకిగ్ంశిలాయచ"

వ. భా. భా:— కింశిలలనగా క్షుద్ర శిలావృతప్రదేశములు అందుమహాదేవుడు స్ఫటికములు మున్నగురత్నములరూపముననున్నాడు. అందుచేతనే జనులు అమోఘలములనందుటకై నవరత్నధారణమొనరింతురు. కింశిలలు దొరకుతావునఁగలవాడు కావున శివుడు కింశిలనామకుడాయెను.

విష్ణు

"తేజస్తేజస్వినామహమ్" అనుగీతాసూక్తిచేఁదేజోవంతములైన రత్నాదులలోని తేజస్సు విష్ణువిభూతియని తెలియుచున్నది. కింశిలలలో నవరత్నాదులలో విష్ణువు తేజోరూపమునగలడు. "శిఞ్ = నిశాతనే" అను ధాతువునుండి యేర్పడిన శిలాపదమునకు ఆయుధములను తనూకరించునదియని తెలియుచున్నది. కిం = అణురూపమున అల్పమైయుండు, శిల = ఆయుధములను తనూకరించు సుదర్శనముకలవాడు విష్ణువు పైవిషయములచే విష్ణువు కింశిల నామకుడాయెనని తెలియుచున్నది.

బీజాక్షరసంపుటి-

కింశిలనామమున "క్+ఇ+మ్+శ్+ఇ+ల్+అ" అని యేడక్షరములుకలవు. అవి సప్తమేఘమండలములను, మనోబుద్ధులతోడి పంచేంద్రియములను సూచించును. లక్ష్మీవిష్ణుబీజములైన శకారేకారములు ప్రజాపతి మదనపృథివీ దేవబీజములతోఁ గూడియున్నవి. పృథివీచక్రమున లక్ష్మీనారాయణుల నుపాసించినవారు వృష్టికరులై సకల సస్యములను బండించియు బృధివియందుఁగల సకలధనరాసులను, సకలలోహౌషధ రాసులను బైటపెట్టి ప్రజల కోర్కెలను దీర్పఁగలవారలగుదురు. చర్మరోగనివారకులు కాఁగలరని తెలియుచున్నది.

243 వ. నామము- *శివ;- "నమః క్షయణాయచ"*

భ. భా. భా:— "క్షి = నివాసగత్యోః" అను ధాతువునుండియేర్పడిన క్షయణపదమునకు నివాసయోగ్యప్రదేశమందున్నవాడనియర్థము మహాదేవుడు చేతనాచేతనవస్తువులందువలె నివాసయోగ్యప్రదేశమందును గలడు. అనగా గ్రామ, నగరాదులందంతటను గలడు. అందుచే క్షయణనామకుడాయెను. సకల సంహారకర్తయై క్షయమొందించువాడు కావున క్షయణ నామకుడాయెను.

స్వల్పప్రాణులైన జీవులు శష్పతుల్యములు. స్వల్పాయుష్కులు ఫేనతుల్యులు. అతిక్షుద్రులు సికతసమానులు. ప్రకృష్టములైనమహావిభూతులు ప్రవాహతుల్యములు. శూన్యశక్తులు ఇరిణసదృశులు. ప్రకృష్టమార్గప్రవర్తనులు ప్రప్రథతుల్యులు. కుత్సితశీలురు కింశిల సమానులు క్షయశీలురుక్షయణులు. వీరందఱిలో నుండుటచే శివుడు శష్ప్యాది నామధేయుడైయుండెను. అందుచేశివుడు వైవానిపై అనుగ్రహముచూపును.

విష్ణు:

మహావిష్ణువు దుష్టులైన రాక్షసాదులనెల్లనశింపఁజేయువాడును, శిష్టులైనదేవాదులనెల్లక్షయములను = గృహములనుజేర్చి, రక్షించువాడగుటచే క్షయణనామకుడాయెను. ఈక్షయపదముయొక్క అర్థమునే "క్షేమకృత్, క్షోభణః" అను విష్ణుసహస్రనామములు వ్యక్తముచేయును. అందుచే విష్ణువు క్షయణనామకుడాయెను.

బీజాక్షరసంపుటి:-

క్షయణనామమున "క్+ష్+అ+య్+అ+ణ్+అ" అని యేడక్షరములుకలవు. అవి సప్తమేఘమండలములను, మనోబుద్ధులతోడి పంచేంద్రియములను సూచించును. ఈనామమున ద్వాదశాత్మబీజము షకారము ప్రధానము దీనినుపాసించువారు సూర్యమండలభేదులై వైకుంఠము చేరగలరు. తాము ఆరోగ్యవంతులగుటతోబాటు ఉపాసకులులోకులకు ఆరోగ్యముచేకూర్పగలరు. సూర్యకిరణములనుండి ద్వాదశ విధతేజస్సులను స్వీకరించి, వాయుప్రజాపతిశక్తులనుజోడించి, మారణాయుధప్రష్టలై శత్రుభేదకులు కాఁగలరు. వాయుప్రజాపతినందికేశ్వరశక్తులను స్వీకరించి, సూర్యమండలగాములుకాఁగలరని తెలియుచున్నది.

-: 3. వ. యజుస్సు :-

"నమః కపర్దినేచ పులస్తయేచ"

అర్థము:-

కపర్దినేచ = జటాబంధముకలవాడును, పులస్తయేచ = భక్తులయెదుట నుండునట్టి శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— పరమేశ్వరుడు గంగాప్రవాహప్రమాదనివారణకై జటాబంధము కల్గియుండెను. తననుధ్యానించి, తపస్సుచేయుభక్తులయెదుట దయాశాలియై యుండును. అందుచే జనులాతనిని నమస్కరింతురు.

244 నామము- శివ- "నమః కపర్దినేచ"

భ. భా. భా.— భగవానుడు పరమేశ్వరుడు భక్తులపట్ల అనుగ్రహముచూపు కాలమునఁ గపర్దియై అనగా జటాబంధముకలవాడైవచ్చునని కొందఱు అందురు. మహానుభావుడైన అతడు తననుగొల్చువారికెల్ల సులభుడని తెలిసి కొనవలసియున్నది. అతడు గంగాజలముతోఁ దనశిరస్సును బూరించియుండి. తజ్జలముతో లోకములను బవిత్రముచేయువాడు కావున. కపర్దినామకుడాయె నని తెలియుచున్నది.

విష్ణు:—

విష్ణువు, కేన = నీటితో, పర్ది = జగంబులను బూరించుచున్నాడు. అతడు తన పాదమలనుండిపుట్టిన గంగాజలముతో బ్రహ్మాండమును నింపి, పవిత్రముచేయుచున్నాడు. కం = వాయువును, వివర్తి తిపర్ది = లోకముల వ్యాపింపఁజేసి నింపుచున్నాడు. పైకారణములచే విష్ణువు కపర్దినామకుడాయె నని తెలియుచున్నది.

బీజాక్షరసంపుటి—

కపర్దినామమున "క్+అ+ప్+అ+ర్+ద్+ఇ+న్" అని యెనిమిదక్షరములుకలవు. అవి అష్టదిక్కులను, శరీరమందలి అష్టచక్రములను సూచించును. ఇందు అగ్నిదుర్గాబీజములు రేఫదకారములు విష్ణుబీజముతోడను ముందున ప్రజాపతిపర్జన్యసర్వదేవబీజములతోడను, గూడియున్నవి. దీని నుపాసించువాడు అగ్నిస్వరూపిణియగు దుర్గాదేవిని, మహాలక్ష్మిని విష్ణువును గన్నులారఁగాంచి ముక్తుడగును, రక్తదోషరోగములను, శ్యామలరోగమును, పచ్చకామెర్లనుదొలగించి, లోకము నుద్ధరింపఁగలడని తెలియుచున్నది.

245 వ. నామము:- శివ— "నమఃపులస్తయేచ"

భ. భా. ఖా:— పులస్తలను (ముంగురులను) గల్గి, భక్తులకు అనుగ్రహముతో దర్శనమొసంగును. సర్వదా సకలజనులపురోభాగముననుండి రక్షించును. కావున పులస్తినామకుడాయెను. రేఫలకారములకు వ్యాకరణశాస్త్ర రీత్యాభేదములేనికారణమున "పుల పుర" అను రెండుపదములను సమానార్థకములే కాన "పులస్తి" పదమునకుఁ బురోభాగముననున్నవాడను నర్థము వాటిల్లెను. అందుచే శివుడు పులస్తి (పురస్తి) నామకుడాయెనని తెలియుచున్నది

విష్ణు:-

"పులఃసర్వవ్యాపకస్సన్స్త్యాయతి = సంచినోతిసర్వమ్" అను వ్యుత్పత్తిచే, సర్వవ్యాపకుడైన విష్ణువు ప్రళయమున సమస్తమును నశింపఁజేయును. కావున అతడు పులస్తినామకుడాయెనని తెలియుచున్నది.

బీజాక్షరసంపుటి-

పులస్తిపదమున "ప్+ఉ+ల్+అ+స్+త్+ఇ" అని యేడక్షరములు కలవు. అవి సప్తవాయుమండలములను సప్తగ్రంథులను సూచించును. పైనామమును ఉపాసించువాడు పృథివిలోనుండియే శక్తిపిష్ఠ సాక్షాత్కారము పొందఁగలడు. సకలవాయువులను సృష్టించి, వానిసాయమున భూమిలోగల వస్తువులనెల్లవెలిబుచ్చుయంత్రములకు నిర్మాతయు, కృత్రిమమేఘనిర్మాతయునై ప్రపంచప్రఖ్యాతుడుకాఁగలడని తెలియుచున్నది.

— 4. వ. యజుస్సు —

"నమోగోష్ఠ్యాయచగృహ్యాయచ"

అర్థము:-

గోష్ఠ్యాయచ = గోశాలలోనుండునట్టియు, గృహ్యాయచ = సామాన్య గృహమునందుండునట్టి శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— మహాదేవుడు గోశాలలో గోరూపముననుు, సామాన్యగృహములందు సామాన్యజనులుగానుండును. కాన ఆతనికి నమస్కారము.

246 వ. నామము- శివ:- "నమోగోష్ఠ్యాయచ"

భ. భా. భా:— పశుపతియైన శివుడు గోశాలలో గోరూపమునసుండుటచే గోష్ఠ్యుడాయెను. "గావఃజలానిఅత్రతిష్ఠన్తి" అను వ్యుత్పత్తిచే జలము సమృద్ధిగానుండు సముద్రమునకు గోష్ఠమనిపేరు. అట్టిగోష్ఠములో బడబాగ్నిరూపమున మహాదేవుడుండును గోవులు అగ్నియును పరమపవిత్రములు వానిరూపమున నుండుటచే శివుడు గోష్ఠ్యనామకుడాయెను.

విష్ణు-

గోవులుఅనగా కాంతికిరణములు. వానికి నిలయులైన సూర్యచంద్రులు గోష్ఠులగుదురు వారిలోఁ ప్రభారూపమున (కాంతిరూపమున) విష్ణువు ఉండును. కాన అతడు గోష్ఠ్యుడాయెను. గోవులు అనగా ఇషువులు = బాణములు. అవి గలది కావున అమ్ములపొదికిగోష్ఠమనిపేరు. అందునారాయణాస్త్రముమున్నగు రూపముననుండువాడు కావున విష్ణువు గోష్ఠ్యుడాయెను, గోవులు అనగా వాక్కులు. వానికి తావులు వేదములు. వానియందుమహిమరూపమున నుండుటచే విష్ణువు గోష్ఠ్యుడాయెను. పైవిధమున గోష్ఠ్యనామకుడైన విష్ణువునకు నమస్కారము.

బీజాక్షరసంపుటి:-

గోష్ఠ్యనామమున "గ్ + ఓ + ష్ + ఠ్ + య్ + అ" అని ఆరక్షరములు కలవు. అవి షడృతువులను, షడింద్రియములను సూచించును. ఇందు గకారము గణపతిబీజము, ఈశ్వరబీజమైన ఓకారముతోడను, ద్వాదశాత్మ (సూర్య) బీజముచంద్రబీజమైన ఠకారముతోడను, వాయుదేవబీజముల తోడనుగూడియున్నది. ఈనామమున మహాదేవుడు సూర్యచంద్రవాయురూపుడుగా ధ్యానింపఁబడి, ఉపాసకులకుయోగమున్నగు సకలవిద్యలను, కైలాసమును ఒసంగును పైనామము నుపాసించువారు సూర్యచంద్రమండలగాములును ద్వాదశసూర్యతేజోగ్రాహకులునై ఆరోగ్యదాతలు కాఁగలరని తెలియుచున్నది.

247 నామము:- శివ— "నమోగృహ్యాయచ"

భ ఖా. ఖా:— ప్రతిగృహమందునున్నవాడగుటచే శివుడు గృహ్యుడాయెను. భారతీయులు ప్రతిగృహమునందును ఐశ్వర్యమును జ్ఞానమునపేక్షించి, శివునారాధింతురు. అందుచే శివుడు గృహ్యానామకుడాయెను.

విష్ణు:—

ప్రతిమానవుడును రక్షణకాముడై సంపదనభిలషించువాడై తమ గృహములందు లక్ష్మీనారాయణులను ఆరాధించును. నారాయణునిరూపాంతరములైన సూర్యసత్యనారాయణవేంకటేశ్వరులనారాధింతురు. కావున విష్ణువు గృహ్యానామకుడాయెను.

బీజాక్షరసంపుటి-

గృహ్యానామమున "గ్ + ఋ + హ్ + య్ + అ" అని యైదక్షరములు కలవు. అవి పంచభూతములను పంచకోశములను సూచించును. ఈనామము బ్రహ్మశివప్రధానము. దీనినుపాసించువారు యోగులును జ్ఞానులునై ముక్తులగుదురు. ఈనామము నుపాసించువారు నిర్విఘ్నముగా నూతన వస్తు సృష్టిని, శత్రుసంహారమునుగావింపఁగలరు. రక్తదోషరోగములను, కామెలను శ్యామలరోగమును, భూతాదిబాధలను దొలగింపఁగలరు; అని తెలియుచున్నది.

— లో. వ. యజుస్సు —

"నమస్తల్ప్యాయచగేహ్యాయచ"

అర్థము:-

తల్ప్యాయచ = తల్పమునందును, మంచముపైని శయనించునట్టియునూ గేహ్యాయచ = ధనికులప్రాసాదములందుండువాడునగు శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— మహాశివుడు జీవరూపముదాల్చుటచే సామాన్యమానవునివలెఁ దల్పమునందును, మంచమునందును శయనించియుండును. అతడు ధన వంతులవలె మహాప్రాసాదములందును ఉండును. అట్టి యాతనికి నమస్కారము.

248 నామము- శివ:- "నమస్తల్ప్యాయచ"

భ. భా. భా:— జీవులకు సుఖముచేకూర్చుటయే మహాదేవుని కృత్యము. అతడు చేతనాచేతనములందెల్లనుగలడు. అతడు అచేతనమైన తల్పమందుండి సుఖకరుడై తల్ప్యనామకుడాయెను. భగవంతునిలోఁగలశక్తియే మూల ప్రకృతి ఆమె జలస్వరూపిణి. అందు శివుడు రసము శైత్యము, మున్నగురూపముల నుండుటచేఁ దల్ప్యనామకుడాయెను. అతని తల్పమే పుష్కరపర్ణము. అందుండు ప్రజాపతియే పరమశివుడు; అను నీవిషయము "సప్రజాపతిరేకః పుష్కరపర్ణే సమభవత్" అను శ్రుతిలోఁ జెప్పఁబడెను. అట్టి తల్ప్యుడైన శివు వకు నమస్కారము.

విష్ణు:—

మహావిష్ణువు తన ప్రతిబింబమును జీవుడునగు ఆదిశేషుని దల్పముగాఁ జేసికొని అందుండుటచేఁ దల్ప్యనామకుడాయెను. తల్పపదము "తల = ప్రతిష్ఠాయామ్" అనుధాతువునుండియేర్పడెను. ఆతల్పపదమునకు భార్య యని యర్థము. భగవంతునకు భక్తులెల్లరును భార్యలే అందుచే అతడు "గోవువెంటఁదగులుకోడెభంగి" నుండి తనభక్తులవెంటనేగుచువారిలోనుండును వారే వానికిఁ బ్రతిష్ఠచేకూర్తురు. అందుచే విష్ణువు తల్ప్యనామకుడాయెను.

బీజాక్షరసంపుటి—

తల్ప్యపదమున "త్+అ+ల్+ప్+య్+అ" అని ఆఱక్షరములు కలవు. అవి షడావరణములను, షడింద్రియములను సూచించును. ఈనామము నుపాసించువారు పృథివిలో సుప్రతిష్ఠులుకాఁగలరు వారువాయుభేదములను తెలిసికొనివానితోఁ బలురకములగు యంత్రములను నిర్మించి, పృథివిలోఁగల సకల వస్తువులను వెలిపుచ్చఁగలరు. కృత్రిమమేఘనిర్మాతలు కాఁగలరు. చర్మమున నేర్పడు తెలుపు, ఎఱుపు, నలుపు మచ్చలనుబోఁగొట్టఁగలరని తెలియు చున్నది.

249 నామము:- శివ:- "నమోగేహ్యాయచ"

శ. భా. భా:— ధనవంతులు నివసించుప్రాసాదాదులకు గేహమనిపేరు. అందుండు జీవులలోఁ జేరిపరమశివుడు నివసించును. "గ్రహ = ఉపాదానే" అను ధాతువునుండియేర్పడిన గేహపదమునకు గ్రహించుట అని యర్థము. పురుషుడు సంపాదించు పురుషార్థములలో ధనమును గ్రహించునది గేహము ఆధనమే ఐశ్వర్యము. తనభక్తులకు ఐశ్వర్యమొసంగుటకు మహాదేవుడు వారి గృహములందుండును. కావున గేహ్యానామకుడాయెను. అంతేకాదు. జీవుల దేహములకును ఇంద్రియాదులను గ్రహించియుండుకారణమున గేహమను సంజ్ఞకలదు. ఆగేహమున జీవరూపముననుండుటచే శివుడు గేహ్యానామకు డాయెనని చెప్పవచును.

విష్ణువు:—

భగవంతుడు మహావిష్ణువు లక్ష్మీదేవినివిడువకయేయుండు. లక్ష్మీదేవి రూపములలో ధనమొకటికావుననే ఆమెకు ధనలక్ష్మియనునామమువాటిల్లెను. ఆమెగేహములందుండును ఆమెతోగూడి గేహములందున్నకారణమున విష్ణువునకు గేహ్యానామమువాటిల్లెను. "ధనమగ్నిర్ధనంవాయుర్ధనం సూర్యో

ధనంవసుః" అను సూక్తివలన అగ్ని, వాయువు ధనఃక్ష్మీరూపాన్తరముఃని తెలియుచున్నది అవి గేహమైనశరీరములోనుండును. ఆగేహమునందేవానితోఁ గూడి విష్ణువు జ్యోతీరూపమునగలడు. ఆగేహము పద్మకోశప్రతీకాశమైన హృదయము. అందున్నకారణమున విష్ణువు గేహ్యానామకుడాయెనని తెలియుచున్నది.

బీజాక్షరసంపుటి:-

గేహ్యానామమున "గ్+ఏ+హ్+య్+అ" అని ఐదక్షరములు కలవు. అవి పంచభూతములను ఐంచేంద్రియములను సూచించును. వీనిలో శివబీజమైన హకారము వీరభద్రగణపతివాయుదేవబీజాక్షరములతోగూడి యుండెను. ఇవన్నియును శివసంబంధములే. దీనినుపాసించువాడు అష్టైశ్వర్య సంపన్నుడై శివసాయుజ్యమునందును. పైనామము నుపాసించువాడు సర్వ సైన్యాధ్యక్షుడై, సకల సంహారకర్తకాఁగలడనియును, సకల చర్మరోగములను భూతప్రేతపిశాచాదులను దొలగించువాడుకాఁగలడనియును తెలియుచున్నది.

.: 6. వ. యజుస్సు :-

"నమఃకాట్యాయచ గహ్వరేష్ఠాయచ"

అర్థము:-

కాట్యాయచ = కుత్సితముగాఁ దిరుగుపొడను, ముండ్లతోనిండిన లతాదులచేఁ బ్రవేశింపనలవికానిప్రదేశమున నున్నవాడును, గహ్వరేష్ఠాయచ = విషయములైన గిరిగుహాదులలోనుండువాడునగు శివునకు నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— మహాదేవుడు దిగంబరుడును, సర్వభూషణుడునగుటచేఁ గుత్సితముగాఁదిరుగుచుండును. సర్వవ్యాపకుడుకాన ముండ్లతుప్పలతోనిండి, దుష్ప్రవేశమైన దుమారణ్యమందునుగలడు. గిరిగుహాదులందునుగలడు. అట్టియాతనికి నమస్కారము.

250 నామము- శివ:+విష్ణు: "నమఃకాట్యాయచ"

భ. భా. భా:— ఈకాట్యనామమునకు అర్థము 218 వ. నామమున శివవిష్ణుబీజాక్షరపరముగా ఇంతకుమున్నే వివరింపఁబడెను.

251 నామము- శివ- "నమోగహ్వరేష్ఠాయచ"

భ. భా. భా:— పరమేశ్వరుడు సతీదేవియొక్క దేహత్యాగానన్తరమున హిమవత్పర్వతారణ్యగుహాలందుండి తపంబొనరించెను. అందుచే గహ్వరేష్ఠనామకుడాయెను. దుష్టశక్తులు విహరించునట్టి తావులందుండుటచే 'గహ్వరేష్ఠనామకుడాయెననియుఁ జెప్పవచ్చును.

విష్ణు:—

"అంతశ్చరతి భూతేషుగుహాయాం విశ్వమూర్తిషు" అను శ్రుతిలో మహానుభావుడైన విష్ణువు సకల భూతములందేకాక గహ్వరమందునుగలడని చెప్పఁబడెను. అంతేకాదు గహ్వరమనగాఁగానరానిచోటు. హిరణ్యాక్షశివుడు వెంటాడునపుడు కానరానిచోటైన వానిహృదయమందేదాగియుండెను. పైకారణములచే విష్ణువు గహ్వరేష్ఠనామకుడాయెనని తెలియుచున్నది.

బీజాక్షరసంపుటి:-

గహ్వరేష్ఠనామమున 'గ్+అ+హ్+వ్+అ+ర్+ఏ+ష్+ఠ్+

అ" అని పదక్షరములుకలవు. అవి దశదిక్కులను, దశేంద్రియములను సూచించును. ఇది కేవలము శివశక్తిసంబంధమగు నామము ఇందు గణపతి వీరభద్ర ధనద బీజములు శక్తిశివబీజములును సర్వదేవవరుణాగ్నిబీజములతో గూడియున్నవి. ఈనామమును ఉపాసించువారు శివశక్తి సాయుజ్యమునంద గలరు. ఇహలోకమున ధనములనంద(గలరు అంతేకాదు అగ్నిశక్తిసహాయులై జలశక్తినిబైటపెట్టి వారుణాగ్నేయాస్త్రములను (ఉదజన్యఅణుబాంబులను) గనుగొని సకల శత్రుసంహారకులు కాగలరని తెలియుచున్నది. రక్తపుబోటు, కామెల, శ్విత్రరోగము అనువానిని పరిహరించువారై, స్ఫటికములను వెలిబుచ్చగలవారలును అగుదురని తెలియుచున్నది.

— 7. వ. యజుస్సు —

"నమోహ్రదయ్యాయచ నివేష్ప్యాయచ"

అర్థము:-

హ్రదయ్యాయచ = అగాధ జలములందుండువాడును, నివేష్ప్యాయచ = నీహారజలమందుండువాడునగు, శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా.భా. :— మహాదేవుడు అగాధజలములందును, మంచునీళ్ళలోనుండి, జలజంతువులను రక్షించుటేకాక నీహారమండలి(మంచులోని) చల్లదనముతో సకలవస్తువులును బహుకాలము చెడకయుండునట్లు గావించును. అందుచే అతనికి నమస్కారము.

252 నామము- శివ- "నమోహ్రదయ్యాయచ"

భ. భా. భా:— హ్రదమనగా అగాధజలాశయము. అందుండి కెరటములచే మహాధ్వని బయల్వెడలును. అదిఆకాశగుణము. ఆకాశము శివస్వరూపము. మహాశివుడు హ్రదయ్యానామకుడాయెను.

విష్ణు:—

శబ్దఃఖేపౌరుషంనృషు" అను గీతాసూక్తిచే ఆకాశమందలిశబ్దము విష్ణు స్వరూపమనితెలియుచున్నది. ఆ శబ్దము హ్రాదమందునుగలదు. కావున విష్ణువు హ్రాదయ్యానామకుడాయెను.

బీజాక్షరసంపుటి:-

హ్రాదయ్యానామమున దుర్గాబీజమైన దకారమును, శివబీజమైన హకారమును అగ్నివాయుసర్వదేవబీజములతోఁగూడియున్నవి. ప్రాణాయామ క్రియలోఁ నై నామమును శివదుర్గాప్రధానముగా నుపాసించువారు అష్టసిద్ధుల నొందఁగలరు. వాయ్వగ్నిశక్తులచే దుర్గమప్రదేశములనైనను జేరఁగలరని తెలియుచున్నది. వాతరక్తదోషసంజనితరోగములను నిర్మూలింపఁగలరని తెలియుచున్నది ఇందు "హ్ + ర్ + అ + ద్ + అ + య్ + య్ + "అ అని యెనిమిదక్షరములుకలవు. అవి అష్టప్రకృతులను అష్టచక్రములను సూచించును.

253 నామము:- శివ — "నివేష్యాయచ"

భ. భా. భా:— నివేష్యమనగా మంచునీరు. అందుశీతల గుణరూపమున నుండుటచే మహాశివుడు నివేష్యుడాయెను. పరమశివుడు హిమాలయమునఁ దపంబొనరించునపుడు నివేష్యమైన మంచునీటియందేకలడు. కావున ఆ నామమాతనికి సార్థకము.

విష్ణు-

"రసోఽహమప్సుకౌంతేయ" అను గీతాసూక్తిచే జలమందలిరసము విష్ణుస్వరూపమని తెలియుచున్నది. విష్ణువు నీహారజలమందు రసరూపమునఁ గలడు; కావున నివేష్యానామకుడాయెను.

బీజాక్షరసంపుటి:-

నివేష్యనామమున "న్ + ఇ + వ్ + ఏ + ష్ + వ్ + య్ + అ" అని యెనిమిదక్షరములుకలవు. అవి అష్టప్రకృతులను మనోబుద్ధిచిత్తములతోడి

పంచేంద్రియములను సూచించును. వీనిలో సావిత్రీవరుణసూర్యబీజములు, విష్ణు వీరభద్రపర్జన్యవాయుదేవబీజములతోఁగూడియున్నవి. దీని నుపాసించు వారు వైకుంఠముచేరుదురు. సూర్యమండలగామి యంత్రములను సూర్య కిరణజన్యశక్తిస్ఫోరకయంత్రములను, జలాంతర్గామియంత్రములను, జల వస్తుసూచకయంత్రములను, సర్వవ్యాపకములగు అణువాయుశక్తులచే నిర్మింప గలవారలగుదురు. జలోదరము, పుట్టువ్రణము, చిన్నమెదడునకుఁజెందిన రోగములు, వాతరోగములు సర్వవ్యాపకక్రిమిరోగములు మున్నగువానిని అణు యంత్రములచే నిర్మూలింపఁగలవారలగుదురని తెలియుచున్నది.

— 8. వ. యజుస్సు —

"నమఃపాగ్ంసవ్యాయచ రజస్యాయచ"

అర్థము:-

పాంసవ్యాయచ = పరమాణువులందున్నట్టియును, రజస్యాయచ = విస్పష్టమైన ధూళిలోనున్నట్టి, శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— ఇందుగలడందులేడని సందేహమువలదు. మహాశివుడు పరమా ణువులందుఁగలడు. అటులనే ధూళిలో సైతముకలడు. అతనికి నమస్కారము,

254 వ. నామము- శివః- "నమఃపాంసవ్యాయచ"

భ. భా. భా:— "అణోరణీయాన్" అను శ్రుతిచొ॥న మహాదేవుడు అణువు కంటె అణువుగానుండును. అందుచే నాతడు పాంసువులందు = సూక్ష్మ రేణువులందుండి పాంసవ్యనామకుడాయెను. "పసి = నాశనే" అను ధాతువు నుండియేర్పడిన పాంసుపదమునకు నశింపఁజేయునదని యర్థము. సర్వమును నశింపఁజేయునవి అణుశక్తులు. వానిలో సంహారకుడుగానుండుటచే శివునకుఁ బాంసవ్యుడని నామమేర్పడెను.

విష్ణుః-

"పాంసయతి సృష్టిమ్" అను వ్యుత్పత్తిచే చూపరుల సృష్టిని నశింపఁ జేయువాడు సూర్యభగవానుడు. అతనిలోఁ బ్రభారూపమున విష్ణువున్నట్లు "ప్రభాస్మి శశిసూర్యయోః" అను గీతాసూక్తిచేఁ దెలియుచున్నది. కావున విష్ణువునకును పాంసవ్యుడను నామము సార్థకమని తెలియుచున్నవి.

బీజాక్షర సంపుటి—

పాంసవ్యనామమున "ప్+ఆ+మ్+స్+అ+వ్+య్+అ" అని యెనిమిదక్షరములు కలవు. అవి అష్టప్రకృతులను, అష్ట చక్రములను సూచించును. శక్తిపరాశక్తి బీజములు, పర్జన్య మదన విష్ణుబీజములతోఁ గూడియున్నవి. వరుణవాయుబీజములు అకారముతో గూడియున్నవి. ఈ నామము శక్తిప్రధానము. దీనిని ప్రాణాయామమున జలస్థానమున నుపాసించువారు సకలకామములను బొందగలరు. జలమునందలి వస్తుజాలమునెల్లఁ గనుగొనఁ గలరు. వాయుసహాయమున సముద్రాదులలో సంచరింపఁగలరు; అని తెలియుచున్నది.

255 వ. నామము:- శివ— "నమో రజస్యాయచ"

భ. భా. భా:— "మహతో మహీయన్" అను శ్రుతిలోఁ జెప్పినట్లు మహాదేవుడు మహత్తులకంటె మహత్తైయున్నాడు. రజస్సు అను దానికి ధూళి, రజోగుణము అని రెండు అర్థములు కలవు. రెండును మహత్తులే. వానిలో మహాదేవుడు కలడు. రజస్సుతో = ధూళితోఁ గూడిన ఆహారపదార్థములు హాని చేకూర్చును. రజస్సు కన్నులలోఁ బడి దృష్టిని జెడఁగొట్టును. అందుచే రజస్సులందు స్థూల రేణువులందు ఉన్నవాడై రజస్యుడాయెనని ఇందుఁ జెప్పఁబడెను. అంతేకాదు. రజస్సునుండి = రజోగుణమునుండి ప్రాణులకు హానిచేయు కామక్రోధములుద్భవించునని "కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః" అను గీతాసూక్తిచేఁ దెలియుచున్నది. లోకముపైఁ గ్రోధము చూపువాడు శివుడు. అతడు క్రోధరూపుడై రజోగుణమునందుండును. అందుచే రజస్యుడాయెను.

"యదస్యపారేరజసః" అనుసూక్తిచే రజశ్శబ్దము లోకవాచకమని తెలియు చున్నది రజోలోకమున నుండుటచే శివుడు రజస్యనామకుడాయెననియుఁ దెలియుచున్నది.

విష్ణు: "రజ్యంతే అనేనేతిరజః" ఈరజోగుణముచే అందఱును రాగయుక్తులగుదురు. లోకమును రాగయుక్తముగానొనర్చుటకు విష్ణువు రజోగుణమున నుండునను విషయము "ధర్మావిరుద్ధోరాగోఽస్మి" ధర్మవిరుద్ధముకాని రాగమునేననిచెప్పిన గీతాసూక్తిచేఁ దెలియుచున్నది. "రజఃకర్మణిభారత" అను గీతాసూక్తిచే రజోగుణము జీవులకుఁ గర్మలందాసక్తిని గల్గించునని తెలియు చున్నది. విష్ణువు రజోగుణముననుండి రాక్షసులలో రజోగుణమును రేకెత్తించి వారిచే దుష్టకృత్యములనుజేయించి, వారిని శిక్షించినాడు. అందుచే విష్ణువు రజస్యుడాయెను. అతడు రజోగుణముననుండుటచేతనే రజోగుణనిలయులైన వానరులు శ్రీరామచంద్రుని ప్రేమించి భావిజన్మలోగోపికలై శ్రీకృష్ణుని ప్రేమించినారు. అపుడు విష్ణువు శ్రీకృష్ణుడై భ్రమరగీతమువారిచేఁ బాడించినాడు. కావున విష్ణువును రజస్యనామకుడాయెనని తెలియుచున్నది.

బీజాక్షరసంపుటి:-

రజస్యనామమున "ర్+అ+జ్+అ+స్+య్+అ" అని యేడక్షరములుకలవు. ఇవి సప్తవాయుమండలములను, సప్త ధాతువులను సూచించును. ఇందు ఇంద్రశక్తిబీజములు జకారసకారములు ప్రధానములు. వానిముందువెనుకలలో అగ్నివాయుదేవబీజములుకలవు. ఇందుచే కుండలినీ శక్తిని అగ్నిరూపిణిగాభావించి ప్రాణాయామమున ఉపాసించవలెను. ఇట్లు చేసిన ఉపాసకులు ఇంద్రలోకమును జేరఁగలరు. అంతేకాదు. పైనామము నుపాసించువారు శక్తిదయచే మహిమనొంది రాజులును నాయకులును అధికారులుకాఁగలరు. శత్రుంజయులుకాఁగలరు వాయ్వగ్నిశక్తులుకల ఓషధులను దయారుచేసి రక్తదోషరోగములను, వాతరోగములను చిన్నమెదడునకుఁ జెందినరోగములను దొలగించఁగలరు.

-: 9. వ. యజుస్సు :-

"నమశ్శుష్క్యాయచహరిత్యాయచ"

అర్థము:-

శుష్క్యాయచ = కాష్ఠములందు (కఱ్ఱలందు) ఉన్నట్టియును, హరిత్యాయచ = తడిసినదానియందును క్రొత్తవానియందునున్నట్టి, శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము-

సా. భా:— మహాదేవుడు అచేతనములైన కాష్ఠములందును (కఱ్ఱలందును) తడిసినవానియందునుండును. అట్టి శివునకు నమస్కారము.

256 నామము:- శివ:- "నమశ్శుష్క్యాయచ"

భ. భా. భా:— శుష్కము అనగా నీరు లేక ఎండినస్థలము. అది నివాస యోగ్యము. కాన అందుండు వస్తువులలో పంచభూతాత్మకుడై పరమేశ్వరుడుండును. అంతేకాదు. దగ్ధమైన స్థలమునుగూడ శుష్కముఅందురు. అందుండు భస్మము తనకుఁ బ్రీతికరము. కాన శుష్కమున శివుడుండి శుష్క్యనామకుడాయెను.

విష్ణు:— శుష్కము అనగా ఎండినకఱ్ఱ స్తంభము మున్నగునదికదా! విష్ణువు స్తంభమునందుండుటచేతనేకదా! హిరణ్యకశిపుడు పగులఁగొట్టిన స్తంభము నుండి ఉద్భవించి, వానిని సంహరించెను. భగవంతుడు విష్ణువు సర్వమున నుండుననియేకదా "ఇందుఁగలఁడందులేడని సందేహమువలదు।

చక్రిసర్వోపగతుండు।

ఎందెందువెదకిచూచిన నందందేగలడు దానవాగ్రణివింటే"

అను పోతన పద్యమువలనఁ దెలియుచున్నది. శుష్కమునందు (స్తంభము నందు) నృసింహరూపముననను, ఎండిన కట్టెలో అగ్నిరూపముననుండుటచే విష్ణువు శుష్క్యనామకుఁడాయెను.

బీజాక్షరసంపుటి—

శుష్క్యనామమున "శ్ + ఉ + ష్ + క్ + య్ + అ" అని అక్షరములు కలవు. అవి షడృతువులను షడింద్రియములను సూచించును. లక్ష్మీబీజము వాయుబీజమైన ఉకారముతోడను, సూర్యబీజమైన షకారము ప్రజాపతి వాయుదేవబీజములతోడనుగూడియున్నది. దీనినుపాసించువారు. సూర్య తేజస్సును మోక్షలక్ష్మినిబొందుదురు. వాయుసూర్యశక్తులసహాయమున నేలపైనున్న ప్రజలకుఁ జేకూర్పఁగలవారలై, సకలరోగహరులై ఆరోగ్య ప్రదులుకాఁగలరని తెలియుచున్నది.

257 నామము; శివ; "నమోహరిత్యాయచ"

శ. భా. భా:— హరితముఅనగా ఆకుపచ్చనిరంగు. పింగళవర్ణము. వానిలో శివుడు పోషకశక్తిరూపముననుండి జీవులను రక్షించును. కాన హరిత్య నామకుడాయెను.

విష్ణు:—

హరితమనగా సింహము. "మృగాణాంచమృగేంద్రోఽహమ్" అను గీతాసూక్తిచే హరితమైన సింహమునందు విష్ణువిభూతికలదు. కావున విష్ణువు హరిత్యనామకుడాయెను.

బీజాక్షరసంపుటి-

హారిత్యనామమున "హ్+అ+ర్+ఇ+త్+య్+అ" అని ఏడక్షరములుకలవు. శివబీజము, అగ్నిబీజము, వాస్తువాయుబీజములును సకల దేవ విష్ణుబీజములతోఁగూడియున్నవి. దీనినుపాసించువారు శ్రద్ధామేధాయశః ప్రజ్ఞాసంపన్నులై శివ విష్ణుసాయుజ్యములనుబొందఁగలరు. అంతేకాదు. వాయ్వగ్నిశక్తులతోనిండినమారణయంత్రములను సృష్టించి, వానిని సర్వత్ర వ్యాపింపఁజేసినసర్వ సంహారకులును అగ్నివాయుప్రకోపముఁచేఁ గల్గురోగములను నివారించువారలునుగాఁగలరని తెలియుచున్నది.

-: 10. వ. యజుస్సు :-

"నమోలోప్యాయచోలప్యాయచ"

అర్థము:-

లోప్యాయచ = తృణాదికములోపించుకఠిన ప్రదేశమునను న్నట్టియును, ఉలప్యాయచ = రెల్లుమొదలగు తృణములందున్నట్టి శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— భగవంతుడు సమవర్తి సమదర్శియగుటచే తృణాదికములుండని కఠినప్రదేశముననుండును. అటులనే రెల్లుమొదలగు తృణలతలందును ఉండును అందుచే అతనికి నమస్కారము.

258 నామము- శివ:- "నమోలోప్యాయచ"

భ. భా. భా:— పరమశివుడు చేతనాచేతనములందంతటనుండును. మొక్కలు మొలవని నేలఁదు, కఠిన ప్రదేశములందు జాతినేలలందునుగలదు

కఠిన ప్రదేశమునందు, భూమిలో రత్నాలు, లోహములు, అభ్రకాదులు నుండును. వానిలో తేజోరూపమున శివుడుండును. అటువంటిచే లోపములు. వానిలోనుండుటచే శివుడు లోప్యనామకుడాయెను.

విష్ణు — "అదర్శనంలోపః" కానరాకుండుటయేలోపము. సామాన్యనేత్రములకుగానరాని వైకుంఠాదిలోకజాతమునకు లోపము అనిపేరు వానియందు విష్ణువుండును. లోపమనగా కఠిన ప్రదేశమనిచెప్పియుంటినికదా! అదియే మహాభారమును వహింపఁగలనేల. "బలంబలవతాంచాహమ్" అను గీతా సూక్తిచే బలముగలవానిలో బలరూపమున విష్ణువిభూతియుండునని తెలియుచున్నది. బలవంతమైన లోపములోనుండుటచే విష్ణువుకూడ లోప్యనామకుడాయెను.

బీజాక్షరసంపుటి-

లోప్యనామమున "ల్ + ఓ + ప్ + య్ + అ" అని ఐదక్షరములుకలవు అవి పంచభూతములను, పంచేంద్రియములను సూచించును. ఇందుపృథ్వీబీజమైన లకారము ఈశ్వరబీజముతోడను, పర్జన్యబీజము వాయుదేవబీజములతోడనుగూడియున్నది పైనామమును పృథ్వీచక్రమున శివప్రధానముగా ధ్యానించి, జపముచేయువానికి అణిమాద్యష్టశక్తులుఁలభించును. దానిమూలమున శత్రుస్తంభనమును కృత్రిమమేఘవృష్టిని జేయగలరు. పృథివిలోఁగల సకలవస్తుజాతమును వాయుశక్తితోఁగనుగొని పృథివీశ్వరులుఁకాఁగలరు. భూతప్రేతాదులను దొలగించి జీవులనుగాపాడఁగలరు.

259 వ. నామము:- శివ— "నమఉలప్యాయచ"

భ. భా. భా:— "ఉల = సంవరణే" అను ధాతువునకు చుట్టుకొనియుండునది. లత, అనిఅర్థములుకలవు ఉలచే = లతచే, వ = రక్షించువాడై, వానిలో నుండువాడు ఉలప్యుడు. తెల్లుమొదలగు తృణాదులను ఉలపములందురు. వానిలో తేజోరూపమున శివుడుండును. కావున వానిని యజ్ఞయాగాది కర్మలకు ఉపయోగించుచున్నారు. అవి పరమ పవిత్రములు కావుననే వానికి

పవిత్రమని పేరున్నట్లు "పవిత్రంతే వితతం బ్రహ్మణస్పతే" అను శ్రుతివలనఁ దెలియుచున్నది. వానిలోనున్న కారణమున శివునకు ఉలప్య నామము వర్తించును.

విష్ణు-

తృణజ్యోతిర్గతలైన "సంజీవని" మున్నగు వానిని ఉలపములందురు. వానిని గొనివచ్చి హనుమంతుడు రావణయుద్ధమున మూర్ఛితులైన శ్రీరామ లక్ష్మణులను వానరులను బ్రతికించినట్లు శ్రీరామాయణకథవలనఁ దెలియుచున్నది. ఉలపములైన అలతలలో విష్ణువు జీవశక్తిరూపముననుండెను. కావున విష్ణువు ఉలప్యనామకుడాయెను.

బీజాక్షరసంపుటి—

ఉలప్యనామమున "ఉ + ల్ + అ + ప్ + య్ + అ" అని ఆరక్షరములు కలవు. అవి షణ్మండలములను, షట్చక్రములను సూచించును. ఇది వాయు ప్రధాననామము. యోగులకు ముఖ్యము. పృథివీచక్రమున వాయువునునిల్పి, ప్రాణాయామముచేయువారికి పృథివీలోకముననే ముక్తిలభించును. దీని నుపాసించువారు పృథివీగతవస్తుజాలమును గనుగొనఁగలరు. అనేక విధచర్మ రోగములను బోఁగొట్టఁగలరు.

— 11. వ. యజుస్సు —

'నమఊర్వ్యాయచ సూర్మ్యాయచ'

అర్థము:-

ఊర్వ్యాయచ = భూమియందుండువాడును, సూర్మ్యాయచ = చక్కని కెరటములు కలనదులందుండువాడునగు శివునకు, నమః = నమస్కారము,

తాత్పర్యము:-

సా. భా:— మహేశ్వరుడు భూమిపై నానారూపములనుండి జీవులను రక్షించుచున్నాడు. కెరటములతో నిండిన నదులలో నానారూపములనుండి జీవులనుగాపాడుచున్నాడు కాన అతనిని నమస్కరించుచున్నారు.

260 నామము; శివ; "నమఊర్వ్యాయచ"

భ. భా. భా:— మహేశ్వరుని రూపములెనిమిదింటిలో భూమియొకటి. అందుచే శివుడు ఉర్విలోనుండెను, అందు అన్నరూపముననున్నకారణమున శివుడు ఊర్వ్యనామకుడాయెను. అతని సహనశక్తియే భూమికి సంక్రమించెను అందుచే ఊర్వ్యనామకుడై శివుడు నమస్కరింపఁబడుచున్నాడు.

విష్ణు:—

శివునివలె విష్ణువును భూమిలోనుండుటచే భూగర్భుడాయెను. "గర్భః కుక్షిస్థజంతౌచ" అను హలాయుధ నిఘంటుసూక్తిచే గర్భస్థ శిశువునుకూడ గర్భమనియందురు విష్ణువుభూమిలో గర్భుడుగానుండెను. "హిరణ్యగర్భో భూగర్భః" అను విష్ణుసహస్రసూక్తిలో విష్ణునామముగానున్న భూగర్భపదమును ఊర్వ్యనామమును సమానార్థకములే కావున విష్ణువు ఊర్వ్యనామకుడాయెను. ఉర్విలో గంధరూపముననుండుటచే ఊర్వ్యుడైన విష్ణువు నమస్కరింపఁబడుచున్నాడు.

బీజాక్షరసంపుటి:-

ఊర్వ్యనామమున "ఊ+ర్+వ్+య్+అ" అని 5యైదక్షరములు కలవు. అవి పంచభూతములను, పంచకోశములను సూచించును. ఇది అగ్ని ప్రధాననామము. దీని నుపాసించువారు జ్యోతిరూపమును బొందుదురు. పంచభూతగోళములందును. విహరించుశక్తిలభించును. శ్యామల, రక్తపుఁబోటు, జలోదరము శ్విత్రము, వాతరోగము మున్నగువానిని బోఁగొట్టగలరని తెలియుచున్నది.

261 నామము- శివ- "నమస్సూర్మ్యాయచ"

భ. భా భా:— సుషిరమనగా, నళియను సుగంధ ద్రవ్యము. అది చక్కగా నుండుచోటును సూర్మియందురు. "సూర్మింజ్వలన్తీంవాశ్లిష్య" అను వచనముచే సూర్మిని ఆశ్రయించి, శివుడుండును, అని తెలియుచున్నది. కావున శివుడు సూర్మ్యనామకుడాయెను.

విష్ణు:- శోభనములైన కెరటములు కలనదులను సూర్ములందురు ఊర్ములనగా గెరటములు. రసోఽహమప్సుకౌంతేయ" అను సూక్తిచే విష్ణువునదులలో రస రూపముననుండునని తెలియుచున్నది. అందుచే విష్ణువు సూర్మ్యనామకుడాయెనని తెలియుచున్నది.

బీజాక్షరసంపుటి—

సూర్మ్యనామమున "స్+ఊ+ర్+మ్+య్+అ" అని ఆరక్షరములుకలవు. అవి ఆరుఋతువులను, షట్చక్రములను సూచించును. ఇందు శక్తిబీజము సకారము, భూమిబీజమైన ఊకారముతోఁగూడియున్నది. వాని తర్వాత అగ్నిమదనవాయు సకల దేవబీజములుకలవు. ఇదిశక్తిప్రధానబీజము దీనినుపాసించువారు శక్తిచే నేర్పడిన సంసారమును బొగొట్టుకొని ముక్తులగుదురు. దీనిప్రభావముచే ఉపాసకులు వాయ్వగ్నిభేదములనుగనుగొని, వాని సాయమునభూమిలోని సకల వస్తుజాతమునుగనుగొనిబైటఁబెట్టి జీవులకువలయు సకలకామములను జేకూర్చెదరు. శ్యామలాదిరోగములను దొలగింపఁగలరు.

-: 12. వ. యజుస్సు :-

"నమఃపర్ణ్యాయచ పర్ణశద్యాయచ"

అర్థము:-

పర్ణ్యాయచ = ఆకులందున్నట్టియును, పర్ణశద్యాయచ = ఎండుటాకుల మొత్తమందున్నట్టి శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— పరమేశ్వరుడాకులందుండియు జీవులను రక్షించుచున్నాడు. ఆతనికి నమస్కారము.

262 నామము- శివ:- "నమః పర్ణ్యాయచ"

భ. భా. భా.— పర్ణమనగా ఆకు, చెట్టుననుండి దానికిఁ బోషకద్రవ్యమును జేకూర్చియు, జెట్టునకు అవసరమగు జలమును, బొగ్గుపులుసుగాలిని విడుచుచు దానిని రక్షించును "పౄ = పాలనపూరణయో." అను ధాతువునుండి యేర్పడిన పర్ణపదమునకు రక్షించునదియని యర్థము కలదు. మహాశివుడు అశ్వత్థవృక్షమునఁ (సంసారవృక్షమున) గల పర్ణములందు అనగాఁ బర్ణములు ఉపలక్షకములుగాఁ గల త్రిశక్తులందు ఇచ్ఛాక్రియాజ్ఞానశక్తులందుండి జీవులను రక్షించుచున్నాడు కావుననే పర్ణ్యనామకుడాయెను. "త్రిసుపర్ణమయాచితం బ్రాహ్మణాయదద్యాత్" అను శ్రుతిచేఁ దెలియు త్రిసుపర్ణము భగవద్గీతలోఁ జెప్పబడిన అశ్వత్థవృక్షమే దానిపర్ణములందున్నవాడు శివుడే. అతడే త్రిసుపర్ణములందును అనగాఁ బర్ణములచే సూచింపఁబడు ముల్లోకములందును గలడు. అందుచేతనే ఆపర్ణములు సుపర్ణములాయెను. అంతేకాదు పర్ణములందు బాణములకు వడిగాఁ బోవుటకుఁ గట్టఁబడు ఱెక్కలందు మహాశివుడుండి శత్రు సంహారక్రియలో యోధులకుఁ దోడ్పడును. అందుచే అతడు పర్ణ్యనామకుడాయెను.

విష్ణు:- "పౄ" ధాతువునుండి యేర్పడిన పర్ణపదమునకు రక్షించుట, పోషించుట అని యర్థములు కలవు. మహావిష్ణువు తనవాహనమైన గరుత్మంతుని యొక్క ఱెక్కలందుండి గమనవేగమును జేకూర్చును అటులనే యోధుల బాణపు ఱెక్కలందుండి గమనవేగమును జేకూర్చి, యోధులకు యుద్ధమున దోడ్పడును. గమనవేగముచేకూర్చు శక్తి పర్ణములకుండుటచేతనే విమానములకును ఱెక్కలను సంధించినారు. త్రిపురసంహార సమయమున విష్ణువు శివుని ధనుస్సున బాణముగానుండి, దానికిఁ గల ఱెక్కలందు శక్తిరూపముననుండి, త్రిపురాసురుని సంహరించి, లోకములను గాపాడెను. పర్ణమున = పాలనక్రియలో నుండెనన్నమాట. పర్ణము అనగా బలాశవృక్షము. విష్ణువు అందుండి, యజ్ఞమునకవసరమగు సమిధలు తానై యజ్ఞమును గాపాడెను. కావున విష్ణువు పర్ణ్యనామకుడాయెననుట సమంజసమే.

బీజాక్షరసంపుటి:-

పర్ణ్యపదమున "ప్+అ+ర్+ణ్+య్+అ" అని ఆరక్షరములు కలవు. అవి షడృతువులను, షట్చ్రక్రములను సూచించును. వాయ్వగ్ని ప్రధానమైన ఈనామము నుపాసించువారు యోగులై అగ్నిస్వరూపిణియైన దుర్గాదేవినారాధించి, ముక్తులగుదురు. పైనామమును నంధికేశ్వరప్రధానముగా నుపాసించువారు. నాయకులై వాయవ్యాగ్నేయాస్త్రములను గనుగొని శత్రుసంహారకులుకాఁగలరు. కృత్రిమమేఘములను సృష్టించి, వృష్టికరులై సస్యపోషణముగావించి, అన్నదాతలగుదురు. రక్తవాతప్రకోపజనితరోగ పరిహారకులునుగాఁగలరని తెలియుచున్నది.

263 నామము:- శివ:- "నమః పర్ణశద్యాయచ"

భ ఖా. భా:— శుష్కపర్ణములరాశిని (ఎండుటాకులప్రోవును) పర్ణశదము అందురు పరమశివుడు అందుండి సర్వజనులకును సులభుడగుచున్నాడు. "శద్". ధాతువునుండియేర్పడిన శదపదమునకు శాకము, ఫలము అని యర్థములుకలవు. పర్ణ = రక్షించునట్టి, శదములందు = శాకఫలములందు అతడుండి, జీవులకాహారమునొసంగి, రక్షించువాడు కావున, మహాశివునకు పర్ణశద్యుడను నామము ఏర్పడెను.

విష్ణు:-

పాలించుట, పూరించుట అను నర్థములుగల "పౄ" ధాతువునుండి ఏర్పడిన పర్ణపదమునకు ఇచటఁ బూరించుటయనియర్థము. విష్ణువు తన రూపములైన సూర్యాగ్నివాయువులను బ్రహ్మాండమున వ్యాపింపఁజేసి, దుష్టులను నాశనముచేసి శిష్టులను రక్షించుచున్నాడు. శదధాతువునకు నాశనము చేయుటయనునర్థముకూడకలదు సూర్యాగ్నివాయువులు శదులైదుష్టనాశకులైయున్నకారణమున, వానిరూపముననున్న విష్ణువు పర్ణశద్యనామకుడాయెను.

బీజాక్షరసంపుటి:-

పర్ణశద్యనామమున "ప్+అ+ర్+ణ్+అ+శ్+అ+ద్+య్+ఆ" అని పదక్షరములుకలవు. ఇవి పదిదిక్కులను, దశేంద్రియములను సూచించును. ఇందు లక్ష్మీదుర్గాబీజములైన శకారదకారములు ప్రధానములు. శాక్తేయులకిదిముఖ్యనామము. దీనినుపాసించువారు అమితతేజస్సునుబొంది దుర్గమములైన వైకుంఠాదులను జేరఁగలరు. లక్ష్మీదుర్గాబీజములతోఁగూడి యుండుటచే దీనినుపాసించువారు సకాలవర్షములు కురిపించియు జీర్ణశక్తిని ప్రాణశక్తినొసంగియు, నాయకత్వమునుజేకూర్చియు జీవులను రక్షింపఁగలరు. పలువిధములైన చర్మరోగములను బాపఁగలరు.

-: 13. వ. యజుస్సు :-

"నమోపగురమాణాయచాభిఘ్నతేచ"

అర్థము:-

అపగురమాణాయ = సిద్ధముచేయఁబడిన ఆయుధములుకలవాడును, అభిఘ్నతేచ = సంపూర్ణముగా సంహరించునట్టి శివునకు నమః = నమస్కారము

తాత్పర్యము:-

సా. భా:— మహాదేవుడు రాక్షససంహారమునకొనర్చుయుద్ధమునకు ఆయుధములను సిద్ధముచేసెను. రాక్షసులను సంపూర్ణముగా సంహరించెను అట్టి దేవునకు నమస్కారము.

264 నామము:- శివ— "నమోపగురమాణాయ"

భ. భా. భా:— "గుర్"ధాతువునకు గాయపఱచుట, చంపుటయనునర్థములు కలవు దానినుండి గురమాణపదమేర్పడెను. అపపూర్వకమైన గురమాణ

పదమునకు ("అప+గురమాణ") నిగ్రహించువాడు, సంహరించువాడని యర్థములుకలవు. మహాదేవుడు దురాత్ములను నిగ్రహించి, సంహరించుటకుఁ బ్రవర్తించినవిధము ఇందు చెప్పఁబడెను. త్రిపురాసురుడు మున్నగు రక్కసులు లోకపీడకులు కాన నిగ్రహింపఁదగినవారు వారిని సంహరించుటకు ఆతడు ఆయుధములను సిద్ధముచేసెను. అందుచే ఉద్యతాయుధుడాయెను. కావున శివునకు అపగురమాణనామమువేర్పడెను.

విష్ణుః

అపగురమాణపదమునకు అంతటకునుబోవువాడనియు నర్థముకలదు. అనగా సర్వవ్యాపకుడనియర్థము విష్ణువు సర్వవ్యాపకుడు కావున అపగురమాణనామకుడాయెను. విష్ణువు, అపగురమాణుడు అను రెండుపదములును సమానార్థకములే.

బీజాక్షరసంపుటి—

అపగురమాణపదమున "అ+ప్+అ+గ్+ఉ+ర్+అ+మ్+అ+ణ్+అ" అని పదునొకండక్షరములుకలవు. అవి ఏకాదశరుద్రులను శరీరమందలి ఏకాదశద్వారములను సూచించును. ఇందు సర్వదేవపర్ణన్య గణపతి వాయ్వగ్నినందికేశ్వరబీజములుకలవు. ఇవి పరాశక్తిమదనబీజములతోఁగూడియున్నవి. ఇది పరాశక్తిప్రధానమగునామము. దీనినుపాసించు వారికిఁ బరాశక్తిదుర్వాంఛలను దొలగించి, మోక్షేచ్ఛగల్గించి తరింపఁజేయును అంతేకాదు. ఈనామము నుపాసించుటచే, నీలిమ, రక్తపుఁబోటు, శ్విత్రము, శ్యామల, కామెల మున్నగురోగములుతొలంగును. నిర్విఘ్నముగా సకలకార్యములనెఱవేర్చి, రాజాదరణమున సహానాయకులుకాఁగలరని తెలియుచున్నది.

265 వ. నామము:- శివ— "నమోఽభిఘ్నతే చ"

భ. భా. భా:— మహాదేవుడు [హంతవ్యులైన రాక్షసాదులకెదురుగానిల్చి, వారిని సంహరింపఁగలడు. జీవచైతన్యమై జీవులకుఁగల లౌకిక శత్రువులను సైతము ఎదిరించి సంహరించును. అందుచే శివుడు "అభిఘ్నన్" అను నామముకలవాడాయెను.

విష్ణు:

విష్ణువు నృసింహాద్యవతారములందు మహోగ్రుడై అభిముఖముగా నున్నహిరణ్యకశిపాద్యులను సంహరించెను. అందుచే ఆతడును అభిఘ్నన్ నామకుడాయెను.

బీజాక్షరసంపుటి—

"అభిఘ్నన్" అను నామమున [“అ+భ్+ఇ+ఘ్+న్+అ+న్” అని యేడక్షరములుకలవు. అవి సప్తవాయుమండలములను] మనోబుద్ధులతోడి పంచేంద్రియములను సూచించును. ఇది శివవిష్ణుప్రధాననామము. దీనినుపాసించువారు భార్గవబీజప్రభావముచే మహా విద్యావంతులు, మహావిజ్ఞానులును అగుదురు. జలాకాశపృథువులందుఁగల సకల శత్రువులను సంహరింపఁగల నానావిధాయుధ నిర్మాతలుకాఁగలరనియు, అందులకుఁదగిన యంత్రములను నిర్మింపఁగలరనియును దెలియుచున్నది.

— 14. వ. యజుస్సు —

"నమఆఖిదతేచప్రఖిదతేచ"

అర్థము;-

ఆఖిదతేచ = ఇంచుకంతదుఃఖము కల్గించునట్టియును, ప్రఖిదతేచ = అత్యంతము దుఃఖముకల్గించునట్టి, శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము;-

సా. భా:— మహాదేవుడు దుష్కర్మఫలము తక్కువైనచో జీవులకు ఇంచుకంతదుఃఖముకల్గించును. దుష్కర్మఫలము మిక్కుటమగుచో జీవులకు మిక్కిలిగా దుఃఖముకల్గించును.

266 నామము- శివః+విష్ణు- "నమఆఖిదతేచ"

భ. భా. భా:— శివుడు సంహారకర్త. విష్ణువు శిక్షించి, రక్షించువాడు. ఇరువురును ప్రాణులుచేయుదుష్కర్మతక్కువైనచో దక్కువగా శిక్షించి, దుఃఖముకల్గింతురు. శివుడు పార్వతీసహితుడై కైలాసముననుండగా వానిని గదిలించి, పరాభవింప దలంచిన రావణాసురుని కాలిబొటనవ్రేలితో బర్వతమునదంచి, దానిక్రిందనున్నవానిని, కికిలాడించి, నమకనామములతో స్తోత్రముచేయగా విడిచిపెట్టినాడు. దక్షుడుగర్వముతో శివునాహ్వానింపక యజ్ఞముచేయుచు ఆసమయమునవచ్చినకూతు సతీదేవిని అవమానించిచేయోగాగ్నిలో బడిఆమె మరణింపగా వీరభద్రరూపుడై శివుడువచ్చి, ఆదక్షుని శిరంబుఖండించెను. అపుడు దక్షుడు చమకమంత్రములతో స్తోత్రముచేయగా శివుడు మేకతలనతికి వానిని రక్షించెను. విష్ణువు ఇంచుకంతగావించిన దుష్కర్మఫలమనుభవింపజేయుటకై సుగ్రీవుని వాలిచే జితుకమొత్తించి కాపాడెను. కర్మఫలానుకూలముగా గష్టములనుభవింపజేసి, విష్ణువు, కుచేలుని, గజేంద్రునిగాపాడెను. అందుచే శివకేశవులిరువురికిని "ఆఖిదన్" అను నామము వర్తించును.

బీజాక్షరసంపుటి:-

"అఖిదన్" అను నామమున "అ+ఖ్+ఖ్+ఇ+ద్+అ+న్" అని యేడక్షరములుకలవు. అవి సప్తమేఘమండలములను, సప్తధాతువులను సూచించును. ఇందు బరాశక్తి గంగాదుర్గాబీజములు, సావిత్రీబీజమును విష్ణుదేవబీజములతో గూడియున్నవి. ఇది శక్తిప్రధానమైన నామము. దీనినుపాసించువారు పాపములనుబోగొట్టుకొని, దేవీకృపచే విముక్తులగుదురు. శక్తిప్రభావము సర్వవ్యాపకము. బాహ్యాభ్యన్తర శత్రునాశకము. దీనినుపాసించువారు జలప్రయాణయంత్రములను, జలము లందలి వస్తువులను బైటపెట్టుయంత్రములను, శత్రుసంహారకయంత్రములను చర్మరోగపరిహారకౌషధములను సృష్టింపగలవారలగుదురని తెలియుచున్నది.

267 నామము:- శివ+విష్ణు:- "నమః ప్రఖిదతే చ"

భ. భా. భా:— శివకేశవులు ఇరువురును మహాపాతకకర్తలైన రాక్షసులను త్రిపురాసురరావణాసుర శిశుపాలాదులను అపరాధానుకూలముగా శిక్షించి సంహరించిరి. అందుచే వారిరువురకును "ప్రఖిదన్" అను నామముసార్థకమే యగును.

బీజాక్షరసంపుటి:-

"ప్రఖిదన్" అను నామమున "ప్+ర్+అ+ఖ్+ఖ్+ఇ+ద్+అ+న్" అని తొమ్మిదక్షరములుకలవు. అవి నవావరణలను, నవద్వారములను సూచించును. ఇది దుర్గాప్రధానమైననామము. దీనినుపాసించువారు దేవీసాక్షాత్కారమంది ముక్తులగుదురు. జలాగ్నిశక్తులసహాయమున కృత్రిమ మేఘనిర్మాతలును, జలప్రేషక అగ్నిప్రేషకయంత్రనిర్మాతలును అగుదురు. జలాగ్నిప్రకోపజనితరోగపరిహారకులు అగుదురని తెలియుచున్నది.

ఖ. ఖా. భాష్యవిశేషాలు;

ఈమంత్రముయొక్క పురశ్చరణాదికమునుగూర్చి చెప్పుచున్నాము వినుడు. కృచ్ఛ్రద్వయమాచరించి, తొలుత అయిదువందలజపముచేయవలెను అట్లైనచో పురశ్చరణచేయువాడగును. మొదట రాజులకుఁ జెందిన నియమము చెప్పఁబడుచున్నది. సామ్రాజ్యమును గోరురాజు ఈచెప్పఁబోవుపనినిజేయ వలెను. వసన్తకాలమున, దేశమునందో, పర్వతమునందో, కాంతారమునందో కలశివాలయమునదేవసన్నిధిని బ్రాహ్మణులచేఁ గార్యసిద్ధికనుకూలమగు మంత్రములను బఠింపఁజేసి, దేవునిబూజించి, మిగిలిన కార్యమారంభింప వలెను. ఆర్ద్రానక్షత్రమునందో, అమావాస్యనాడో ఆరంభింపవలెను. మంత్ర సిద్ధులగు బ్రాహ్మణులను గ్రహింపవలెను. లేదా ఆచార్యుడు తక్షణమే కర్మ సిద్ధిని ఆచరింపవలెను. కల్పవేత్తయైన ఆచార్యుడే సిద్ధుడుగాఁ జెప్పఁబడును. అతడు పలికినట్లే సిద్ధిచేకూరును. అప్పుడే సద్యస్సిద్ధియని చెప్పఁబడుచున్నది. సంశుద్ధుడును, ఆచార్యుడునగు అబ్రాహ్మణునుండి, మంత్రమును స్వీకరించి 15 దినములు నిరంతరము జపించవలెను. పిమ్మటను గర్మయోగ్యులగుదురు. ఇట్లు సిద్ధులైనవారిచేతనే హోమముచేయఁదగినదైయున్నది. ప్రతినమస్కా రమునందును ఆహుతిచేయవలెను తిలలు వ్రీహులు యవలున్నగువానిని నేతితోఁగలిపి, హోమముచేయవలెను. సూర్యోదయము మొదలు సూర్యాస్త మయమువరకును హోమకాలమే. ఎల్లపుడు పదునొకండు గురువిప్రులచే 30 దినములు ఇట్లు చేయింపవలెను. హోమముచేయువారికిఁ బాత్రలతోఁబాటు ఉత్తరీయాదులు ఒసంగవలెను. ఆచార్యునకును గుండలాదుల నొసంగవలెను. హోమాగ్నిపైఁ బాత్రతో ధారగానేయి పోయ

వలెను. ఇట్లు కార్యము సమాప్తమైన పిమ్మట దేవునుద్దేశించి, ప్రతిదినము ఎనిమివేలమందికి, భోజనముపెట్టవలెను. బ్రాహ్మణులకు సంపూర్ణముగా భోజనముపెట్టినపిమ్మట ప్రతిదినముతాను భుజింపవలెను. తుదిదినమున నిత్యముకంటె రెండురెట్లుభోజనముపెట్టవలెను. ఆచార్యునకు సారవంతమైన భూమి దానముచేయవలెను. ఋత్విజులకు నూరు బంగారునాణెములనుగాని, దానిలో సగముకాని దక్షిణగానొసంగవలెను దానికి రెండురెట్లు దక్షిణ ఆచార్యునకు ఒసంగవలెను. శివపూజలోగంధము, కర్పూరము ఒసంగవలెను తామరపూలను అర్పించవలెను. కర్పూరముతోఁబాటు గుగ్గిలపుధూపము సమర్పించవలెను. ఆవునేతితో దీపముపెట్టవలెను. నైవేద్యముగూర్చిచెప్పితిమికదా! ఇట్లు ప్రతిసంవత్సరము రుద్రారాధనముచేయవలెను. ఇట్లు ఆరాధించినచో రాజుచక్రవర్తిఅగును. సాగర మధ్యస్థులైన రాజులైనను రుద్రరూపులచే జయింపఁబడుదురు ఇహలోకమున సకల భోగములననుభవించిన పిమ్మట రుద్రరూపులచే అనుగ్రహింపఁబడినవాడై ఆచక్రవర్తి శివపురముచేరును. అచట రుద్రరూపుడై పదివేలకల్పములు శివపురమున భోగములనుభవించిన పిమ్మట శివభక్తుడైన ఆరాజు సప్తద్వీపాధిపతియగును. అట్టివానిచేతులందు శివధనుస్సు గుఱుతులుండును. అట్టిగుఱుతులచే ఆరాజు రుద్రారాధన కారియని తెలియును. ఏరాజుచేతులలో ఈగుఱుతులుండునోవాడును రుద్రారాధకుడేయని తెలియును. ఇట్లు 11 గురు విప్రులచేఁ బ్రతిసంవత్సరము రుద్రపూజ చేయింపవలెను.

ధాన్యము-

శ్లో॥ పినాకపాణింభూతేశముద్యత్సూర్యాయుతద్యుతిం।
భూషితంభుజగైర్ధ్యాయేత్ కంఠేకాలంకపర్దినమ్॥

తాత్పర్యము:-

పినాకమను ధనుస్సుచేతఁగలవాడును, సకల భూతములకుఁ బ్రభువును, పదివేలమంది ఉదయకాలపు సూర్యులకాంతికలవాడును, సర్పములచే అలంకరింపఁబడినవాడును, కంఠమందు నలుపుకలవాడును. జటాజూటము గల శివునిధ్యానింపవలెను.

-: 15. వ. యజుస్సు :-

"నమోవః కిరికేభ్యోదేవానాగ్ంహృదయేభ్యః"

అర్థము:-

కిరికేభ్యః = భక్తులకుధనములను జిమ్మెడి ఉదారుఁగు రుద్రావతారులకును, దేవానాంహృదయేభ్యః = సర్వదేవప్రియుడగుటచే సర్వ దేవతల హృదయమగువారికి, నమః = నమస్కారము.

తాత్పర్యము-

సా. భా:— మహాదేవుడు భక్తులకు రుద్రావతారులైన ఉదారులరూపమున వచ్చి, ధనములనొసంగును. సర్వదేవప్రియుడైన ఆతడు దేవతలహృదయములందుఁజేరి, ఆయారూపముల సేవింపఁబడి, పెక్కుకోర్కెలను దీర్చును. కాన ఆతనికి నమస్కారము.

268 నామము:- శివ— "నమోవః కిరికేభ్యః"

భ. భా. భా.:— ఈనామముతో ఆరంభమైన ఈయనువాకము చివరవరకును ఒకటేమంత్రము భగవంతుడైన ఈశ్వరుడే ఈమంత్రమునకు ఋషియు

దేవతయునైయున్నాడు. ఈమంత్రము షట్పదియైన జగతీఛందస్సునకుఁ జెందియున్నది. ఈమంత్రము ప్రత్యక్షకృతము అనునది యుష్మచ్ఛబ్ద ప్రయోగమువలనఁ దెలియుచున్నది. గుణములు, క్రియలు, జాతి, ఆకారము అనునవి దేవతావిగ్రహమూర్తులకు ఆధారము అయియున్నవి ఇట్టి ఆధారము యొక్క భేదముచే, దేవుని విగ్రహములలో భేదములు ఏర్పడుచున్నవి. ఇట్లు ఈశివుని విగ్రహములు భిన్నములైయున్నవి. వీటికన్నిటికిని ప్రత్యేకముగాఁ బ్రతినమస్కారములు సమర్పింపఁబడుచున్నవి. ఇపుడు మాత్రము సమూహరూపమున నమస్కరింపఁ బడుచున్నవి. మహాదేవుని నమస్కరించి, ఇపుడు వానియనుచరులను నమస్కరించుచున్నారనికొందఱుచెప్పుచున్నారు. మహాదేవునియొక్క ప్రసిద్ధవేషాకారములు నమస్కరింపఁబడుచున్నవి. జగంబులను శాసించువారి స్వభావముఅజ్ఞాతముగాఉండును. వారువాలగుప్తముగానుందురు వారిపుడు నమస్కరింపఁబడుచున్నారని ఇతరులు చెప్పుచున్నారు. ఇంతవరకు జెప్పిన ఈపక్షము సాధిష్ఠమైయున్నది. అజ్ఞాతవిషయుడొకడు ముందుగానే ఉపపన్నతరుడగుచున్నాడు. "దేవానాంహృదయేభ్యః" అను వచనముచే దేవతలహృదయప్రవర్తనమునే మేము తెలిసికొనుచున్నాము నమస్కార పదముండుటచే ఇది అందఱికినీ విశేషణమని తెలియుచున్నది. కిరికాది స్వభావులైన దేవాదులే వీరినెఱుగఁగలరు; కాని మనుష్యాదులు ఎఱుగఁజాలరు ఆమీకును నమస్కారమగుగాక. మీరు దయచూపుడు; ఆయుధములను ఉపసంహరింపుడు; అని దీనియర్థము. ఇంతవరకును ఇది ఉపోద్ఘాతము

"నమోవఃకిరికేభ్యః"

లోకులనుగూర్చియులోకములనుగూర్చియు స్వేచ్ఛగా హింసాకర్మలను వెదజల్లువారిని కిరులు అందురు. స్వేచ్ఛగాలోకములను నాశనముచేయువారినిగూడ కిరులందురు. కిరులే కిరికులు. కిరుకులైనమీరు దేవతల హృదయములంతే మెలఁగుదురు. అందుచే కిరికులగుమీరు దేవులే అగుదురు. దేవతతే

మిమ్ములను ఎఱుగుదురు. మీరులోకులను అనుగ్రహించుటకై దేవతల హృదయములందు ఆవిర్భవింతురు. లోకులు తమకోర్కెలు సిద్ధించుటకు అఁకిరికులను సదాస్మరింతురు. దేవతావిశేషములు వారియందుండును గాన వారు దేవహృదయులైరి. దేవులైనకిరికులు అగ్నివాయుసూర్యరూపులును, వారివిభూతులునై పృథివియందును, అంతరిక్షమునందును, దివియందునుందురు. దేవవిభూతులైనవారు పదునొకండుగురు. "యేదేవాసోదివ్యేకదశస్థః" అను శ్రుతిలో దేవులు పదునొకండుగురై దివియందుగలరని చెప్పఁబడెను. ఈసంఖ్యననుసరించి ముల్లోకములందుఁగలవారు ముప్పది ముగ్గురని తెలియుచున్నది. ప్రధానదేవునితోఁబాటు ఆతని విభూతులు నూర్వురుదేవులు. ప్రధానులైన అగ్ని వాయు, సూర్యులగుణములుమూడు. వానినిరెట్టింపుచేసికలిపినచో తొంబదితొమ్మండ్రుగురు (99) అగుచున్నారు. నూర్వురిలెక్కలో ఒకడు ప్రధానుడు. ఆతడే మహాదేవుడు. ఇట్లు పృథివిలోఁ బదునొకండుగురు ప్రధానభూతులు. వారిని అగ్నివాయుసూర్యులతోరెట్టింపుచేసిన ముప్పదిముగ్గురు అగుదురు. వారే ముప్పదిమూడుగణములు అగుచున్నారు. వారే గణాధిపులు "త్రయోదేవాఏకాదశత్రయస్త్రింశాస్సురాధసః" అను శ్రుతిలో నీవిషయముకలదు. ఈదేవతలే అగ్నియొక్కవిభూతులు. విశేషులైన వాయుసూర్యులు ఇద్దఱును అగ్నిననుసరించిచేయువారు. ఇట్లు వీరందఱునుగలిసి ఒకవేయి నూటముప్పది తొమ్మండుగురు అగుదురు (1139) అంతరిక్షమందున్నవాయు విభూతులైన దేవులును అందఱేయని తెలిసికొనవలెను. విశేషులైన అగ్నిసూర్యులు ఇరువురును సూర్యుననుసరించిచేయువారు. ఇట్లు పైనఁబేర్కొన్నవారందఱును గలిసి మూడువేలమూడువందల ముప్పదితొమ్మండుగురు (3339) దేవతలు అగుచున్నారు "త్రీణిశతానిత్రిసహస్రాణ్యగ్నింత్రింశచ్చ దేవానవచాసపర్యన్" అను శ్రుతివలన నీవిషయము తెలియుచున్నది. వీరందఱును నానావేషాధికారములుకలవారై, ఇష్టాపూర్తభాగధేయులై మహాభూతముయొక్క విస్ఫు

లింగములగుచున్నారు. ఒక బ్రాహ్మణమునఁ గలప్రక్రియననుసరించి, ఈవిధమైన వారందఱును బ్రహ్మాండపిండాండములందుండి అనన్తులగుచున్నారు. ఇట్లు ఈవిషయమును వివరించిన అతిప్రసంగమగును.

విష్ణు:

విష్ణువుకిరియై (వరహమై) భూమిని జాపవలెఁ జుట్టిన హిరణ్యాక్షుని సంహరించెను. అటులనే లోకములనుబీడించువారిని సంహరించుటకు విష్ణువు తనశక్తులను దేవతలందుఁ బ్రవేశపెట్టెను. వారిచేదుష్టులను సంహరింపఁ జేసెను. కిరులే కిరుకులు. కాన దేవహృదయులైన కిరుకులును విష్ణువవలెఁ గిరికనామకులు అగుదురు. అందుచే విష్ణువుకూడ దేవహృదయుడగుటచేఁ గిరికనామకుడాయెను.

బీజాక్షరసంపుటి:-

"కిరిక"నామమున "క్+ఇ+ర్+ఇ+క్+అ" అని ఆరక్షరములు కలవు. అవి షడృతువులను, షట్చక్రములను సూచించును. పైనామమునుపాసించువారు అగ్నిస్వరూపులై ముక్తులగుదురు. అగ్నిభేదములను వానిశక్తులను బైటపెట్టి కృత్రిమమేఘములద్వారా సకలకాలములందును వర్షము కురిపించి, పంటలు పండించి, జీవులను రక్షింపఁగలవారలును, రక్తపుఁబోటు, కామెర్లమున్నగురోగములనుబోగొట్టుఁగలవారలును అగుదురని తెలియుచున్నది

-: 16. వ. యజుస్సు :-

"నమో విక్షీణకేభ్యః"

అర్థము:-

విక్షీణకేభ్యః = క్షీణించువానికంటె విపరీతములై ఎన్నటికిని నశింపని శివశక్తులకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— జీవశక్తులునశించును. జీవులనుద్ధరించుశివశక్తులుమాత్రముఎప్పుడును నశింపవు. కావున వానికి నమస్కారము.

269 నామము:- శివ— "నమోవిక్షీణకేభ్యః"

భ. భా. భా:— పరమేశ్వరుడు తనశక్తులను, నానాదేవతలందును బలవంతు లందును బ్రవేశపెట్టి, భక్తులుకానివారిని విచిత్రముగాహింసించును. వారిని హింసించిశిక్షించుటకే వ్యాధులను, చోరులను నరకము మున్నగువానిని వీర్ప అచెను. కావున శివశక్తులు విక్షీణకములాయెను. వ్యాధిచోరాదులలోఁగల శివ శక్తులువివిధముగా క్షీణించును. కాన విక్షీణకములాయెను అందుచే విక్షీణక నామము శివునకు సార్ధకము.

విష్ణు-

"ఉద్భవఃక్షోభణోదేవః" అను విష్ణుసహస్రసూక్తిలో క్షోభణనామము విష్ణుపరముగాఁగలదు. "ప్రకృతిపురుషంచైవ ప్రవిశ్యాత్మేచ్ఛయాహరిః। క్షోభయామాస" అను విష్ణుపురాణసూక్తిచే సృష్టిసమయమున విష్ణువు ప్రకృతి లోను బురుషునియందును బ్రవేశించి, క్షోభపఱచును; అని కలదు. అందుచే విష్ణువు క్షోభణుడాయెను. పైక్షోభణపదమును హింసార్ధకమైన విక్షీణక నామమును సమానార్ధకములు. కావున విక్షీణకనామము విష్ణువునకుఁ జెల్లు నని తెలియుచున్నది.

బీజాక్షరసంపుటి:-

విక్షీణకనామమున "వ్+ఇ+క్+ష్+ఈ+ణ్+అ+క్+అ" అని తొమ్మిదక్షరములుకలవు. అవి నవదుర్గలను, శరీరమందలి నవద్వారము లను సూచించును. ఇందుద్వాదశాత్మబీజము (సూర్యబీజము) ప్రధానము. దీనినుపాసించువారు సౌరలోకముచేరుదురు. ఆరోగ్యవంతులు తేజోరూపు లునుకాఁగలరు. విష్ణుబీజమాయాశక్తిబీజప్రభావముచే దీనినుపాసించువారు జలమండలమున, సూర్యమండలమునఁగల వస్తువులను బరిశోధించువారు, జలాగ్నిమండలయాన నిపుణులునై జలోదరమును, శ్వాసల, కామెల అను

వానిని, రక్తదోషరోగములను నిర్మూలింపఁగలవారలగుదురు. నందికేశ్వర ప్రజాపతిబీజములున్నకారణమున దీనిని ఉపాసించువారు మహానాయకులును గాఁగలరని తెలియుచున్నది.

-: 17. వ. యజుస్సు :-

"నమోవిచిన్వత్కేభ్యః"

అర్థము:-

విచిన్వత్కేభ్యః = అపేక్షించు అర్థమును సంపాదించియొసంగు శివులకు, నమః = నమస్కారము.

తాత్పర్యము-

సా. భా:— ఐశ్వర్యకాములు పరమేశ్వరుని పూజింతురు. ఐశ్వర్యము పొందుదురు. పరమేశ్వరుడు తన భక్తులకు వారపేక్షించిన అర్థజాతముసంపాదించి యొసంగును. కావునవారు శివుని నమస్కరింతురు.

270 నామము- శివః- "నమోవిచిన్వత్కేభ్యః"

భ. భా. భా:— పరమేశ్వరుడు సుకృతము చేసినవారెవరు? అని పరిశోధించి సుకృతులనురక్షించును. కాన, విచిన్వత్క నామము శివునకు సార్థకము.

విష్ణుః—

విష్ణువు తనపాలనలోఁగల జీవులను చక్కఁగా పరీక్షించును. సజ్జనులైనవారిని, విభీషణ సుగ్రీవాదులనువలె వృద్ధిచేయును. దుష్టులను రావణాది రాక్షసులనువలె సంహరించి తగ్గించును. కావున విష్ణువునకును విచిన్వత్క నామము సార్థకమగును.

బీజాక్షరసంపుటి:-

విచిన్వత్కనామమున "వ్ + ఇ + చ్ + ఇ + న్ + వ్ + అ + త్ + క్ + అ" అని పదక్షరములుకలవు అవి దశదిక్కులను, పశేంద్రియములను, సూచించును. ఇందు రెండు విషబీజములు, రెండువరుణబీజములును సావిత్రీ వాస్తుప్రజాపతి దేవబీజములతోఁగూడియున్నవి. ఇందు శివకేశవబీజములు కలవు. కావున ఇది అద్వైతులకుఁ బ్రధానోపాస్యనామము. దీనినుపాసించువారు ముక్తులగుదురు. అంతేకాదు. రక్షకసంహారకయంత్రనిర్మాతలై, సముద్రమందలి వస్తువులను బరిశీలించి, ప్రజలకుఁదెచ్చియిచ్చి రక్షింపఁగలరు. సముద్రములో సంచరింపఁగలమారణాయుధములను జలాంతర్గాములు మున్నగు వానిని సృష్టించి, శత్రువులను సంహరించియుఁ బ్రజ:ను రక్షింపఁగలరని తెలియుచున్నది. అంతేకాదు శ్యామల, కామెల, నీలిమ, శ్విత్రము, మున్నగు రోగములను రక్తము నీరుగామారు రోగమును జలోదరాదులను దొలగింపఁగలరనితెలియుచున్నది.

— 18. వ. యజుస్సు —

"నమఆనిర్హతేభ్యః"

అర్థము:-

ఆ = సంపూర్ణముగా, ని = నిశ్శేషముగా, హతేభ్యః = జీవులపాపములను, అచేతనములందలిదోషములను, లోపములను దొలగించు, శివులకు, నమః = నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— మహాదేవుడుచేతనాచేతనములందు సమదృష్టిచూపి, సకలమును రక్షించును. ప్రాణులలోఁగలలోపములేపాపములు. వానిని శివుడు సంపూర్ణముగా నిశ్శేషముగా దొలగించి, రక్షించును. అట్లేప్రాణములేని వస్తువులందలి లోపములను దొలగించి, నిర్దుష్టములైన వస్తువులను లోకులకొసంగి రక్షించును. కాన శివుడు ఆనిర్హతనామకుడాయెను. వాని శక్తులు అనిర్హతములాయెను. అందుచే శివులను అందఱును నమస్కరింతురు.

271 వ. నామము:- శివ—

భ. భా. భా:— హననము (లేక) హతముఅనగా హింసఅనియర్థము. ఇట "ఆ + నిర్ + హతేభ్యః" అని పదవిభాగము. ఆకారము, మర్యాదనుదెల్పును

నిర్ అనునదినిశ్చయమునుదెల్పును. మర్యాదగానిశ్చితమైచేయఁబడినది అనిర్హతము. అదికలవారు అనిర్హతులు. పాపులను భగవంతుడు మర్యాదతో, నిశ్చయముతోసంహరించును కాన అనిర్హతుడగును. ఆతడు పాపులను సైతము అన్యాయముగా సంహరింపడు. అపరాధముకలవారిని ఉపేక్షింపడు: అని దీనివలనఁ దెలియుచున్నది. మర్యాదనుండి నిర్గమించినవారిని, (హద్దు మీరినవారిని) అమర్యాదగాఁ బ్రవర్తించినవారిని, నహుషుడు రావణుడు మున్నగువారిని మహారుద్రుడు శిక్షించును; సంహరించును. కాన అనిర్హత నామకుడాయెనని తెలియుచున్నది. అట్టివారినిశిక్షింపకున్నచో అప్పాపాత్ములను మిగిలిన వారితోఁబూజించుట, కొనియాడుట జరుగును. అందుచే వారిని మిగిలిన దేవతలనుండి శివుడు వేరుచేసి, సంహరించును.

"మాత్వారుద్రచుక్రుధా, మానమోభి,ర్మాదుష్టుతీ, వృషభమాసహూతీ" అను మంత్రమున "రుద్రుడా! దుష్టులతోనున్నమాత్రాన మమ్ములను ఆగ్రహింపకుము;" అని చెప్పఁబడెను "స్వాయామేవదిశిరుద్రంనిరవదయతే" అను బ్రాహ్మణవచనమునఁ బైవిషయమే చెప్పఁబడెను.

విష్ణు:- శివునివలె విష్ణువుకూడ పాపులను దైత్యదానవరాక్షసులను శిక్షించెను సంహరించెను. "చంద్రమామనసోజాతః" మున్నగు శ్రుతులను బరిశీలించినచో, విష్ణువునంశ చంద్రాదిదేవతలలోఁ గలదనియును, తాను స్వయముగా దుర్మార్గులను సంహరించుటయేకాక, తనయంశగలవారిచే సైతము సంహరింపజేసెను. కావున విష్ణువునకును అనిర్హతనామము సార్థకమగును.

బీజాక్షరసంపుటి:-

అనిర్హతనామమున "అ+న్+ఇ+ర్+హ్+అ+త్+అ" అని ఎనిమిదక్షరములు కలవు ఇవి అష్టదిక్కులను, అష్టాంగములను సూచించును ఇందుఁ బరాశక్తి; సావిత్రీబీజములతోఁబాటు శివకేశవాగ్నివాస్తుదేవబీజములు కలవు. ఈనామము నుపాసించువారు శక్తిసహిత శివకేశవులను ఆరాధించి, అగ్నిసాయమున ఉత్తమలోకములనుబొందుదురు. అగ్నిమాంద్యచర్మరోగాదులనుబోఁగొట్టఁగలరు. సర్వవ్యాపకములైన సంహారకశక్తులను సృష్టించగలరని తెలియుచున్నది.

ANNAMACHARYA KALA MANDIRAM
TIRUPATI.
No.........
LIBRARY

— 19. వ. యజుస్సు —

"నమఆమీవత్కేభ్యః"

అర్థము:-

ఆమీవత్కేభ్యః = సంపూర్ణముగా స్థూలభావముపొంది దేవతలలోఁగల శివులకు నమస్కారము.

తాత్పర్యము:-

సా. భా:— మహాశివుడు స్థూలములైన చేతనాచేతనవస్తువులందును దేవ హృదయములందును ఉండి సకల జీవులను, సకలలోకములను గాపాడెను. కాన ఆమీవత్కనామకుడాయెను. నమస్కరింపఁబడెను.

పంచమానువాకముమొదలు నవమానువాకాంతముగల మంత్రము లందలినామములు అన్యతరనమస్కారములుగాఁ జెప్పఁబడెను పరమేశ్వరుడు సర్వాత్ముడని ప్రతిపాదించుటకు, ఏకైకయజుస్సుతో స్థావరజంగమ రూపము ఒక్కొక్కటి చెప్పఁబడెను. ఒక్కొక్క యనువాకమును ఒక్కొక్క మంత్రముగా భావింపవచ్చును మంత్రపురశ్చరణాదిప్రకారము రుద్రకల్పమునఁ జెప్పఁబడెను.

వేదార్థప్రకాశమగు సాయన భాష్యముగల
నవమానువాకము సమాప్తము

272 నామము- శివ- "నమఆమీవత్కేభ్యః"

భ. భా. భా:— "మీఙ్ = హింసాయామ్" అను ధాతువునుండియేర్పడిన మీవత్పదమునకు సంహరించువాడనియర్థము. "ఆ + మీవత్కేభ్యః = అంతటను విజృంభించుచు దురాత్ములను దూరముగాఁ దొలగించు శివులకు ఆమీవత్పదమేర్పడెను అవి నమస్కరింపఁబడెను.

బీజాక్షరసంపుటి —

అమీవత్క నామమున "అ + మ్ + ఈ + వ్ + అ + త్ + క్ + అ" అని యెనిమిదక్షరములు కలవు. ఇవి అష్టప్రకృతులను. శరీరస్థాష్టచక్రములను సూచించును ఇందు శక్తిబీజములగు అకారమును, ఈకారమును దేవబీజమైన అకారముతోఁగూడియున్నవి. ఇందు మదనబీజము, వరుణవాస్తుప్రజాపతి బీజములునుకలవు శక్తిప్రధానమైన ఈనామము నుపాసించువారు జల యంత్రనిర్మాత, వృష్టికరులునై జలమందలి సకలవస్తువుల ను బైటపెట్టి, సకలకాంక్షలను దీర్చఁగలరని తెలియుచున్నది.

భ. భా. భా: — ఈమంత్రపురశ్చరణమును బరిశీలింపుడు. సావధానుడై 40 వేలసార్లు ఈమంత్రమును జపించవలెను అప్పటికి పురశ్చరణముపూర్తి యగును. మంత్రశోధనకై గురుసన్నిధిని 8 వేలజపముచేయవలెను. అందు వలనఁగర్మయోగ్యుఁడగును. ఈమంత్రముచే సా ధిం ప రా ని దే ది యు ను, ఏమాత్రమునులేదు మంత్రప్రభావముచే సమస్తమునుజేకూరును. దీనిచేఁ గామ్యకర్మచెప్పఁబడెను. దేవుడైన దక్షిణామూర్తియొక్క సన్నిధిని, అత్మాగ్ని యందుగాని, మధితాగ్నియందుగాని పేలాలను, తిలలను (నూవులను) లక్ష సంఖ్యగా హోమముచేయవలెను. అట్లైనచో సువర్ణము ఉత్పన్నమగును. అపామార్గబీజములను పెరుగులోదడిపియు, వేణుబీజములనుదేనెలోఁ దడి పియు, యవలను నేతిలోఁదడిపియును, 10 వేలుహోమముచేయవలెను. వేయి రెట్లు బంగారము ఉత్పన్నమగును. కన్యాకాముకుడు గుగ్గిలముతోఁ దనకిష్ట మైన కన్యయొక్క అకారమును నిర్మించి, దానిని స్వీకరించి 5 వేలజపమొనర్చి తర్వాతను అభొమ్మనుచేదించి, 6 వేలుహోమముచేయవలెను. అపుడు సర్వా భరణభూషితయైన ఇష్టమైన కన్యనుబొందును. తామరపూవులను నల్లకలు వల్లను, దెల్లకలువలను, లక్షహోమముచేసినవానికి రాజ్యలక్ష్మి ప్రత్యక్ష మగును.

మోదుగు మొలకనుబాలతోఁ దడిపి, లక్షహోమముచేసినచో యక్ష రాక్షస భూతప్రేతపిశాచాదులు అదృశ్యులును వశ్యులును అగుదురు. మహారణ్యభూమిలో, అగ్నికుండమొనర్చి, మథితాగ్నిలోఁ బదివేలమారడిపండ్లను హోమముచేయవలెను. పిడికిలితో మారడియాకులనుగైగొని, నేతితోఁదడిపి 5 వేలహోమముచేయవలెను. మారేడుపండు ఆకారముగల బంగారము ఉత్పన్నమగును. స్వర్ణవేదిపిండమగును సార్వభౌముడు, అనగా చక్రవర్తియైన కుమారుడుకావలెననుకోరికయున్నచో మహాదేవునిపైఁ దెల్లతామర పూవులను ఆవునేతితోఁ దడిపి లక్షహోమముచేయవలెను. జమ్మి సమిధలను దెచ్చివాని చివరలనువంచి, వెండిపాత్రలోనుంచి, పెరుగు, తేనె, నేయి, అను వస్తువులతోఁ దడిపి, 10 వేలుహోమముచేసినచో శివభక్తుడులభించును. తెల్ల సుగంధిఫలములచూర్ణమును వెండిపాత్రలోనుంచి, కపిలగోవునేతితోఁగలిపి, మంత్రించి, స్వయముగాసేవించినచో కవియగును. మేడికఱ్ఱ సమిధలను పెరుగు, తేనె, నేయి, అనువానితోఁ దడిపి, 10 వేలుహోమముచేసినచో, మహాభోగియగును. జాగరణముచేసి, మంత్రపురశ్చరణచేసినవాడు, మనోజవము కలవాడగును.

ఒక సంవత్సరము కృచ్ఛ్రవ్రతముచేసి, ఆత్మసంశోధనముచేసికొనవలెను. పిమ్మట బదునెనిమిది దినములు చరుశాకమూలఫలములు ఆహారముగా గలవాడై నిరంతరము జపముచేయవలెను. మధ్యలో బుద్ధిపూర్వకస్వప్నమైనను రాదు. బుద్ధిపూర్వకముగాఁగాక స్వప్నమువచ్చినచో స్నానముచేసి, జపము చేయవలెను. పిమ్మట జపాంతమున మంత్రానుసారముగా వశమగుటకు గురువుగారికి ఐదుబంగారునాణెములను ఒసంగవలెను. పిమ్మట 50వేలు గురుసన్నిధినో దేవసన్నిధినో జపముచేయవలెను. పిమ్మట వానికి సాక్షాత్తుగా రుద్రుడే ప్రత్యక్షమగును. వానిదయవలన మనోజవముకలవాడగును. గురువును స్మరించి, 800 మంత్రజపముచేసినవాడు తానుగోరినదేశమును జేరఁగలడు. పూర్వమువలెఁ బురశ్చరణమొనర్చి, ఎఱ్ఱచందనము కపిలగోవుపాలతో

గలిపి, ఆగంధమును అశ్వత్థపత్రమునసుంచి, స్పృశించి, 8 వేలు జపము చేయవలెను పిమ్మట దేవుని స్పృశించి, స్మరించి, ప్రాణాయామముచేసిన వాడు అదృశ్యుడగును. రాజు, రాజపురుషులును వశులగుదురు. దక్షిణామూర్తిసన్నిధిని నిత్యము 800 జపమొనర్చినచో రాజపురుషులవలన భయము తొలంగును.

పై మంత్రమునకు బదులు ఈ క్రిందిశ్లోకమును జపించినను పైనం జెప్పినఫలములన్నియును ప్రాప్తించును.

శ్లో॥ విశ్వతఃపాణిపాదాబ్జంవిశ్వతోఽక్షి శిరోముఖం।
జ్వలన్తంవిశ్వమావృత్యతేజోరాశింశివంస్మరేత్॥

తాత్పర్యము-

14 లోకములందును వ్యాపించియున్నకారణమున 14 లోకములందలి జీవరాసుల, పాణులు, పాదములు, నేత్రములు, శిరస్సులు, ముఖములును పరమశివునివేయగును. ప్రకాశించుచున్న విశ్వమును ఆవరించి, తేజోరాశియై యుండు శివుని స్మరింపవలెను.

శ్రీ భట్టభాస్కరవిరచిత యజుర్వేదభాష్యమున
శ్రీ రుద్రప్రశ్నమున నవమానువాకము సమాప్తము.

—★—

శ్రీ రుద్రాభిషేకమాహాత్మ్యము

—: దశమానువాకము :—

—: ప్రథమ ఋక్కు :—

"ద్రాపే అంధసస్పతే దరిద్రం నీలలోహిత।
ఏషాం పురుషాణామేషాం పశూనాం మాభేర్మారో।
మోఏషాం కించనామమత్"

సా. భా:— ద్వితీయానువాకము మొదలు నవమాంతములైన అనువాకములందు వివిధములైన యజుస్సులు ఉభయతో నమస్కారములు, అన్యతరతో నమస్కారములును, జెప్పఁబడినవి. పిమ్మట దశమానువాకమున ఋగ్రూపములైన మంత్రములు చెప్పఁబడుచున్నవి.

అర్థము:-

ద్రాపే = కుత్సితమైనగతిని బొందించువాఁడా! అంధసస్పతే = అన్నమును రక్షించువాఁడా! దరిద్రత్ = ఏమియునులేనివాఁడా! నీలలోహిత = కంఠమున నల్లనివాఁడవై, ఇతరత్ర ఎఱ్ఱనివాఁడా! ఏషాం = ఈమాదగు, పురుషాణాం = పుత్రపౌత్రాదులయొక్కయు, ఏషాం = ఈమాదగు, పశూనాం = గోమహిష్యాదులయొక్కయు, సమూహమును, మాభేః = భయపెట్టకుము. ఏషాం = ఈమోక్షమందిన అందఱిలో, కించన = ఒకవస్తువునైనను, మారః = నశింపజేయకుము. మోఆమమత్ = రోగమందిన వారిగాఁ జేయకుము.

తాత్పర్యము:-

సా. భా:— ఓమహాదేవ! పాపమొనర్చిన వారికందఱికినీ నరక

మొసంగి బాధపెట్టుచున్నావు. భక్తులయొక్క అన్నమును గాపాడుచు, అన్న ప్రదానముచే వారిని రక్షించుచున్నావు. నీవు సహజముగా ఏమియునులేని వాడవే. "ఏకమేవాద్వితీయంబ్రహ్మనేహనానాస్తికించన" మహాదేవా! పర మాత్మవైననీవు ఒక్కడవే. నీకంటె వేరొండవదిలేదు. ఇటనీలో నానాత్వము ఏమాత్రమునులేదు; అని పైశ్రుతిచెప్పుచున్నది. గరళము మ్రింగుటచే నీవు కంఠమందుమాత్రమే నల్లదనముకలవాడవు. ఇతర దేహభాగములందు ఎఱ్ఱనివాడవు. నీవు భక్తులచే ఇట్లు సంబోధింపఁబడుచున్నావు. నీవు మాపుత్ర పౌత్రాదులను, మాగోమహిష్యాదులను భయపెట్టకుము. నీ దయచే మేమందఱమును ముక్తులమే. మామధ్యనున్నవస్తువు ఏదియును నశింప కుండునుగాక. ఏదియును, రోగమొందకుండునుగాక.

273, 274, 275, 276. నామములు-

శివ+విష్ణుః—

"ద్రాపే, అంధసస్పతే, దరిద్రత్, నీలలోహిత!"

"ద్రాపే అంధసస్పతే" అను ఈమంత్రమునకు ఋషిపులహుడు. ఆస్తారపంక్తి ఛందస్సు ఆస్తారపంక్తిఛందస్సులో పండ్రెండు అక్షరములు కలవు. శ్రీరుద్రుడేదీనికిదేవత. ఈవిధముగా విశ్వరూపముతో దేవునిస్తుతించి, పిమ్మట మాకెవ్వరికిని భయములేకుండునుగాకయని భక్తుడుయాచించుచున్నాడు ఈ వివరణమున శివపరముగను, విష్ణుపరముగను విషయముండును. జీవుల గతి వారికర్మఫలమునకు అనుకూలముగానుండును. అందుచే అది ఒకప్పుడు ఉత్కృష్టమును, ఒకప్పుడునికృష్టమునైయుండును. తీవ్రవేదనను అనుభ వించుటయే అక్కర్మగతియొక్కస్వభావము. ఒకప్పుడది దరిద్రస్వరూపమై యుండును. పైవిధములనుండునదే వికర్మగతి. కర్మ అకర్మ, వికర్మ, అని తొల్లి మానవులుచేయుపని ముప్విధములుగానుండును. వానిలో వికర్మఫల మును సంహారకర్తయైన శివుడు, రక్షణకర్తయైన విష్ణువును, జీవులచే అనుభ వింపఁజేయుదురు

"ద్రా = కుత్సాయాంగతౌ" అను ధాతువునుండియేర్పడిన "ద్రా" అను పదమునకు, కుత్సగతి అనగా నీచమైన గతియని అర్థము. అది శోచ్యము = దుఃఖింపఁదగినది. సర్వలోకమును ఉపసంహరించుటయే దానిలక్షణము. "అప్లగతౌ" అనుధాతువునుండియేర్పడిన "ఆపి" అను పదమునకు చేర్చువాడనియర్థము శివకేశవులు కర్మఫలముతగ్గించి, తమభక్తులను తమయొద్దకు జేర్చుకొనుటకు వారిచే అనేక దుఃఖములను, కష్టములను అనుభవింపఁజేయుదురు. కావున శివకేశవులు ఇరువురును "ద్రాపి" అను నామముకలవారే. "ద్రాపి" అనగా కవచముకలవాడు అనియునర్థముకలదు. శివకేశవులు రాక్షసులతోఁ బోరాడునపుడు కవచముకల్గియేయుందురు. కావున వారికి "ద్రాపి" యను నామముసార్థకమే.

శివుడు చంద్రసూర్యస్వరూపుడై జీవుల కవసరమగు అన్నమునొసంగును కావున అంధస్సునకు = అన్నమునకుఁబతియై అంధసస్పతి నామకుడాయెను. అంధస్సుఅనగా నీరు. దానికిఁ బతియైనవాడును అంధసస్పతియగును. మూల ప్రకృతియైన జలము పరమాత్మనుండివేరై ప్రకృతియాయెను ఆజలమే విష్ణుపాదోద్భవమై ప్రపంచమునవ్యాపించి, జీవులకు అన్నముగా సైతముఉండెను. అందుచే విష్ణువుకూడ అంధసస్పతినామకుడాయెను. దరిద్రత్ = నిష్పరిగ్రహుడు అనగా ఎవరినుండియును ఏమియును స్వీకరింపనివాడన్నమాట మహాదేవుడే మహావిష్ణువు. వారుఇరువురును జీవులకు సకలమును ఒసంగుదురు కానివారు ఎవ్వరినుండియును ఏమియును గ్రహింపరు కావున శివకేశవులు ఇరువురును దరిద్రన్నామకులేయన్నమాట.

శివకేశవులు ఇరువురును నీలలోహితనామకులే. ఎట్లన? దేవుని హృదయమునుండి ఆవిర్భవించుటచే రుద్రుడు నీలలోహితుడాయెను. శివుడు భిక్షాటనాదికముచేయుటచేనీలుడును, నారి = వనిత సగభాగముననుండుటచే లోహితుడునాయెను. నామరూపాత్మకుడగుటచేనైనను శివుడు నీలలోహితుడే

కంఠమునందు నీలమును, వామభాగమున లోహితమును అగు శరీరము కలవాడగుటచే సైతము శివుడు నీలలోహితుడే అగును.

విష్ణువునీలుడు = నల్లనివాడును, సూర్యరూపముననుండుటచే లోహితుడునుఅయెను లోహిత, రోహిత, అరుణనామములు సమానార్థకములే అగుటచే లోహితనామము విష్ణువునకుజెల్లును.

రాక్షససంహారముచే వాటిల్లిన కాలుష్యమంతయును దొలగుటచే సైతము నీలలోహితనామము శివకేశవులకు సార్థకమే అగును. ఇట్లు శివకేశవాత్మకుడైన రుద్రుని సంబోధించి, భక్తులు అతనిని అభయము ఒసంగుమనియాచించుచున్నారు. శివకేశవస్వరూపుడవైన భగవంతుడా! పుత్ర పౌత్రాదిరూపులైన ఈమాపురుషులకుగాని గోవులుమున్నగు పశువులకుగాని ఏవిధమైన భయమువాటిల్లనీయక రక్షింపుము హింసింపకుము. వీనికిమారము అనగా అకాలమరణాదికముప్రాప్తించకుండ, రక్షింపుముతండ్రీ! మహాదేవా! మహావిష్ణో! నిన్నుబూజించుయజమాని ఏవిధమైన ఆర్తినిపీడనుబొందకుండు గాక. యజమానికిఁ జెందిన పశువులును ఆర్తినిజ్వరాదికమును బొందరాదని మాకోరిక.

ఒకదినమున ఉపవాసముచేసి, ఈమంత్రమును 10 వేలు జపించవలెను. అపుడు పురశ్చరణముపూర్తియగును. పిమ్మట కపిలగోవునేతితో ఆర్ద్రానక్షత్రయుక్తదినమున 10 వేలఆహుతులనుహోమముచేసినచో ధనవంతుడగును. సన్నిపాతజ్వరముతోబాధపడువాని శిరస్సునుండి దూర్వాగ్రములను తుడిచి 5 వేలుహోమముచేసినచో రోగిజర్వవిముక్తుడై దీర్ఘాయుష్మంతుడుఅగును వరులుగావించు ప్రయోగమును, మారణహోమమును అభిచారమందురు అట్టి అభిచారమునుండి భయముపోగొట్టుకొనుటకు, మానవుడు 10 వేలకంకతముఖలను (ప్రసాధనములను) హోమముచేయవలెను. నేతితోఁదడిపినతిలలను 10 వేలుహోమముచేసినచో మహాజనులుగావించు ద్రోహభయముతొలగును. 10 వేలుమేడిపుల్లలను నూలుగింజలతోఁ గలిపిహోమముచేసినచో సర్వభూతభయముతొలఁగును.

గ్రామనగరమధ్యభాగమున అగ్నినుంచి, అందునేతితోఁ దడిపిన తెలకపిండిని 10 వేలుహోమముచేయవలెను. రాత్రియాకులందు బలిని సమర్పించవలెను. తొల్త 8 వేలుహోమముచేయవలెను. అపుడు రుద్రుడు భైరవరూపియై భూతములతో సహప్రత్యక్షమగును. అతనిని జూచిభయపడకున్నచో మహాసిద్ధిజరుగును. చలించి భయపడినచో ఉన్మాదియగును. ఆపదలో ఆరూపమును స్మరించినచో ఆపదలు తొలగును. పిమ్మట మహాదేవునిట్లు ధ్యానించవలెను.

శ్లో॥ ఆగుల్ఫాసితకంచుకో డమరుకాశ్లిష్టోల్లసత్కుంతలీ।
శూలీకుండలితశ్రవాస్సతిలకోమందంక్వణన్నూపురః।
శ్రీమన్నిర్మలదంతపంక్తికిరణశ్శ్వేతాయమానాననో
దేవోభైరవవేషభూషితవపుర్ధ్యేయో మృడానీపతిః"

తాత్పర్యము-

మహాదేవుడు కాలిసీలలవరకునువ్రేలాడు తెల్లనికంచుకము కల్గియుండెను. ఢక్కాచే బాగుగాఁ దాకఁబడినట్టియును, ప్రకాశించుముంగురులు కల్గియుండెను. చేతఁద్రిశూలము కల్గియుండెను. చెవులఁగుండలములు కల్గియుండెను. నుదుటఁదిలకముతోఁగూడియుండెను. అతని నూపురములు మెల్లగాధ్వనిచేయుచుండెను అతనికి దంతములవరుస శోభావంతములై నిర్మలములైన కాంతికిరణములు కల్గియుండెను. అతని ముఖము తెల్లగానుండెను. స్వయంప్రకాశమానుడైన అతడు భైరవవేషముదాల్చియుండెను. అట్టి పార్వతీపతియే సదా ధ్యానింపఁగగినవాడైయుండెను.

బీజాక్షరసంపుటి—

ద్రావిపదమున "ద్ + ర్ + అ + వ్ + ఇ" అని ఐదక్షరములుకలవు. మార్గావహ్నిప్రధానమైన పైనామము నుపాసించువాడు శక్త్యుపాసకుడై

జ్ఞానవంతులై తరింతురు. దీని నుపాసించువారు అగ్నిభేదములను గనుగొని దుర్గాప్రభావముచేఁ గృత్రిమమేఘములను, సకాలవర్షమునుకురిపించి, లోక రక్షకులు కాఁగలరని తెలియుచున్నది.

అంధసప్తతినామమున "అ+మ్+ధ్+అ+స్+అ+న్+ప్+అ+త్+ఇ" అని పదునొకండు అక్షరములుకలవు. ఇందలి సకారద్వయము శక్తిప్రధానము. అకారచతుష్టయము పురుషప్రధానము. కావునఁ బైనామము శాక్తాద్వైతులకుఁ బ్రధానము. దీనినుపాసించువారు జ్ఞానులై తరింతురు. శక్తి ప్రభావముచే లోకకాంక్షలను దీర్పఁగలధనరాసులను గనుగొనియుఁ గృత్రిమమేఘసృష్టిచే వర్షముకురిపించియు లోకరక్షణగావించఁగలరని తెలియు చున్నది.

"దరిద్రత్" అను నామమున రెండు అగ్నిబీజములును, రెండు దుర్గా బీజములునుగలవు. అవివాస్తుబీజముతోఁగూడియున్నవి. కానఁ బైనామము నుపాసించువారు శాక్తేయులై తరింతురు. ఈ నామము నుపాసించువారు అగ్ని ప్రేషకయంత్రములను సృష్టించిదేశరక్షకులు, వ్యాధినివారకులు ను గాఁగలరు. నీలలోహితనామమున "న్+ఈ+ల్+అ+ల్+ఓ+హ్+ఇ+త్+అ" అని పదక్షరములుకలవు అవి దశదిక్కులను, దశేంద్రియము లను సూచించును. ఇందు వరుసగా సావిత్రీమాయశక్తిపృధివీబీజములుకలవు. అవి వరుసగా బ్రహ్మశివ విష్ణుబీజములతోడను, వాస్తుబీజముతోడనుగూడి యున్నవి. ఇది సకల మతస్థులకును ఉపాస్యమైన నామము. దీనినుపాసించు వారు సాయుజ్యాది ముక్తులనుబొందుదురు. అంతేకాదు. పృధివిలోఁగల పాంచభౌతికవస్తువులనెల్ల యంత్రసహాయమున వెలికిఁదీసి, లోకోపకార మొనర్పఁగలరని తెల్పియుచున్నది. పృధివీగత వస్తువులనెల్ల బైటికిదీయఁగల యంత్రములను నిర్మింపఁగలవారలుకాఁగలరనియును దెలియుచున్నది.

-: 2. వ. ఋక్కు :-

"యాతే రుద్ర! శివాతనూశ్శివావిశ్వాహభేషజీ,
శివారుద్రస్యభేషజీ, తయానోమృడజీవసే"

అర్థము:-

హేరుద్ర = ఓ శివుడా! తే = నీదగు, తనూః = ఒకశరీరము, శివా = శాంతమైనది. తయా = ఆశరీరముతో, నః = మమ్ములను, జీవసే = జీవింపఁజేయుటకు, మృడ = సుఖింపఁజేయుము సా = ఆశరీరము, విశ్వాహభేషజీ = విశ్వ+అహ = అన్నిదినములందును, రోగదారిద్ర్యాదులను దొలగించుటకు, భేషజీ = ఔషధమువంటిదికాన, శివా = శుభకరమైనది. రుద్రస్య = శివుని యొక్క, తాదాత్మ్యముపొందుటకు, భేషజీ = ఔషధరూపయైనదియును, జ్ఞానదానముచే సంసారదుఃఖముతొలగించునుగాన, శివా = మంగళకరమైనదియును అగుచున్నది.

తాత్పర్యము:-

సా. భా:— మహాదేవా! నీకు "ఘోర, శివ" అని రెండు శరీరములుకలవు. వానిలో శివ అను శరీరము శాంతస్వరూపము. ఆశరీరముతో మమ్ములను, అనగా జీవులను జీవింపఁజేయుదువు. మాకు సుఖమును జేకూర్చెదవు. పైశరీరముతో, అన్నిదినములందును, జీవులరోగములను దొలగించెదవు. వారికిఁగల దారిద్ర్యాలను సైతముతొలగించెదవు. కావున ఆనీశరీరము ఔషధమువంటిదై సుఖముచేకూర్చును. నిన్ను సేవించుభక్తులకు నీఆత్మలోఁ జేరుటయనెడి తాదాత్మ్యరూపమోక్షమునొసంగెదవు. జ్ఞానమునొసంగి, జీవులకు జననమరణాదులచేఁ బ్రాప్తించు దుఃఖమును నివారించెదవు. అందుచే నీశరీరమునకుఁగల శివయను నామముసార్థకమైనది.

శివ + విష్ణు:-

"యాతేరుద్ర" అను మంత్రమునకు స్కందుడుఋషి. అనుష్టుప్ఛందస్సు స్కందరూపియైన రుద్రుడుదేవత. ఓ రుద్రుడా! నీవు విష్ణుస్వరూ

పుడవైన శివుడవు శివకేశవరూపుడవైన నీ శరీరము, సకలజీవులకును సుఖకరమైనదే. ఆనీశరీరముతో మాకు శుభముచేకూర్పుము. నీవుచేయు శుభము రెండువిధములు. సర్వదుఃఖములను దొలగించుటలో భేషజముగా, ఔషధముగానుండుట ఒకవిధము. ఆత్యంతముకల్గు దుఃఖములను దొలగించుటలో భేషజముగానున్నది రెండవ విధము. మహాదేవ! నీవు తొలుత ధనపుత్రాదుల సుఖమును, స్వర్గసుఖమును, సంసారసుఖమును ఒసంగుచున్నావు. అది ప్రథమ శుభము. పిమ్మటనిన్ను ఆరాధించు భక్తులకు నిశ్శ్రేయసలక్షణసుఖమును (మోక్షసుఖమును) జేకూర్చుచున్నావు. అది రెండవశుభము. పైనజెప్పినట్లు రెండు విధముల సుఖమును జేకూర్చుటచే "శివ"యను పేరుగల నీ శరీరము సకలదినములందును జీవులకు భేషజముగానున్నది పరమశివా! "ఘోర" యను పేరుగల నీశరీరము, దేశభేదమును, కాలభేదమును, సకల శరీరభేదమును, అవస్థాభేదమును, అనుసరించి, జీవులను రక్షించుటచే, భేషజముగానున్నది. మహాదేవ! నీవు రుజను అనగా సంసారమనురోగమును జీవులకువాటిల్లనీయక ద్రవింపజేయుచున్నావు. అనగా నశింపజేయుచున్నావు కావున నీవు రుద్రుడవైతివి. అందుచే నీశరీరమునకు భేషజనామము ఔషధమను పేరువాటిల్లినది. నీవు నీశరీరముతో సంసారరోగమునుండి భూతములను ఉద్ధరించుచున్నావు. నీశరీరమువలె, నీస్వభావము సైతము, జీవరక్షణకే ఉపయోగపడుచున్నది. కావున నీవు జీవులమగు మమ్ములను సుఖపెట్టుము.

శివుడువలె విష్ణువుకూడ జీవులను రక్షించుటకేపాటుపడుచుండుటచే విష్ణుశరీరమునకును శివయనునామము సార్థకమేయగును. శివశరీరమునకువలె విష్ణుశరీరమునకును, శివ, ఘోరయనుభేదముకలదు. శివునియొక్క ఘోరనామకశరీరమువలె, విష్ణువుయొక్కఘోరనామకశరీరముసైతము జీవులను రక్షించును.

ఈ మంత్రమునెట్లు పునశ్చరణచేయవలెనో గమనింపుడు. 8 వందల ప్రాణాయామములుగావించి, 5 వేలు జపముచేసినచోఁ బునశ్చరణపూర్తి యగును. దీనిచేఁ గేవలము గర్భరక్షణజరుగును. 3 నెలలగర్భమని వ్యక్తమైన పిమ్మట శిశురక్షణచేయవలెను రుద్రమంత్రముచే సిద్ధినంది బ్రాహ్మణునిచే గర్భస్థశిశువువృద్ధినొందుటకై తన విభవమునకు అనుకూలముగా అలంకరించి,శంభునిగాభావించి, ఆవిప్రుని నమస్కరింపవలెను. గర్భిణీస్త్రీ దేహమున చక్కనికాంతివాటిల్లినపుడు, సాధుగర్భమును అసాధువులు చూడరాదను తలంపుతో ఈపనిచేయింపవలెను. రాజుగారిగృహమధ్యభాగమున జనశూన్య ప్రదేశమున అడ్డముగా అర్వాగ్గామిద్వయమును స్వీకరించి ధ్వజాద్యలంకారములతో అలంకరించవలెను. రెండుమంత్రములతోఁ బ్రస్థమందలి పరిశుద్ధ తండలములనుజల్లి ఆప్రదేశమున అగ్నికుండమును వేదికను గావించవలెను. ఆవేదికయందు సాధారణఘటముమీదను మహాసేనమంత్రముతో స్వర్ణపుష్పముతో శివుని ఆవాహనచేయవలెను. దానియందు అర్వాగ్గామిద్వయముతో గలశనుంచవలెను. ఆకలశలుబిందుయుతములై దారముతోఁ జుట్టఁబడవలెను ఆకలశలలో స్వర్ణమువేసివానిపై మూకుళ్ళుబోర్లించవలెను ఆకలశలునిండుగా సముద్రమును జేరునదీజలముతోనింపవలెను. వానిపై గ్రొత్తబట్టనుగప్పవలెను. ఆమంటపమధ్యమున జలపూర్ణఘటమునుంచవలెను. ఆర్ద్రాది నక్షత్రములతో దినములను లెక్కించవలెను. దానిలో సువర్ణమువేసి, మిగిలిన వానిని నవరత్నములతోనింపవలెను. మూడు రత్నములను నీటితో నిండిన ఘటమున ఉంచవలెను. వానిపై విలువైన వస్త్రములను గప్పవలెను. వానిని స్థిరముగానుంచి దేవుని ఆరాధించవలెను ఆతనిపై గంధమును పూయవలెను. అందావహించిన శ్రీకంఠుని (శివుని) తామరపూలతోఁ

బూజింపవలెను పిమ్మట గుగ్గులధూపమును సమర్పించి, నేతిదీపమును చివర నుంచవలెను. అంతటను గర్పూరముతోఁగలుపవలెను. ఇట్లారాధించి, ఆశివుని సన్నిధిని, ఉపస్థానమంత్రమును జపింపవలెను. పిమ్మటఁపటసంసారమంత్రముతో హోమముచేయవలెను నూవులు, దూర్వాగ్రములు, పేలాలు, తులిసి మంచిగంధము, పెరుగు, తేనె, నేయి, అనువానితోఁగూడిన హోమద్రవ్యముతో హోమముచేయవలెను. పిమ్మట హవిఃపూజచేయవలెను. ప్రస్థతండులములనువండి, పైమంత్రముతో హవిస్సును అగ్నిలో హోమముచేయవలెను పిమ్మట గంధమును, వస్త్రమును, కర్పూరమునుఒసంగవలెను. పిమ్మట గురువులను ఆదరించుచు, ఉద్దిష్టపురుషుడుకాని, ఇతరుడుకాని భుజించవలెను తర్వాతసాయంకాలమునను, అగ్నికుండలములను, స్పృశించి, ఆచార్యుడు జపముచేయవలెను. నిత్యముచేయువిధముననే వస్త్రాచ్ఛాదనము, వసనోత్తరీయము సమర్పించుటయును జరుగును నిత్యము బ్రాహ్మణులకు భోజనము పెట్టవలెను. ఇట్లాచరించినరాజునకే శక్తిలభించును. అపుడాతనికి ఆయుర్దాయముగల మంచిసంతానముకల్గును. గర్భస్రావము జరుగనేరదు. గురూపదేశముననుసరించి, గంధముకంటె మిగిలినదానినిఁ బ్రధానముగాఁ జేయవలెను వసాఖండాదులు మంత్రసంబంధవైదికకృత్యములగుటచే అవిచేయు ప్రదేశమున స్త్రీశూద్రాదులు ప్రవేశింపరాదు. తుదిదినమున స్నానముచేయవలెను. దండదానరూపముగా దాసిని గురువున కొసంగవలెను. పిమ్మట పుత్రస్వీకారమునకై గణపతిపూజచేయవలెను. అట్లైనచో వాని సంతానము, ఆయుర్దాయముకలదగును. కన్యాదేవతనుద్దేశించినేతితోఁ దడిపినపేలాలను హోమముచేసినచో కన్యలభించును. అపామార్గసమిధలతో హోమముచేసి

పండితుడు అలక్ష్మినిబోగొట్టుకొనవలెను. తిలాహుతులను సమర్పించినచో సర్వ కల్మషములునశించును. మేడిపుల్లలను హోమముచేసినచో బ్రాహ్మణులు వశు లగుదురు. శ్వేతరక్తనీలపీతసూత్రములతోఁ గలశలను బరివేష్టించి, లక్ష సారులు నేతితోహోమముచేసినచో సాధకుడు సర్వకామములనుబొందును. వస్త్రకాముకుడుశ్వేతకుసుమహోమముచేయవలెను. ఏరంగు పుష్పములు హోమముచేసిన ఆరంగువస్త్రములు లభించును.

వృష్టికాముకుడు ఈక్రిందిరీతినిజేయవలెను ఎట్లన? గోమయముతో అలికి పరిశుభ్రముచేసినప్రదేశమున రక్తద్రవ్యముతో అచటనే మండలము చేయవలెను. మండలముఎదుట నూతన కుంభమునుంచవలెను. గంధజల ముతోనింపిన ఆకుంభమును సూత్రముతోఁ గట్టవలెను. పిమ్మట ఆకుంభ మున సూర్యుని ఆవాహనముచేసిఏకాగ్రమానసుడై సాధకోత్తముడు అటనున్న సూర్యదేవుని బూర్వమువలెఁ బూజింపవలెను. అచటపాలతో 108 సార్లు హోమముచేయవలెను. ఏకాగ్రబుద్ధితో ధ్యానించుచు, వేయిసార్లు సూర్య మంత్రమును జపించవలెను ఇట్లుఏడుదినములో పండ్రెండుదినములో చేసినచో సూర్యభగవానుడు ప్రసన్నుడై మహావర్షముకురిపించును. పుత్రులుకావలెనని కోరువాడుశుచియైమంచి నియములుకలవాడై రేఁబవళ్ళుఉపవాసముచేయవలెను అగ్నిలోఁ బాయసహోమముచేయవలెను 108 ఆహుతులను సమర్పించవలెను ఋతుస్నాతయైనపిమ్మట 4 వ దినమునస్నానమాడిన తర్వాత భార్యను శుచి యైన వస్త్రాదికముతో అలంకరించవలెను పిమ్మట హుతశేషమును ఆమెచే భుజింపఁజేయవలెను బుధుడైనవాడు 108 సార్లు జపమొనర్చి బ్రాహ్మణులకు భోజనముపెట్టవలెను. స్వస్తివచనముచెప్పించవలెను. ఇట్లు చేసినచో తేజ

శ్శాలియును, రోగహీనుడునగు పుత్రుడు లభించును అనిష్టమైనవస్తువును జూచినపుడును, దుస్స్వప్నముగాంచినపుడును, అభిచారకర్మలొనర్చుటచే దోషము వాటిల్లినపుడును, అలక్ష్మితోఁగూడినపుడును, విగ్రహాదులుపోయినపుడును, భయము గ్గినపుడును, సూర్యాదిగ్రహపీడలు కల్గినపుడును, భూత పిశాచాదులు తనలో ఆవేశించినపుడును, ఇతరదోషములు వాటిల్లినపుడును. ఇంతకమున్నుచెప్పినట్లే మండలముకావించి, నూతనకుంభమును గంగోదకముతోనింపి, దానికిఁ జెందిన మంగళకరకార్యములాచరించి, ఏలకలను, లవంగాలను, కర్పూరమును నిమ్మపండ్లును, జాజిఫలములను, ఆకుంభమున ఉంచవలెను. ఆ కలశలో మహాదేవుని ఆవాహన చేయవలెను. పూజింపవలెను అచటనే హోమముచేయవలెను. (1108) 1 వేయి 108 సార్లు ఈ మంత్రముతో మహాశివుని మంత్రించవలెను. పిమ్మట యజమానికాని పరుడుకాని రుద్రాభిషేకముచేయవలెను. ఇట్లు చేసినచో దోషము తొల్లతొలగిపోవును. నిత్యము ప్రాతఃకాలమునస్నానమొనర్చి, వేయిసార్లు ఈమంత్రమును జపించిననో, మానవుడు తప్పక, తనసంపదను, ఆరోగ్యమును, తేజస్సును, సర్వదావృద్ధిచేసికొనఁగలడు. ఒక సంవత్సరము క్షీరాహారుడై జితేంద్రియుడై, జపమొనర్చి యథాశక్తిగాఁ బ్రతిదినము 10 వేలుపూజ చేసినవాడు సాటిలేనిసిద్ధినిబొందును. అతడు అణిమాదిశక్తులనుబొందగలడు. వానికిఁ దప్పక జగత్పతి ప్రసన్నుడగును. వానికి మానుషభోగములేల? ఇట ఒహుగాఁ జెప్పనేల? మహాదేవునియందే చిత్తమునుంచి, తత్పరాయణుడై "మహాశివోఽహమ్" అనుభావముపొందినవాడై పైమంత్రముజపించినచో, మోక్షమై తప్పక ముక్తుడగును. పైమంత్రమును బఠింపఁజాలనివాడు ఈక్రింది విధమున శివుని ధ్యానించి, ఈక్రింది శ్లోకమునే జపమొనర్పవలెను.

ధ్యానశ్లోకము:-

"ద్రుతచామీకరప్రఖ్యం శక్తి పాణిం షడాననం।
మయూరవాహనారూఢం స్కందరూపం శివంస్మరేత్"

తాత్పర్యము-

అపుడే కరిగిన బంగారమువలెనున్నవాడును, శక్తియనునాయుధము చేతగలవాడును, ఆరుమోములుకలవాడును, నెమలివాహనము నధిష్ఠించిన వాడును, కుమారస్వామిరూపుడునగు శివుని స్మరింపవలెను.

-: 3. వ. ఋక్కు :-

"ఇమాగ్ంరుద్రాయతవసేకపర్దినే క్షయద్వీరాయప్రభరా మహేమతిం।
యథానశ్శమసద్ద్విపదేచతుష్పదే విశ్వం పుష్టంగ్రామే అస్మిన్ననాతురమ్"

అర్థము:-

యథా = ఏప్రకారముగా, నమః = మాయొక్క, ద్విపదే = పుత్ర పౌత్రాదిరూపమనుష్యునకును, చతుష్పదే = మహిషాద్యాది రూపపశువునకును, (గేదెలమున్నగుపశుసమూహమునకును) శం = సుఖము, అసత్ = అగునో, కించ = ఇంతేకాదు, అస్మిన్గ్రామే = ఈగ్రామమునందలి, విశ్వం = ప్రపంచము, పుష్టం = సుఖపూర్ణమును, అనాతురం = ఉపద్రవశూన్యమును, అగునో, తథా = అట్లు, వయం = మేము, రుద్రాయ = రుద్రునికొఱకు,

ఇమాం = ఈ, మతిం = పూజ ధాన్యము, మున్నగువానికిఁ జెందినబుద్ధిని, ప్రభరామహే = గొప్పగాఁబోషించుచున్నాము. తవసే = బలయుక్తుడును, తాపసవేషుడును, క్షయద్వీరాయ = క్షీణించు ప్రతిపక్షపురుషులుకలవాడు నగు, కపర్దినే = రుద్రునకు, సకలమును సమర్పించుచున్నాము.

తాత్పర్యము:-

మహాదేవుడు బలవంతుడు. తాపసవేషముకలవాడు. సృష్టిలోఁగల సమస్తము ఆతనిస్వరూపమే. తనకువ్యతిరేకముగానున్నవన్నియు, శత్రువులైన రాక్షసుల సమూహమంతయును, ఆతని దివ్యతేజస్సుచే క్షీణించును. తనకు వ్యతిరేకముగాభాసించు పాపమంతయు నశించుటకు ఆతడేహేతువు. అట్టి రుద్రునిదయ సంపాదించుటకు మాబుద్ధిని ఆతని పట్లనే ప్రవర్తింపజేసి, మన సారధ్యానింతుము. ఆతడు పుత్రుడు, పౌత్రులు మున్నగు మనుష్యులకును, మాపోషణలోఁ గలపశువులకును, సుఖముచేకూర్చునుగాక. బ్రహ్మాండమనెడి ఈగ్రామమునగల సకలప్రాణులును ఆతని దయచే సుఖము పొందునుగాక. ప్రపంచమున ఏయుపద్రవములును వాటిల్లకుండునుగాక.

శివ+విష్ణు:

భ. భా. భా:— "ఇమాగ్ం రుద్రాయ" "మృడానోరుద్రః" అను రెండు మంత్రములకును మాండవ్యడుఋషి. ఈరెండును జగతీఛందస్సునకుఁ జెందినవే. రుద్రుడు దేవత. ఈరెండుఋక్కులును ఒకటేమంత్రమని కొందఱితలంపు. శివకేశవరూపుడగు పరమాత్మకుఁ జేయు పూజలు, శారీరకము, వాచికము, మానసికము, అనిముత్త్రివిధములు. అందుచే భక్తులు బుద్ధిలోఁ బరమేశ్వరునిధ్యానించి, ప్రకృష్టముగా మానసికపూజచేయుచున్నారు "స్తుతంస్తోతారణప్రియః" అని విష్ణుసహస్రసూక్తిలోఁజెప్పినట్లు స్తుతిరూపులైన శివకేశవులనుస్తుతిచేసి, భక్తులు ఆతనినిఃబ్రసన్నునిజేసికొనుచున్నారు. ఈవిధ

ము గ స్తుతిరూపపూజయును శివకేశవులకు సమర్పింపఁబడును. యజ్ఞాదులలో జేయుస్తుతుఃతోడను, అగ్నిలో సమర్పించు హవిర్దానములచేతను, భక్తులు తమ మతిని శివకేశవులపట్ల అవిచ్ఛిన్నముగానుంచుచున్నారు, శివకేశవులే స్తోత వ్యులు (స్తుతింపఁదగినవారు.) ఉపాసింపదగినవారు. ఆశ్రయింపఁదగినవారు చూడఁదగినవారు. వినదగినవారు. మన్తవ్యులు. నిధిధ్యాసయోగులు. "ద్రష్టవ్యశ్శ్రోతవ్యోమన్తవ్యోనిధిధ్యాసితవ్యః" అను శ్రుతిలో ఈవిషయమే చెప్పఁబడెను. శివుడు వాయ్వగ్నిచంద్రాదిత్యాదిరూపములతో బ్రహ్మాండము ను వృద్ధిచేయుచుండగా విష్ణువురక్షించుచున్నాడు. "బలాయనమోబలప్రమథ నాయనమః" అను మంత్రమునఁ జెప్పినట్లు శివుడు తవము (బరము) కల్గియుండగా "బలంబలవతామస్మి" అను గీతాసూక్తిలోఁజెప్పినట్లు విష్ణువు తన విభూతిని బలముననుంచినాడు. కానవారు బలవంతులాయెనన్నమాట. కపర్దిమను జటలవరుసగల్గి శివుడుండగా, విష్ణువు, క = జలముచేపర్ది = బ్రహ్మాండమును బవిత్రముచేసెను. అందుచే శివకేశవులు కపర్దులైరి వీరు లందఱును శివునాశ్రయించి, క్షయన్తి = నివసించుచున్నారు. మహావీరులైన రాక్షసులు విష్ణువును సమీపించి, క్షయంతి = నశించుచున్నారు. అందుచే శివకేశవులు క్షయద్వీరులైరి. ఓశివకేశవులారా! మీరు మమ్మలను ప్రకృష్టముగా భరించువారు కాన ద్విపదులైన మాపుత్రాదులను, చతుష్పాత్తులైన మా పశ్వాదులను రక్షింపఁ బ్రార్థించుచు, మీయందే మా మతిని లగ్నము చేయుచున్నాము . మా ప్రాణిజాతము ను సకలము ను సుఖము చేకూర్చి రక్షింపుడు. పుష్టినొందునట్లు చేయుడు. వివిధములైన రోగము లు లేకుండునట్లు కాపాడుడు.

"రుద్రాధ్యాయీపసేద్యత్రగ్రామేవానగరేఽపివా,
నతత్రక్షుత్పిపాసాద్యాదుర్భిక్షవ్యాధయోఽపిచ"

అను పురాణసూక్తిచే రుద్రులైన శివకేశవుల మహిమగలమంత్రములను అధ్యయనము చేయువారు నివసించెడి గ్రామమునందుగాని నగరమునందుగాని క్షుత్పిపాసాదిబాధలుండవనియు, దుర్భిక్షమువ్యాధులునుండవనియుఁ దెలియుచున్నది. కావున శివకేశవులారా! జీవులమగుమాకు ధనధాన్యాదికమును సమృద్ధిగానొసంగుడు; అనిభక్తులుప్రార్థించిరి.

-: 4 వ. ఋక్కు :-

"మృడానోరుద్రోతనోమయస్కృధిక్షయ ద్వీరాయ
నమసావిధేమతే,
యచ్ఛంచయోశ్చమనురాయజేపితాతదశ్యామ తవరుద్ర
ప్రణీతౌ"

అర్థము:-

హేరుద్ర = ఓశివ! నః = మమ్ములను, మృడ = ఇహలోకమున సుఖింపఁజేయుము; ఉత = ఇంతేకాదు నః = మాకు, పరలోకమునను, మయః = సుఖమును, కృధి = చేయుము. క్షయద్వీరాయ = నశింపఁజేయఁబడిన మాపాపములును, వీరులునుగల, తే = నీకు, నమసా = నమస్కారముతో, విధేమ = సేవించెదము. పితా = పాలకుడైన, మనుః = ప్రజాపతి, యత్ = ఏ, శంచ = సుఖమును, యోశ్చ = దుఃఖమునకు దూరముగానుండుటను, యత్ ఆయజే = ఏలేశమును, సంపాదించెనో, తత్ = అసర్వమును, వయం = మేము, హేరుద్ర! = ఓ. శివుడా!, తవ = నీయొక్క, ప్రణీతౌ = ప్రణయమును స్నేహాతిశయమునుగలుగగా, అశ్యామ = పొందఁగలము.

తాత్పర్యము-

సా. భా:— మహాదేవ! నీయధీనమునఁగల జీవులకు ఇహలోకసుఖమును పరలోకసుఖమును జేకూర్పుము. జీవులుచేసినపాపములను నశింపఁజేయుము నీసేవచేయుదుము. నీకుభూయందుఁగల వాత్సల్యముచే నీయధీనముననుండి పాలించెడి మనువుచేయుసుఖమును అనుభవించెదము. నీమూలమునఁ బాపమునకుదూరులగుదుము; అని భక్తులు ప్రార్థించిరి.

శివ+విష్ణు:

భ. భా. భా:— శివునిదయచే మృకండమహర్షి పుత్రవంతుడాయెను. అతని దయచేతనే అందఱును ఐశ్వర్యవంతులగుదురు. అటులనే విష్ణువుదయచే గజేంద్రుడు బ్రతికెను. కుచేలుడు ఐశ్వర్యవంతుడాయెను. బ్రహ్మాండమందలి జీవులెల్లరును శివకేశవులదయచేతనే, పుత్రధనాదిసమృద్ధిని, సుఖమును బొందుచున్నారు. నిరతిశయమోక్షానందమును బొందుటకు వారేమూలకారణము. మహావీరులు వీరినాశ్రయించియున్నవారు. తమ భక్తులశత్రువులు నశించుచున్నారు. వీరికృపాదృష్టిచే భక్తులందుఁగల కామక్రోధాదివీరులు నశించినారు కాన మహాప్రభులారా! మిమ్ముల నమస్కరించియు, చరువు రోడాశాదులను సమర్పించియు, మీసేవచేయుచున్నారము. కావున మమ్ములను రక్షించి సుఖముచేకూర్పుడు. సుఖమునొసంగినట్లే మాదుఃఖములను సైతము తొలగింపుడు. మాకుఁగష్టములు కల్గుటకుగలకారణములను నిర్మూలించియు, రాబోవుకష్టములను రానీకకుయు, రక్షింపుడు. పరమేశ్వరులారా! మీసృష్టిలోనున్నజీవులకు సుఖమునుజేకూర్పుటకై మీయంశతో మనువును సృష్టించినారు అతని యధీనమున బ్రహ్మాండమందలి జీవులకు సుఖము చేకూర్పఁదలంచువాడుకావున అతడు మనువాయెను. ప్రజలకెల్లఁ బితయాయెను ప్రజాపతియైన మనువు మీప్రేరణలననుసరించి, తనవశమునఁగల జీవులకు

వర్ణాశ్రమాదిభేదముతో, మర్యాదను హద్దును, వ్యవస్థను ఏర్పఱచినాడు. అతనిచే మీరు మాకు గల దుఃఖములను తొలగింపఁజేయుచున్నారు. ఇట్టులనే మీప్రసాదమువలన మేము ప్రమత్తులముకాక ఉండుము. ప్రమాదమున్నప్పటికిని మీదయవలన మీమాట మీఱుటయనుదోషముపొందినవారముకాము. అతిశయముగా మాకు అభిముఖులుకండని భక్తులు శివకేశవులను, రుద్రా! అని సంబోధించుచున్నారు. రుద్రులారా! మీశాసనమున ఉండగలము. మాపట్ల మీకుఁ బ్రణయముకల్గినచో, మేము స్వాములైన తమచెంతను భృత్యులుగా ఉండగలము. అయ్యలారా! మనువు మీచేనియుక్తుడై ప్రజాపతియై ప్రజాహితముచేయుచున్నాడు. మాదుఃఖములను అతడు తొలఁగించునట్లు, మాకు సుఖము చేకూర్చునట్లును మెలఁగఁగలము. మనువుకూడ సర్వజ్ఞుడైనను జగత్పితయై మాకృత్యములను ప్రశంసించుచున్నాడు. అతనిరక్షణకు మేము భాజనముకాఁగలము; అనితమమొఱవినిపించుకొనిరి

పైరెండుమంత్రముల పురశ్చరణమును గమనింపుడు కృచ్ఛ్రవ్రతమాచరించి పైమంత్రములను 9 వేలసార్లు జపించవలెను. అమావాస్యదినమున, నాల్గుబాటలు కలియుచోటను అగ్నినుంచి, అందుపదిని 10 వేల ఆహుతులు హోమముచేయవలెను. అందుచే గోశాంతి జరుగును. జలమును స్పృశించి, ఆర్ద్రానక్షత్రయుక్తదినమున 10 వేలుజపమొనర్చి, జలమును వాహనశాలలో జల్లవలెను. అట్లొనర్చో రాజవాహనములకు శాంతిజరుగును.

పశుపక్ష్యాదుల శాంతికి 10 వేలసార్లునేతితోఁ దడిపిన తిలలను హోమము చేయవలెను. ఇతరజీవులశాంతికి 10 వేలు దూర్వలను హోమము చేయవలెను. మంత్రపఠనాశక్తతలేనివారు ఈక్రిందిధ్యానశ్లోకమును జపించవలెను.

శ్లో॥ దివ్యసింహాసనాసీనం స్తూయమానం మహర్షిభిః।
ప్రసన్నవదనం ధ్యాయేత్ "సోమం సోమార్ధధారిణమ్"
("సోమాంశధారిణమ్") అని పాఠాంతరము కలదు.

తాత్పర్యము-

దివ్యసింహాసనాసీనుడై మహర్షులచే స్తుతింపఁబడునట్టియును, చంద్ర రేఖనుదాల్చినసోముని (శివుని) ధ్యానింపవలెను.

-: 5 వ. ఋక్కు :-

"మానో మహాంతముతమానో అర్భకం।
మానఉక్షన్తముతమానఉక్షితం
మానో వధీఃపితరంమోతమాతరం
ప్రియామానస్తనువోరుద్రరీరిషః"

అర్థము:-

హేరుద్ర! = ఓరుద్రుడా! నః = మాయొక్క, మహాంతం = ముదుసలియైనపురుషుని, మారీరిషః = హింసింపకు, ఉత = ఇంతేకాదు. నమః = మాయొక్క, అర్భకం = బాలుని; మారీరిషః = హింసింపకుము; కించ = ఇంతేకాదు; నః = మాయొక్క; ఉక్షంతం = నీరుచిమ్ముటకు, సేవచేయుటకును సమర్థుడైన పురుషుని, మారీషః = హింసింపకుము ఉత = ఇంతేకాదు. నః = మాయొక్క,ఉక్షితం = గర్భమందలి పురుషుని, మారీరిషః = హింసింపకుము నః = మాయొక్క, పితరం = తండ్రిని, మావధీః = చంపకుము. ఉత = అంతేకాదు, మాతరం = మాతల్లినిగూడ, మావధీః = చంపకుము నః = మాయొక్క ప్రియాశ్చ = ప్రియమైన, తనువః = శరీరములను, మా రీ రి షః = హింసింపకుము

తాత్పర్యము:-

సా. భా— ఓమహాదేవ! మాయింటగల ముదుసలి మాతాత మహాపురుషుడు, అతని, మాబాలుని, మాసేవకజనమును, మాగర్భస్థశిశువును, మాతండ్రిని, మాతల్లిని మాప్రియమైన శరీరములను హింసింపకుము; అని గృహస్థుడు ప్రార్థించెను.

శివ + కేశవ:-

భ. భా. భా:- ఓశివకేశవులారా! మీరురుద్రులు. మీరేబ్రహ్మాండమంతటికిని తండ్రులు, మాయింట, విద్యావయోజ్యేష్ఠులైన పితామహాదులుగలరు. వారిని మీరు అనుగ్రహింపవలెను. శ్రద్ధాభక్తులు, సద్గుణములుగల మాపుత్రుని రోగాదులలోముంచి, హింసింపకుడు, మీరు ఆరోగ్యదాతయగు సూర్యుని స్వరూపులుకాన ఆరోగ్యమొసంగిరక్షింపుడు. దయాశీలురుకాన అత్యంతము శిశువగు మాపుత్రునిపట్ల అనుగ్రహముచూపుడు. సంసారయోగ్యుడు, యువకుడు, సంతానకరుడునగు మాపుత్రునిరక్షించి, మావంశమును నిలబెట్టుడు వంశోద్ధారకుడైన శిశువుగర్భమునగల వానిని రక్షింపుడు. అన్నమును ఆరోగ్యమునొసంగు మాతల్లిని, విద్యాబుద్ధులు జీవమునొసంగు మాతండ్రిని రక్షింపుడు. వారు శ్రద్ధచూపదగినవారు. ప్రతిప్రాణికిని, తనశరీరము ప్రియము. అధిధర్మసాధనము కాన దానిని రక్షింపుడు. రోగాదులచే పీడింపకుడు. ముఖ్యముగా భార్యపుత్రాదులను రక్షింపుడు. అని భక్తులు తమ కుటుంబరక్షణకై పరమశివుని ప్రార్థించిరి.

ఇక మంత్రపురశ్చరణ ఫలితములను గమనింపవలెను మూడుపవాసములు అచరించి, ఈమంత్రమును 5 వేలుజపించవలెను. దానిచే స్వజనరక్షణ జరుగును. అందులకుగాను నేతితోగలిపినయవలను దిలలను, 10వేలు హోమముచేయవలెను. నేతిలో ముంచి, 10 వేలు రావిసమిధలను హోమము చేయవలెను. ప్రతిసంవత్సరము ఆర్ద్రానక్షత్రయుక్తకాలమున 10 వేలు హోమముచేసినచో దనయొక్క స్త్రీబాలవృద్ధజనులకు శాంతిజరుగును. ఇతరవిషయములశాంతికిని 10 వేలజపమేచేయవలెను. రాజు తన అంతఃపురజనాభివృద్ధికి ప్రతిమాసమున ఈమంత్రముతోడనే ఆర్ద్రానక్షత్రకాలమున హోమముచేయవలెను. అందువలన శాంతియులభించును.

ధ్యానము:-

శ్లో॥ బాలేందుమకుటందేవంతరుణాదిత్యవిగ్రహం।
ధ్యాయేన్నందీశ్వరాకారంగణేశ్వరసమావృతమ్"

తాత్పర్యము:-

బాలచంద్రుని మకుటమున దాల్చినట్టియును, మధ్యాహ్నకాలపు సూర్యుని వలె మెఱయు శరీరముకలవాడును, స్వయంప్రకాశమానుడును, నందికేశ్వరాకారముకలవాడును, గణాధిపతులతోఁగూడినట్టి దేవుని ధ్యానించవలెను.

-: 6. వ. ఋక్కు :-

మానస్తోకేతనయేమాన ఆయుషిమానో గోషుమానో అశ్వేషురీరిషః।
వీరాన్మానోరుద్రభామితోఽవధీర్హవిష్మంతో నమసావిధేమతే॥

అర్థము;

హేరుద్ర = ఓరుద్రుడా! నః = మాయొక్కతోకే = సంతానమునందును దయచూపి మారీరిషః = హింసింపకుము నః = మాయొక్క, ఆయుషి = ఆయుర్దాయము విషయమై, మారీరిషః = హింసింపకుము అనగా ఆయువును తగ్గింపకుము నః = మాయొక్క గోషు = గోవులందును, నః = మాయొక్క అశ్వేషు = గుఱ్ఱముల విషయమై, మారీరిషః = హింసను ఆచరింపకుము. భామితః = క్రుద్ధుడవై, నః = మాయొక్క, వీరాన్ = వీరులను, భృత్యులను, మావధీః = వధింపకుము వయం = మేము, హవిష్మంతః = హవిస్సుగలవారమై, తే = నీకు నమసా = నమస్కారముతో, విధేయ = సేవించెదము.

తాత్పర్యము:-

సా భా:— మహాదేవ! మేము నిన్నాశ్రయించియున్న జీవులము. కావున నీవు మాసంతానమును, వంశోద్ధారకుడైన మాపుత్రుని హింసింపకుము. మా ఆయుర్దాయమును తగ్గింపకుము మాగోవులను మాగుఱ్ఱములను హింసింపకుము నీక్రోధము అణుశక్తి. ఆగ్రహించి దానితో మావీరులను, సేవకులను హింసింపకుము మేము నిత్యము హవిస్సులను సమర్పించుచునిన్ను సేవించుచున్నాము.

శివ + విష్ణు:-

భ. భా. భా:— ఈ మంత్రమునకు భగవంతుడేఋషి. జగతీఛందస్సు దేవుడును భగవంతుడే. శివకేశవులారా! మీరు రుద్రులు. మీరు మాసంతానమును పుత్రపౌత్రులను, రోగాదులచే గృశింపజేసి, హింసింపకుడు.

"ఆయుష్షొడశవర్షశతంప్రహ, షోడశం వర్షశతమజీవత్। ప్రహ షోడశం వర్షశతంజీవతి" "సప్తవింశత్యధికాని శతంవర్షాణి" "ఇత్యేకే" "శతమేవ" "ఇత్యన్యే" అనెడి ఛాందోగ్యాదిశ్రుతులచే నూరుసంవత్సరములకు దక్కువకానిది ఆయుఃప్రమాణమనితెలియుచున్నది. అట్టి ఆయుర్దాయమును తగ్గనీయక కాపాడుడు. అహోరాదులనొసంగుగోమహిష్యాదులను, యుద్ధప్రయోజనములకుపయోగపడు అశ్వగజాదులను హింసింపకుడు మావీరులుకాని, మాప్రజలుకాని ఏవేని అపచారములనుగావించినను క్రోధమందక రక్షింపుడు. మీక్రోధముతగ్గించుటకై మేము పురోడాశాది హవిస్సులను సమర్పించుచున్నాము. నమస్కరించుచున్నాము; సేవించుచున్నాము. కావున మీరు ఎల్లపుడు మమ్ములను రక్షింపుడు.

ఈమంత్రమునకు జెంపిన పురశ్చరణమును గమనింపుడు కృచ్ఛ్ర వ్రతమాచరించి, ఉదుంబరపాత్రతో కపిలగోవు నేతినిదీసి, వేయిసార్లు మంత్రించవలెను. పిమ్మట మధించితీసిన అగ్నిలో 8 వేలహోమమును, మహా వ్యాహృతులతో సమర్పింపవలెను. హోమశేషమును భక్షించి మూడు రాత్రులు ఉపవాసముచేయవలెను. పిమ్మట చరుభక్షణముచేసి 50 వేలు జపముచేయవలెను దీనినాచరింపజేయుగురువునకు ఐదు రాణెములనొసంగవలెను ఈవిధముగాఁజేయుటచే రాజులు ఆయుస్సునొందుదురు. నిత్యముచేసినట్లే రాజు మధించిన అగ్నిలో కేవలమునేతితోతడిపిన నూవులతో 10 వేలు హోమము చేయవలెను. ఎనమండుగురు విప్రులు ఎనిమిదిదిక్కులందును 8 వందలసార్లు అభిమంత్రించిన భస్మను జల్లి రాజునురక్షింపవలెను. శ్వేతకమలములను (తెల్లతామరపూవులను) దధిమధుఘృతములతోఁదడిపి 10 వేలు హోమము చేయవలెను. రుద్రరూపులును మంత్రసిద్ధను సద్యస్సిద్ధులునగు పదునొకండుగురు విప్రులచేఁ బైనఁజెప్పినపనిచేయించవలెను అట్లైనో దక్షణమే సిద్ధినొందుదురు. ఆచార్యునివలన మంత్రోపదేశముపొంది, మూడు రాత్రులుపవసించి, నిరంతరజపముచేసినచో రాజుయొక్క రాజ్యశ్రీవృద్ధి నొందును. నేతితోఁదడిపిన దూర్వాలు 10 వేలు పైవిధమున జపించిన పిమ్మట హోమముచేసినచో రాజు చిరంజీవియగును. పైవిధమున జపించిన పిమ్మట బంగారుతో వెండితో రాగితోఁ జేయబడిన కలశలను 8 వేలో, 8 వందలో నీటితోనింపి, అభిమంత్రించి గంధాదులతో ఆరాధించి వానిపై నూతన వస్త్రములనుగప్పి, ఇతర మంగళకార్యములనాచరించి, ఆచార్యుడు రాజు జన్మదినమున ఆతనికి స్నానముచేయించి, పూజింపఁజేసినచో ఆమహా రాజుశారీరకదోషములతోడను మహాపాతకములతోడను విముక్తుడగును. రాజుగారి అభివృద్ధికొఱకు నిత్యము ఒక విప్రునిచే 8 వేలు జపముచేయించవలెను. రాజుగారి ఆయుధవాహనశాలలందును రత్నాకరాదులందును, ప్రతిమాసమున సౌమ్యనక్షత్రమున శాంతిచేయించవలెను. అశ్వత్థసమిధలను, అపామార్గ

సమిధలను దధిమధుఘృతములతోఁ దడిపి, 10 వేలు హోమము చేయించినచో ఆయుస్సు గడిచినవానికిని ఆయుష్షు వృద్ధిచెందును జూదమునందుగాని, వ్యవహారమునందుగాని ఈ మంత్రమును జపించినచో రాజు ఓటమిని బొందడు. మూడు రాత్రులుపవసించి, నిరంతర జపమాచరించి, చరు భోజియై తేనెతోఁ దడిపిన బిల్వఫలములను 10 వేలు హోమము చేసినచో వేల కొలది బంగారు నాణెములు లభించును. దధిమధుఘృతములతోఁ దడిపిన తెల్ల కలువలను 10 వేలు హోమము చేసినచో చక్కని కన్య లభించును. ఈ మంత్రమును 1 సంవత్సరము జపించి, చరుభోజియై కపిలగోవు ఘృతముతో అగ్నిలో నిత్యమువలె 8 వేలో, 8 వందలో ఆహుతులు సమర్పించినచో సకల మహాపాతకములనుండి ముక్తుడగును. ఈ మంత్రముతోడనే రక్తచందన గంధమును అభిమంత్రించి, లలాటమున ధరించినచో సర్వులును వశ్యు లగుదురు. అపామార్గసమిధలను 8 వేలు ప్రతి జన్మదినమున హోమముచేసి నచో అపమృత్యువు తొలగును వర్షము కురియుటకుగాను సూర్యుని 10 వేల జపాపుష్పములతో ఆదివారమునాడు ఆరాధించి, ఎఱ్ఱని తలపాగను వస్త్రము లను, గంధమును దాల్చినచో భగవంతుడైన ఆదిత్యుడు మహావృష్టి కురిపించును దూరదేశము పోవువాడు దశశర్కరలను గ్రహించి, 8 వేలు అభి మంత్రించి, 10 దిక్కులందు జల్లిపోయినచో, క్షేమముగా నున్నవాడై ఇల్లు చేరును నిర్విఘ్నముగా మహాకార్యమాచరింపఁదలచినవాడు, 10 వేలు జపము చేసినచో అనాయసముగా అక్కార్యమును బూర్తిచేయఁగలడు పుత్రకాముకుడు ఈమంత్రము పఠించుచు నేతితో 1లక్ష హోమము చేసినచో వంశకరుడైన పుత్రుని బొందును. సర్వత్ర విజయము పొందును. దేవుని మంత్ర ప్రభా వము వలన సాక్షాత్తు సిద్ధులైన వారికే ఇవి ఫలించును సిద్ధులుకానివారికి వృథాప్రయాసమే జరుగును.

ధ్యానము:-

శ్లో॥ దధానమే కాదశధా విభక్త
దేహం విశుద్ధ స్ఫటికప్రకాశం।
తేజోనిధిం శూలిన మిందుమౌళిం విచింతయే
త్ర్యతన దైవరుద్రమ్॥

తాత్పర్యము:-

పరమేశ్వరుడు పరిశుద్ధమైన స్ఫటికపుఁగాంతి కలవాడు. పదునొకండు విధములుగా విభజింపఁబడిన దేహము కల్గియున్నవాడు. అతడు తేజస్సునకు నిధి. శూలము చేతగలవాడు. చంద్రుడు కొప్పుయుఁడపై గలవాడు. అట్టి రుద్రుని సదా ధ్యానింపవలెను.

-: 7. వ. ఋక్కు :-

"ఆరాత్తే గోఘ్న ఉత పూరుషఘ్నే క్షయ
ద్వీరాయ సుమ్న మస్మేతే అస్తు।
రక్షాచనో అధిచ దేవ బ్రూహ్యథాచనః
శర్మ యచ్ఛద్వి బర్హాః॥"

అర్థము:-

గోఘ్నే = గోవులనుజంపునట్టియు; ఉత = అంతేకాదు; పూరుషఘ్నే = పుత్ర పౌత్రాది పురుషులను సంహరించినట్టియును; క్షయద్వీరాయ = నశింపఁ జేయఁబడిన సేవకులు కల్గినట్టి; తే = నీయొక్క, ఉగ్రరూపము; ఆరాత్ = దూరమున; అస్తు = ఉండుగాక; సుమ్నం = సుఖకరమగు; తే = నీయొక్క రూపము; అస్మే = మాయందు; అస్తు = ఉండుగాక; కించ = ఇంతేకాదు;

నః = మమ్మెలను; రక్ష = అన్నివిధములఁ గాపాడుము; కించ = ఇంతేకాదు; హే దేవ = ఓ ప్రభూ; అధిబ్రూహి = వమ్మెలను ఇతరులకంటె అధికులుగ జెప్పుము. అథాచ = ఇంతేకాదు; ద్విబర్హాః = రెండులోకములను వృద్ధిచేయు నీవు; శర్మ = సుఖమును; దేవా = ఒసంగుము.

తాత్పర్యము:-

సా. భా :— మహాదేవ! నేరముచేయు శిశువులను, పురుషులను, వీరులను, సేవకులను నీవు సంహరింతువు. మంచిచేసినవారిని రక్షింతువు సంహరించు నీ శరీరమును మాకు దూరముగా ఉంచుము. ఆ నీ శరీరమునే "ఘోర" అందురు. శివసంజ్ఞకల్గి అందఱికిని సుఖమును జేకూర్చు నీ శరీరమును మా పట్ల ఉపయోగించుము. మమ్మెలను రక్షించుము, ఇతర యజమానులకంటె గొప్పవారినిగ దేవతలచెంతఁ జెప్పుము. దేవభూలోకములరెంటిని వృద్ధిచేయు నీవు మాకు సుఖము చేకూర్చుము.

శివ + కేశవ:-

భ. భా. భా :— "ఆరాత్తే" అను మంత్రమునకు ఋషి అత్రి. త్రిష్టుప్పు ఛందస్సు. శంభుడు దేవత. కేశవ! మహాదేవ! మీకు గోవులను, ఋరుషులను హింసించుటచేఁ గల్గిన తృప్తిని దూరముగా ఉంచుడు. అనగా వారిని హింసింపకుడు. దుష్టులను హింసించుచుఁ గ్రీడింపుడు. వీరులను హింసించుటలో మీకుఁగల్గు తృప్తిని మాపట్ల ఉంచుడు. అనగా హింసింపకుడు. అందులకే మిమ్మ నమస్కరించుచున్నాము. గోవులను, ఋరుషులను సంహరించు నీ రూపములను మాత్రము మాకుఁ జూపక దూరముగా ఉంచుడు. క్షయద్వీరులు అనగా మీలో నివసించు ప్రజలు. వారిపైఁజూపు అనుగ్రహమును మాపైఁ జూపుడు. వారినివలె మమ్మెలను రక్షింపుడు. భయంకరులును, భయనాశనులును మీరేకావున "భయపడకుడు జీవులారా!" అని పల్కుడు. భక్తులమగు మాకు సుఖమొసంగుడు. ఇహలోకపరలోక ప్రసిద్ధ సుఖమును జేకూర్చువారు

కావున మీరు ద్విజశ్రేష్ఠులైరి. కాన మాకు ఇహపరసుఖముల నొసంగుడు; అని భక్తులు శివకేశవులను ప్రార్థించిరి.

పురశ్చరణము :—

మూడు రాత్రులుపవసించి, జపము చేసినచో పురశ్చరణము పూర్తియగును. ఆయుష్కాములే ఇట్లు చేయవలెను "శతాయుః పురుషః" అను శ్రుతి ఈవిషయమునే తెల్పును. ఇట్లు చేసినచో, ఇహజన్మలోను జన్మాంతరమునను ఆయుఃక్షయమగునట్లుచేయు బాలగ్రహాదులు నశించును యజమానికి ఆయుర్వృద్ధి జరుగును. నిత్యమువలె ఈ మంత్రము పఠించుచునే స్వాగ్నిలో నేతితో 8వేలో, 8వందలో ఆహుతులను హోమము చేయవలెను. దధిమధుఘృతములతో తడిపిన దూర్వాలతో 8వేలు హోమము చేయవలెను. స్వజన్మ నక్షత్రదినమున నిత్యము 8 వేలు జపము చేయవలెను. విశేషించి ఆర్ద్రానక్షత్రమున ఆపని చేయవలెను. ప్రత్యార్ద్రా నక్షత్రమునందును దధిమధుఘృతములతో తడిపిన దూర్వాలను, దుచ్చున పుల్లలనుజమ్మి పుల్లలను, నూవులను ప్రత్యేకముగా పదివేలు ఆహుతులతో హోమము చేయవలెను. రాత్రియందు పూర్ణముగా 5వేల జపమొనర్చి, 5వేల ప్రదక్షిణములు చేయవలెను. రాజు తన జన్మదినమున దూర్వాపామార్గాదులను ప్రత్యేకముగా పదివేలు చొప్పున హోమము చేయవలెను ఇట్లు చేసినచో రాజు దీర్ఘాయుష్మంతుడగును. శక్తిహీనులు ప్రవాహమున హోమము చేయవలెను. మిక్కిలి శక్తిలేనివారు జపము మాత్రము చేసినచాలును తేనెతోడను నేతితోడను తడిపిన శుద్ధ తండులములతో హోమము చేసినచో ఆయుర్వృద్ధి జరుగును. ఈ మంత్రముతోడనే మహాదేవుని శిరస్సున అర్కపుష్పములతో (జిల్లేడు పూవులతో) 10వేల సార్లు పూజించినచో యజమాని సంపద వృద్ధినొందును. ఆలయము పశ్చిమ ద్వారముచెంత పరుభోజియై, అథర్వాయియై బ్రహ్మచర్యముతో వేయిజపము చేసినచో సప్తజన్మములందునను శతాయుష్మంతుడగును. శక్తిలేనివాడు భిక్షాహారము తీసికొనుట ప్రశస్తము.

ధ్యానము :—

శ్లో॥ కర్పూరం సన్నిభౌదేవ్యాదేవమానందతాండవం।
హుతాశనధరంధ్యాయేత్, తప్తకాంచన సన్నిభమ్॥

తాత్పర్యము:-

దేవి చెంతను ఆనందతాండవము చేయునట్టియును, అగ్నిని నేత్రమున ధరించినట్టియును, అప్పుడే కరిగించిన బంగారముతో సమానచ్ఛాయగల మహాదేవుని ధ్యానింపవలెను.

-: 8 వ. ఋక్కు :-

"స్తుతిశ్రుతంగర్తసదంయువానం మృగన్నభీమముపహత్నుముగ్రం।
మృడాజరిత్రే రుద్రస్తవానో అన్యంతే అస్మన్నివపంతుసేనాః॥

అర్థము:-

"ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేఽర్జునతిష్ఠతి" అను గీతాస్మృతిలో సర్వ ప్రాణుల హృద్దేశమున ఈశ్వరుడు కలడని అర్జునుని గూర్చి కృష్ణభగవానుని చే జెప్పబడెను. అందుచే గర్తసదం = గుహానుబోలిన హృదయ పద్మమున సర్వదా ఉండునట్టియును, యువానం = నిత్యము యువకుడైనట్టి యును, భీమం = భయంకరమైన, మృగంన = సింహమునువలె, ఉపహత్నుం = ప్రళయకాలమున సర్వజగత్తును నశింపజేయుటకు, ఉగ్రం = భయంకరు డైనట్టియును, శ్రుతం = ప్రసిద్ధుడైన రుద్రుని, హే మదీయవచః = ఓ నాదగు వాక్కా!, స్తుహి = స్తోత్రముచేయుము, ఓ రుద్రస్తవానః = మా వచనముచే స్తుతింపబడినవాడవై, జరిత్రే = ప్రతిదినము నశించు మా శరీరమునకు, మృడ = సుఖము చేకూర్పుము, తేసేనా = నీసేనలు, అస్మత్ = అన్యుడగు శత్రువును, నివపంతు = నశింపజేయునుగాక. ఇందలి నకారము, 'వంటి, వలెను,' అను నర్థమును దెల్పును.

తాత్పర్యము-

సా. భా :— భగవంతుడు శివుడు. యంత్రములనువలె, సర్వభూతములను చలింపజేయుచు, సకలప్రాణుల హృత్పుండరీకమున (హృదయపద్మమున) గలడు. ఏనుగును సంహరించుటకు సింహమువలె ప్రళయకాలమున సకల జగంబులను సంహరించుటకు, భయంకరుడైయున్నాడు. సకల వేదములందును ప్రసిద్ధుడైయున్నాడు అట్టి పరమేశ్వరుని, ఓవాక్కా! కొనియాడుము నిత్యము యువకుడవై మాచేఁ గొనియాడఁబడుచుఁ, ప్రతిదినము క్షీణించు మా శరీరమునకు సుఖమును జేకూర్పుము. నీ సేనలు మా శత్రువులను సంహరించును గాక.

శివ + కేశవ :—

భ. భా. భా :— ఈ మంత్రమునకు ఋషి వైయాఘ్రుడు. త్రిష్టుప్ఛందస్సు. రుద్రుడు దేవత. శివకేశవ రూప విగ్రహము అత్యుగ్రము కాన భయముతో దేవుని మంత్రపూర్వార్ధమున పరోక్షునిజేసి కొనియాడెను.

శివకేశవులారా! మిమ్ములనుగూర్చి అంతరాత్మ ప్రబోధము గావించుకొనుచు మనసారాకొనియాడుచున్నాను. శివకేశవులమహిమ శ్రుతిప్రసిద్ధము. వారు గర్తసదులు. గర్తమనగా రథము. త్రిపురాసుర ధ్వంస సమయమున మహాదేవుడు రథమధిష్ఠించియుండెను. మహావిష్ణువు, శ్రీరాముడై మహేంద్రునిచేఁ బంపఁబడిన రథమధిష్ఠించి, రావణుని సంహరించెను. అందుచే శివకేశవులు గర్తసదులు. అంతేకాదు, హృదయాన్తరమును గర్తమందురు. శివకేశవులు జ్యోతీరూపులై ప్రాణుల హృదయాభ్యన్తరములందుండిరి. "గిరతి = కవలయతి విశ్వమ్ అను వ్యుత్పత్తి ననుసరించి చూచినచో, గర్తమును = విశ్వమును ఆవరించి శివకేశవులు సకల వస్తువులందుండిరని తెలియుచున్నది. విశ్వమంతటినిఁ దేజస్స్వరూపులై శివకేశవులు ఆవరించియుండుటచే గర్తసదులైరి. "గిర్తస్తే = అగ్నినా భస్మస్తే ప్రజాః అత్రశ్మశానే"

అను వ్యుత్పత్తిచేఁ బ్రాణత్యాగానన్తర సమయమున సకల ప్రజలును శ్మశానమున అగ్నిస్వరూపుడైన శివునిచే భక్షింపఁబడుదురు. అనగాఁ గైకొనఁబడుదురు. యుద్ధమున అగ్నిస్వరూపుడగు విష్ణువుచే రాక్షసులు భక్షింపఁబడుదురు. (సంహరింపఁబడుదురు.) అందుచే హరిహరులు గర్తసదులైరి. శబ్దవంతమైన ఆకాశమును గర్తమందురు. ఆకాశస్వరూపుడైన శివుడు ఆకాశమున వాయుస్వరూపుడై యుండగా విష్ణువు అందు సూర్యస్వరూపుడైయుండెను. అందుచే హరిహరులు గర్తసదులైరి. "యువాపి తాన్వపారుద్ర వీషామ్" అను మంత్రమున జీవులకు రుద్రుడు తండ్రియైయున్నట్లు చెప్పుటచే ఆతడు నిత్య యువకుడాయెను. అట్లనే విష్ణువును యువకుడై రావణాదులను సంహరించి, పితా — సద్గతి ప్రాపకుడు అయెను. మృగరాజైన సింహమువలె జీవప్రభువైన శివుడు భయంకరుడైయుండగా "మృగాణాంచ మృగేన్ద్రోఽహమ్" అను గీతాసూక్తిలోఁ జెప్పినట్లు విష్ణువును భయంకరుడాయెను. శివుడు దుష్టులను సంహరింప నుద్యుక్తుడైయుండగా, విష్ణువు శత్రువులైన రాక్షసాదులను సంహరింప నుద్యుక్తుడాయెను. మృత్యువునుజయింప శివుడు సన్నద్ధుడైయున్నట్లు దుష్టులనడంప విష్ణువు సన్నద్ధుడైయుండెను. శివకేశవు లిరువురును దుర్మార్గులకు మృత్యుసదృశులే. ఇట్లు దేవ సంకీర్తనముచే భయము తొలగించుకొని, భక్తులు హరిహరులను ప్రత్యక్షమొనర్చుకొనుచున్నారు. కావున జీవుడా! శివకేశవులను స్తుతిచేయుము. పిమ్మట సుఖము చేకూర్చుడు తండ్రులారా! శివకేశవులారా! అని జీవులు ప్రార్థించుచున్నారు. అయ్యలారా! మేము మిమ్ములను స్తోత్రము చేయుచున్నాము కావున జరిత్రులము. మీరు స్తోత్రము చేయఁదగినవారు. మీరు జగత్తులకు క్షోభకల్గించువారిని మాకంటె అన్యులను సంహరింతురుగాక.

పురశ్చరణము :—

ఒక రాత్రి ఉపవసించి, మూడు రాత్రులు నిరంతరము జపించినచో పురశ్చరణము పూర్తియగును. రాజులు తమ శత్రువులకు నష్టము కల్గించుటకు

ఈ మంత్రమును జపించి, వైకంకత సమిధలు మున్నగువానితో హోమము చేయవలెను.

ధ్యానము :—

శ్లో॥ *"ఉద్యద్భాస్కరకోటిప్రకాశమాదీప్తదహనమూర్ధానం।*
అంబరనిలయం భీమంధ్యాయేదభయం శివం
సురౌఘనుతం"

తాత్పర్యము-

మహాదేవుడు ఉదయించెడి కోటి సూర్యుల కాంతి కలవాడు. బాగుగా మండుచున్న అగ్ని శిరస్సున గలవాడు ఆకాశము వస్త్రముగ నిలయముగా గలవాడు. భయంకరుడైనను అభయమొసంగువాడు. మంగళకరుడై దేవ సంఘముచే స్తుతింపబడుచున్నాడు ఆతనిని ధ్యానము చేయవలెను.

-: 4 వ. ఋక్కు :-

"పరిణో రుద్రస్య హేతిర్వృణక్తుపరిత్వేషస్యదుర్మతిరఘాయోః।
అవస్థిరామఘవద్భ్యస్తనుష్వమీఢ్వస్తోకాయతనయాయమృడయ"

అర్థము:-

రుద్రస్య = శివునియొక్క, హేతిః = ఆయుధము, నః = మమ్ములను పరివృణక్తు = పూర్తిగా విడిచిపెట్టునుగాక, త్వేషస్య = క్రోధముచే ప్రజ్వరిల్లు నట్టియును, అఘాయోః = పాపపరిహారకరూపమునుగోరు శివునియొక్క, దుర్మతిః = భయంకరమగుబుద్ధి, నః = మమ్ములను, పరివృణక్తు = విడిచి పెట్టుగాక, స్థిరా = విరోధ వినాశమునకై చెక్కుచెదరకయున్న భయంకర

బుద్ధిని, మఘవద్భ్యః = హవిస్సనెడి అన్నముతోఁగూడిన యజమానులనుండి అవతనుష్వ = తొలఁగింపుము; మీఢ్వః = భక్తుల కోరికలను అమితముగా నొసంగు రుద్రుడా! తోకాయ = మాపుత్రులకు, తనయాయ = మామనుమలకును, మృడయ = సుఖమునొసంగుము.

తాత్పర్యము-

సా. భా:— ఓరుద్రా! నీ ఆయుధము అందఱిని సంహరించును. దానిని మాపట్ల విడువకుము. మమ్ములను దానితో బాధింపకుము. నీక్రోధము మహోగ్రము. క్రోధముతో విజృంభించునీవు మాపాపములను బరిహరించుటకు ఆక్రోధమును ఉపయోగింపుము. భయంకరమగునీబుద్ధిని జీవులపాపములను నశింపఁజేయుటలో ఉపయోగించుము. ఉగ్రమైన నీబుద్ధివిరోధులను నశింపఁజేయునుగాక. నిత్యముమీకై యాగములనొనర్చుచు, హవిస్సును భజించు యజమానులనుండి నీయుగ్రబుద్ధిని మఱల్చుము మేఘమునీటినివర్షించునట్లు సర్వులకోర్కెలను దీర్చునీవు, మాపుత్రులను, మనుమలను రక్షించి, వారికి సుఖముచేకూర్పుము.

శివ + కేశవః-

భ. భా. భా:— ఈమంత్రము త్రిష్టుప్ఛందస్సునకుజెందినది. పరమేశ్వరుడే దీనికి ఋషియును, దేవతయునైయున్నాడు. ఇందుఁ జెప్పఁబడిన విగ్రహములుకూడ పూర్వమువలె ఉగ్రరూపములగుటచే పరోక్షముగాను ప్రత్యక్షముగాను జేయఁబడినప్రార్థనమిందుఁగలదు. అర్థముక్కనకు ఒక్కటిచొ॥న వాక్యభేదమునుగలదు. మూడగ్నులను మూడు శిఖలుగాఁగల త్రిశూలము మహాదేవునాయుధము. అదిజీవులమగు మమ్ములనుబాధింపక విడిచిపెట్టవలసినదిగాఁబ్రార్థించుచున్నాము. అగ్నిరూపమైనవిష్ణుచక్రము

జీవులను బాధింపక విడిచిపెట్టవలసినదిగా విష్ణువును ప్రార్థించుచున్నాము. నాదరూపమగు హుంకారము క్రోధము. దానితో మహాదేవుడు విజృంభించును అట్లనే నాదధ్వనియగు శంఖమును పాంచజన్యమును బూరించుచు విష్ణువు విజృంభించును వారిరువురును పాపకారులైన పురుషులకు వ్యసనములు కల్గ జేయుదురు. వారు నిగ్రహాత్మకబుద్ధితో భక్తులసుగుమాట్ల అనుగ్రహము చూపుదురు కాక. మేము పాపాత్ములముకామని ప్రార్థించుచున్నాము పరమ శివా! స్థిరమైన నీధనుస్సును పినాకమును, మహావిష్ణూ! స్థిరమైన నీధనుస్సును శార్ఙ్గమును మాపైగురిపెట్టక విడువుడు. మేము శైవవైష్ణవయాగాగ్నులందు హవిస్సురూపముననున్న ధనమును విడుచుచున్నాము కావున మమ్ములను హింసింపకుడు. మీరు భక్తులకోర్కెల దెల్లించువారు కావున మీధ్వులు అగు చున్నారు. మీరు మాపుత్రులకును, మనుమలకును సద్బుద్ధిచేకూర్చి సుఖ మొసంగుడు.

పురశ్చరణము :—

పుత్రకాములు ఈమంత్రమును ప్రతిదినము 8 వేలు గుప్తముగాజపించ వలెను. పలాశఖదిరసమిధలను దధిమధుఘృతములతోదడిపి, శివాలయపు దక్షిణద్వారమున అగ్నిలో 10 వేలుహోమముచేసినచో శివసదృశపుత్రుడు లభించును, దేవాలయమున అశ్వత్థవృక్షపునీడలోగాని, ఆత్మగృహమునం గాని, గోశాలలోగాని, ఆర్ద్రానక్షత్రయుక్తమగు అమావాస్యనాడుగాని, కృష్ణ పక్షాష్టమినాడుగాని జపమారంభించవలెను. దంపతులు ముందురోజున చరు భోజనులుకావలెను. జలపూర్ణకలశలకు దారమునుజుట్టి, అందుంచివాని నడుమను ఉన్నతకుంభముంచి, దానియందు సోముని ఆవాహనమొనర్చవలెను. గంధాదులతో బూజింపవలెను. మధ్యకలశమునుండి ప్రతికలశమునందును ఒక్కొక్క మంత్రాక్షరముంచవలెను. పిమ్మట 9 వేలు జపమొనర్చి మధు ఘృతములతో దడిసినలాజలను 8 వేలుహోమముచేయవలెను. పిమ్మట మొదటికలశను ముగైకొని, అక్షరరూపుడైన భగవంతునిస్మరించుచు స్నానము

చేయించవలెను. 8 వేలు లేక 8 వందలు విప్రులకు భోజనము పెట్టవలెను. పిమ్మట గలశలను, వస్త్రములను, వ్రీహులను, 5 బంగారు నాణెములను ఆచార్య నకు ఒసంగవలెను. అట్లుచేసినచో దీర్ఘాయుష్మంతుడైనట్టియు, వంశకరుడైన పుత్రుడు కల్గును.

ధ్యానము:-

శ్లో॥ గజచర్మావృతతనుం స్ఫురత్ ప్రహరణోజ్జ్వలం।
సర్వపాపహరంధ్యాయేత్, దేవంకుంజరభేదినమ్॥

తాత్పర్యము:-

గజచర్మముచే ఆవరింపఁబడిన శరీరముకలవాడును, స్ఫురించుచున్న ప్రహరణముచే ఉజ్జ్వలమైనవాడును, సర్వపాపములను బరిహరించువాడును, గజాసురభేదియునగు మహాదేవుని ధ్యానింపవలెను.

-: 10. వ. ఋక్కు :-

"మీఢుష్టమశివతమశివోనస్సుమనాభవ। పరమేవృక్షఆయుధం। నిధాయకృత్తింవసానఆచరపినాకంబిభ్రదాగహి।"

అర్థము:-

హేమీఢుష్టమ = అతిశయముగా వర్షించితడుపువాడా! కామముల నొసంగువాడా! హేశివతమ = మిక్కిలిశాంతమైన స్వరూపముకలవాడా! నః = మమ్ములనుగూర్చి, శివః = శాంతుడవును, సుమనాః = మంచిమనస్సు తోడను, స్నేహముతోడనుగూడినవాడవు, భవ = అగుము. ఆయుధం = త్రిశూలాదికమును, పరమే = అత్యున్నతమైన, వృక్షే = మఱ్ఱి, రావిమున్నగు

వృక్షజాతమునందును, నిధాయ = ఉంచి, కృత్తింవసానః = వ్యాఘ్రచర్మమును మాత్రమువాల్చువాడవై, ఆచర = మాకెదురుగారమ్ము పినాకం = పినాకమనుధనుస్సును, బిభ్రత్ = హస్తమున ధరించుచు, ఆగహి = రమ్ము.

తాత్పర్యము:-

సా. భా:— మహాదేవ! నీవు బ్రహ్మాండమున అత్యధికముగా వర్షము కురిపించుటేకాక, జీవులకమితముగాఁ **గోరిక**లనొసంగెదవు నీవు మిక్కిలి శాంతస్వరూపుడవుకాన భక్తులమగు మాకట్టి శాంతుడవుకమ్ము నిర్మల మనస్కుడవై మాయెడల స్నేహముతోనుండుము. త్రిశూలమున్నగు నీయాయుధములను, మాకుఁగానరాకుండ అత్యున్నతములైన వటాశ్వత్థాది వృక్షములపైనుంచుము. వ్యాఘ్రచర్మవసనుడవై, మాకభిముఖముగారమ్ము. వచ్చునపుడు పినాకమను ధనుస్సును హస్తమున అలంకారముగా దాల్చుము బాణాదికములను విడిచిరమ్ము.

శివ+విష్ణుః

భ. భా. భా:— పైమంత్రమునకు, వైరాజఋషి. మూడు, నాల్గు, ఐదు, ఎనిమిది, పన్నెండు అక్షరములుగల, త్రిష్టుప్ఛందస్సులలో, పంచపదత్రిష్టుప్ఛందస్సులో ఇదికలదు. శివుడు దీనికిదేవత. విష్ణువు ఇంద్ర రూపుడై ప్రేరేపించగా శివుడు పర్జన్య రూపుడై వర్షము కురిపించును. హరిహరులు లోకసుఖంకరులు. దేవ! రూపద్వయముతో మావాడవై మంగళకరుడవగుము. నీవుజీవులపట్ల సౌమనస్యముతో నుండుటయేకాక మామనస్సును సైతము శోభనమైనదిగానుంచుము.

శ్లో॥ "మూలతో బ్రహ్మరూపాయ, మధ్యతో విష్ణు రూపిణే
అంతతశ్శివరూపాయ, వృక్షరాజాయతే నమః"

అని నిత్యము జనులు ప్రార్థించుచు, రావిచెట్టునకట్టును ప్రదక్షిణము లు చేయుదురు. రావిచెట్టు త్రిమూర్తిస్వరూపము. కావున హరిహరస్వరూపా! దేవా! నీయాయుధములైన త్రిశూలసుదర్శనచక్రాదులను దానిపైవాచి, మాకు క్షేమము చేకూర్చుము అందుంచిన నీయాయుధములు మాకుగానరావు. దూర ప్రదేశమున దృష్టికిగానరాకుండు వృక్షములందైనను నీయాయుధములను దాచుము. దేవా! శివస్వరూపుడవై, వ్యాఘ్రచర్మమును, విష్ణు స్వరూపుడవై కృత్తిని అనగా ధరింపదగిన పీతవస్త్రమునుదాల్చి, భక్తులమగు మాయభి ముఖమునకురమ్ము. దర్శనమొసంగుము. నీపినాకమునుగాని, శార్ఙమునుగాని జ్యాబాణరహితముగావించి, హస్తాలంకారముగాదాల్చి, దర్శనమొసంగుము; రక్షింపుము; అని హరిహరాత్మకమైన దైవమును భక్తులు ప్రార్థించిరి.

పురశ్చరణము:—

ఉపాసకులు ఈ మంత్రమును ఏకరాత్రదీక్షగా 15 వేలు జపముచేయ వలెను. కేవలమునేతితో 5 వేలు అహుతులను అగ్నిలోహోమము చేయవలెను అట్లుచేయుచో ధన నాశభయము, ప్రాణభీతి, మహావిపత్తుచోరాదిభయమును దొలగ పోవును.

ధ్యానము:—

శ్లో॥ మంగళాయతనందేవం యువానమతి సుందరం।
ధ్యాయే ద్వనచరాకార మాగచ్ఛన్తం పినాకినమ్॥

తాత్పర్యము:—

శివకేశవ స్వరూపుడైన దేవుడు మంగళములకు నిలయమైనవాడు. యువకుడు, అతి సుందరుడు అతడు తపముజేయు అర్జునునకు శివాంశమగు వనచర రూపమున (కిరాతరూపమున) ప్రత్యక్షముఅయెను భూమిని కాపగా

చుట్టు హిరణ్యాక్షుని సంహరింప కేశవాంశగల వనచరమైన వరాహము యొక్క రూపమునఁ గానవచ్చెను, శివరూపమునఁజేత పినాకమును ధనుస్సునఁదాల్చెను. విష్ణు రూపమున శార్ఙ్గమను ధనుస్సును చేతఁ దాల్చెను హరిహరాత్మకుడైన దేవుని ఈ విధముగా ధ్యానించవలెను.

-: 11 వ. ఋక్కు :-

"వికిరిదవిలోహిత నమస్తే అస్తు భగవః।
యాస్తేసహస్రగ్ం హేతయోఽన్య మస్మన్నివపంతుతాః

అర్థము:-

వికిరిద = విశేషముగా భక్తులసన్నిధిని బహువిధముల ధనరాసులను జిమ్మి ఒసగువాడా! విలోహిత = తెల్లనివాడా! లేదా, మిక్కిలి ఎఱ్ఱనివాడా, హే భగవః = ఓ భగవంతుడా! తే = నీకు, నమోఽస్తు = నమస్కారమగు గాక తే = నీకు యాః = ఏ! హేయతః = ఆయుధములు, సహస్రింగ్ం = వేలకొలదికలవో, తాః = వానిని, అస్మత్ = మాకంటె, అన్యం = ఇతరుడైన విరోధిని, నివపంతు = నశింపఁజేయునుగాక

తాత్పర్యము-

సా భా. మహాదేవ! సమగ్రమైన ఐశ్వర్యము, సంపూర్ణమైన ధర్మము, యశస్సు, సకల సంపదలు: జ్ఞానము, వైరాగ్యము అనెడి ఆరును గలవాడవు కావున నీవు భగవంతుడవు. అంతేకాదు, బ్రహ్మాండముయొక్క ఉత్పత్తిని, వినాశమును భూతముల యాగమనమును, వాని నిష్క్రమణమును, విద్యను అవిద్యనుఎరిగినవాడవు కావున భగవంతుడవు. నీవు భక్తుల సన్నిధిని బహువిధ ధనరాసులను జిమ్మెదవు. వారికొసంగెదవు.

"ధ్యేయోముక్తా పరాగామృతరస కవితాద్రి ప్రభః" ముత్యాల పొడివలెను, అమృతరసముతోఁ గూడినట్లును. పరమశివుడు తెల్లగా నుండును. అని మాంత్రికులు నిన్ను పంచాక్షర ధ్యానము నస్మరింతురు. "కాంచనాభో ధ్యేయః పద్మాసనః" పద్మాసనమున నున్న మహాశివుడు బంగారు రంగువాడై ధ్యానింపఁ దగినవాడు" అని -ష్టోక్షర ధ్యానమున నిన్ను స్మరింతురు కావున శివా! నీవు తెల్లగానొకప్పుడు ఎఱ్ఱగానొకప్పుడును ధ్యానింపఁ బడుచున్నావు. అనంత శక్తులుకల నీకు నమస్కారము. వేఁకొలదిగానున్న నీ యాయుధములను మాపైఁగాదు మా శత్రువులపైఁ జిమ్మి వారిని నశింపఁ జేయుమని, భక్తులు శివుని ప్రార్థించుచున్నారు.

శివ + విష్ణు :— భా. భా భా. :- విరికిద అను మంత్రమునకు బులహాడు ఋషి; శంభుడు దేవత. అనుష్టుపు చందస్సు. పరమాత్మ మహాశివరూపమున దుష్ట శక్తులపై హింసా కర్మను విశేషముగాఁ జిమ్ముచున్నాడు కిరి = అనగా హింసను ఒసంగునవి కాన ఆయుధములు కిరి + దముఃగుచున్నవి. మహాశివుడు భక్తుల పట్ల వి + కిరిదుడు = హింసింప నందున ఆయుధ హీనుడు అగుచున్నాడు శత్రు పీడకములైన ఆయుధములు యుద్ధముచేయునపుడు అతనికి ఉండవు. వి = అనేక విధముల, కిర్తి = హింసించు చున్నవి; కావున వికిరులు = వ్యాధులు, సంసారాదులును అగును. అనగా జీవులకు పాపకర్మానుభవమునకై విడువఁబడిన వ్యాధులును కర్మాను భవమునకై వినియోగింపఁబడిన సంసారాదులును వికిరులు అగును. "దో = అవఖండనే" అను ధాతువునుండి ఏర్పడిన "దః" అను పదమునకు, ఖండించు వాడని యర్థము. అనగా మహాదేవుడు తపోధ్యాన భక్తి కర్మ జ్ఞాన మార్గములననుసరించి, తనను జేరు జీవులకు పునర్జన్మ లేకుండఁ జేయునుగాన "వికిరుదుడు" అగుచున్నాడు. అటులనే పరమాత్మ విష్ణు స్వరూపుడగుచు, తనవాహనమైన వి = పక్షిచేతను, (గరుత్మంతుని చేతను) కిరి = హింసించు శత్రువులను దః = ఖండింపజేయును అంతేకాదు భూమిని

జాపగా జుట్టిన హిరణ్యాక్షుని, వి = వింతయైన, కిరి = వరాహమై, దః = ఖండించెను. కావున విష్ణువు వికిరిదుడాయెనని తెలియుచున్నది, కిరి = మేఘము. విష్ణువు పర్జన్యుడై, వి + కిరి = విశేషముగా, మేఘముఁచే, దః = లోకములకు నీటిని ఒసంగువాడు; కావున విష్ణువు వికిరదుడాయెను. "దరిద్రం నీలలోహిత; పురుషంకృష్ణ పింగళమ్" అను మంత్రములందు శివుడు నీలదేహము కొంత; లోహిత దేహముకొంత కల్గియున్నట్టు చెప్పఁబడెను. గరళ భక్షణచే ఖంఠము నీలమైనను, మిగిలిన దేహము విగతమైన, లౌహిత్యము కల్గియుండుటచే శివుడువిలోహితుడాయెను అంతే కాదు లౌహిత్యముఅనగా కాలుష్యము (మలినము) అదియేవికారము వికారమేమియును లేనివాడుకాన, పరమేశ్వరుడు విలోహితుడాయెను. యథార్థముగా కామాది వికారహేతువులేమియును శివునకులేవన్నమాట చిత్తమునకు మాలిన్యముతెచ్చు క్రోధాది వికారములు, యుద్ధేతర కార్యములందుఁ బరమేశ్వరునకు లేవన్నమాట. దుష్టులయిన రాక్షసులను సంహరించుటకుఁ దప్ప జీవులను శిక్షించుటకు మాత్రము మహాదేవుడు ఆయుధములను దాల్చడు; అని తెలియుచున్నది. పరమేశ్వరుడువలె విష్ణువుకూడ, వి = విగతమైన, లౌహిత్యము = వికారము (షడ్భావవికారములు) కలవాడు. కావున విలోహితుడాయెను. విష్ణువు ఆయాకార్యము లాచరించుటకు రామకృష్ణాది జన్మములెత్తి, వికారములు పొందినను యదార్థముగా మాత్రము అతనికి భావాదివికారములు లేవు. "పుట్టువులేని నీక భవ పుట్టుట" అను భాగవత పద్యమునఁ బోతన్న క్రీడాజన్ముడైన శ్రీకృష్ణునకు భవాది దశలు లేవని చక్కగా వ్రాసినాడు.

"జగదుత్పత్తి వినాశాదులను ఎఱుగుటయనెడి షడ్గుణములును, భగశబ్దముచే జెప్పఁబడు సమగ్రైశ్వర్యాదులును శివకేశవులను ఇరువురకునుగలవు. కావున ఇరువురును భగవంతులే అన్నమాట. ఏకిరిదుడవు, విలోహితుడవు, భగవంతుడవునగు హరిహరస్వరూపా! నీకు నమస్కారము. నీరూపుడవగు నీకు ఒక్కఆయుధమైననులేదు. కానిజగత్తులనుపసంహరించునపుడు నీకు, వేయి కాని, వేఁకొలఁదిగాఁగాని ఆయుధములుండును. వానిని, భక్తుడనగునాకంటె అన్యుడైన శత్రువును సంహరింప నుపయోగింపుము. భక్తుడనగు నాపట్ల అనుగ్రహముచూపుము; అని భక్తుడు పరమాత్మను బ్రార్థించెను.

పురశ్చరణము :—

చరుభోజియైమూడురాత్రులు పదివేలు జపముచేయవలెను జపాంతమున పదివేలు ప్రదక్షిణములుచేయుచు జపముచేయవలెను. దధిమధుఘృతములలో ముంచిన సమిధలను పదివేలుహోమముచేసినచో మహాజన విరోధము, భయము తొలగిపోవును. సకలజయముకోరువాడు అపామార్గసమిధలను కపిల గోవునేతిలో దడిపి లక్షహోమముచేయవలెను. దానిచే వరాహాదులు వశమగును. తిర్యగ్జంతువులను జయింపఁగోరువాడు దధిమధుఘృతములలోఁ దడిపిన బిల్వసమిధలను లక్షహోమము చేయవలెను. జలమధ్యమున అత్మాగ్నిని ప్రతిష్ఠించి, కపిలగోవుపాలతో లక్షహోమముచేసినచో జలప్రమాదములను బోఁగొట్టుకొనఁగలడు.

ధ్యానము:-

శ్లో॥ ప్రసన్నవదనం సౌమ్యంరచితోద్వాహమండనం।
అంబయాసహితంధాయేత్ పురసంఘైరభిష్టుతమ్॥"

తాత్పర్యము;-

ప్రసన్నముఖుడును, సౌమ్యుడును వివాహాభరణధారియును, పార్వతీ సహితుడును పురసంఘములచే స్తుతింపఁబడినట్టి పరమేశ్వరుని ధ్యానింపవలెను

-: 12 వ. ఋక్కు :-

"సహస్రాణిసహస్రధాబాహువో స్తవహేతయః,
తాసామీశానో భగవఃపరాచీనాముఖాకృధి॥"

అర్థము:-

హేరుద్ర! = ఓశివా! తవ = నీయొక్క, బాహువోః = చేతులందు, హేతయః అయుధములు సహస్రధా = వేయివిధముల, సహస్రాణి = వేలకొలది కలవు. హేభగవః = ఓభగవంతుడా! ఈశానః = సమర్థుడవగుచు, తాసాం = ఆయాయుధములకు, ముఖా = ముఖములను, శల్యములను, పరాచీనా = మాకు పరాఙ్ముఖములగునట్లు, కృధి = చేయుమా!

తాత్పర్యము-

సా. భా.- ఓరుద్రుడా! ధనుస్సు, ఖడ్గము, త్రిశూలము, మున్నగు విధమున అయుధములు అనేక విధములుకలవు. అవి నీచేతులందు వేలకొలదిగాగలవు షడ్గుణములచే భగవంతుడవైన నీవు ఏమిచేయుటకైనను సమర్థుడవే. కాన వానిని మాపట్ల విముఖములుగాఁజేయుము.

శివ + విష్ణు-

వ. భా. భా:— ఈమంత్రమునకు నారదుడు ఋషి. కణ్వుడును ఋషియే అనుష్టుప్పు ఛందస్సు. రుద్రుడు దేవత. రాజోపద్రవశాంతికై దీనిని వినియోగింతురు.

పరమాత్మ రూపాన్తరులే శివకేశవులు. "శివాయ విష్ణురూపాయ, శివరూపాయవిష్ణవే" అను మంత్రమున శివ కేశవులకు భేదములేదని చెప్పఁబడెను. ఈవిషయముననే తిక్కన సోమయాజి విరాట పర్వారంభమున వ్రాసిన

"శ్రీయనగౌరినాఁబరగుచెల్వకుఁజిత్తముపల్లవింపఁగఁ
బాయితమూర్తియైహరిహరంబగురూపముదాల్చివిష్ణురూ
పాయనమశ్శివాయయనిపల్కెడి భక్తజనంబువైదికఁ
ధ్యాయితకిచ్చుమెచ్చుపరతత్త్వముగొల్చెదనిష్టసిద్ధికై"

అను పద్యమున శివకేశవాభేదమును బేర్కొని నమస్కరించినాడు. హరిహరు లిరువురును సహస్రశీర్షులే సహస్రాక్షసహస్ర బాహువులే అను విషయము "సహస్ర శీర్షా పురుషః, సహస్రాక్షస్సహస్రపాత్" అను మంత్రమున. బేర్కొనఁబడెను. సామాన్యస్వరూపము నద్విబాహువులైనను, రాక్షససంహార సమయమునమాత్రము సహస్రబాహువులై వేలకొలదిగా ఆయుధములను జేత దాల్చెదరు. కావుననే శివకేశవులారా! మీరు సహస్రబాహువులందును సహస్రధా ఆయుధములను దాల్చెదరనియు, సర్వసమర్థులుకాన భగవంతులనియును భక్తులు కొనియాడిరి. మీరు ప్రయోగోపసంహారసమర్థులుకాన మీయాయుధము లను, మాశత్రువులపైఁ బ్రయోగించి, మాపైఁ బరాఙ్ముఖులుగావింపుడు; అనివేడుకొనిరి.

పురశ్చరణము:—

ఈ మంత్రమును 15 వేలసార్లు జపించినచో రాజోపద్రవశాంతి జరుగును. ఉపద్రవనాశమునకై శాల్మలీవైకంకత సమిధలను, వ్రీహియవతిలలను నేతితోఁదడిపి, 10 వేలుహోమముచేయవలెను ప్రధానపురుషునిమారణము తొలగుటకు దక్షిణామూర్తి సన్నిధిని లక్షజపముచేయవలెను. షష్టిమన్నుతో జేసినశివలింగమునకు అభిషేకముచేయవలెను, అనుష్ఠిననదిలోఁ బారవైచి, నదీతీరముననేతితోఁ దడిపినతండులములను అగ్నిలో 10 వేలుహోమము చేయవలెను. దుర్గమారణ్యమున సంచరించువాడు, భస్మను 18 వేలసార్లు అభి మంత్రించి, దానిని శరీరమంతటను బూసికొనివెళ్ళినచో ఏ భయముసుండదు.

రాక్షసేభ్యోఽబలిముపహరామి” రాక్షసులకు బలినొసంగుచున్నాను; అని చెప్పి కృష్ణపక్షచతుర్దశినాడు :రాత్రిశ్మశానమున మార్జాలమాంసముతో బలినొసంగినచో రాక్షసభయముతొలగును; రాజకోపహతులైనను దైవోపహతులైనను, ఈమంత్రమునుజపించిహోమముచేసినచో, రాజభయము, దైవోపద్రవములును దొలగును.

ధ్యానము :—

శ్లో॥ *సర్వపాపహరందేవంసర్వాభరణభూషితం*
సర్వాయుధధరం ధ్యాయేత్ సర్వలోకమహేశ్వరమ్”

తాత్పర్యము:-

సర్వపాపములను బోగొట్టెడివాడును, సర్వాభరణములచే అలంకరింపబడినవాడును, సర్వాయుధములనుదాల్చినవాడును, సర్వలోకములకును ప్రభువగు పరమేశ్వరుని ధ్యానింపవలెను.

—: దశమానువాకము సమాప్తము :—

-: శ్రీ రుద్రాభిషేకమాహాత్మ్యము :-

-: ఏ కా ద శా ను వా క ము :-

దశమానువాకమున ఋగ్రూపములైన మంత్రములుకొన్ని చెప్పఁబడినవి. ఈయేకాదశానువాకమున ఎనిమిది (8)ఋగ్రూపములు. మిగిలినవియజుస్సులు

-: ప్రథమ ఋక్కు :-

"సహస్రాణిసహస్రశో యేరుద్రా అధిభూమ్యాం।
తేషాగ్ంసహస్రయోజనేఽవధన్వానితన్మసి॥"

అర్థము:-

భూమ్యామధి = భూమియొక్క ఉపరిభాగమున, యే = ఏ, రుద్రాః = రుద్రులు సహస్రశః = సహస్రప్రకారులై, సహస్రాణి = సహస్రసంఖ్యాకులై, కలరో, తేషాం = ఆరుద్రులయొక్క ధన్వాని = ధనుస్సులును, సహస్రయోజనే = మాకంటె ' సహస్రయోజనములుదాటిన పిమ్మటగలదేశమున అవతన్మసి = తొలగింపఁబడిన వింటిత్రాడుగలవిగాఁ జేసిఉంచుము.

తాత్పర్యము-

సా. భా: — మహాదేవుడు తన తేజస్సును పిపీలికాది బ్రహ్మపర్యంతము గల జీవులందును, ప్రాణములేని వస్తువులందును ప్రవేశపెట్టి భూమిపై నంతటనువ్యాపింపజేసినాడు. వానిలోఁగలవారు రుద్రులే. వారు అనేక విధములుగా లెక్కలే నందఱుగానున్నారు. వారందటి చేతులందును ధనుస్సులుగలవు. అవి బాణములతోఁగూడియున్నచో లోకములకు ప్రమాదము వాటిల్లును, కాన వానిని ఎన్నియోజనముల దూరమందున్నను వింటిత్రాడు లేనివిగాఁజేసియుంచుముతండ్రీ! అని ప్రార్థించిరి.

శివ + కేశవ:-

ప. భ. భా:— "సహస్రాణిసహస్రశః" మున్నగు మంత్రములు ఈయనువాకమున అనుష్టుప్ఛందస్సులోఁగలవు. ఈయనువాకమునకు "అవతానము" అను సంజ్ఞకలదు. ఈయనువాకమంత్రములచివరను "తేషాగ్ంసహస్రయోజనేఽ వధన్వానితన్మసి" అను దానినిజేర్చిచదువవలెను. జపారంభమున, ఆద్యన్తములందు దీనినిజేర్చి చదువవలెను. నమోరుద్రేభ్యః" మున్నగు మూడుమంత్రములును యజుస్సులు. ఇటఁజెప్పిన విషయమేమన? దేవునిచేఁ బ్రార్థింపఁబడిన బ్రహ్మమహాదేవునితో సమానులైన రుద్రులను సృష్టించెను. వారు సకలస్థావరజంగమములను రక్షించుచుఁ బోషించుచు, ఉపసంహరించుచున్నారు. వారువానికిఁ గర్మానురూపమైన ఫలమునుజేర్చు చున్నారు ఆరుద్రులు బ్రహ్మాండమంతటను, వాయువు, కిరణము, మనుష్యుడు మున్నగు నానారూపములను అధివసించియుండిరి. అరుద్రులు ఇపుడు అనుగ్రహ సంపాదనకై ప్రార్థింపఁబడుచున్నారు. మఱికొందఱుచెప్పినదేమన? ఈమహాదేవుడు అను గ్రాహ్యావశమున వందలుగా, వేలుగా, లక్షలుగ దనయాత్మను విభజించి, ప్రత్యేకముగా దర్శనమొసంగుట, అభిమతములనొసంగుట; మున్నగు విధముల అనుగ్రహించుచున్నాడు. అరుద్రులు ఇట్లు అనేకరూపములతో విభక్తులైనొకలేని సంసారసాగరమున, అసంఖ్యాకులుగానుండి, జగత్తును అనుగ్రహించుటకై ప్రవర్తించుచున్నారు. వారినుద్దేశించి, ఈమంత్రములు ప్రవర్తించుచున్నవి, అనిరి, మఱికొందఱు ఇట్లుఅనిరి. సంహారకర్తయైన మహాదేవునియొక్క క్రోధాత్మ విస్ఫులింగములై ప్రాణులుగామారి, గొప్పవారమని తలంచుచు, విజృంభించి, సర్వలోకములందును సంచరించుచున్నది. వానికిఁ జెందినప్రసాదనమేఇది; అనిరి. రుద్రతుల్యులైన గణేశ్వరులందఱును రుద్రులే అని కొందఱనిరి ఆమంత్రములతో మొదటినాల్గు మంత్రములకును దుర్వాసుడు ఋషి. మిగిలిన మంత్రములకు దేవలుడుఋషి. అన్నింటికిని అనుష్టుప్ఛందస్సు. అన్నింటికిని రుద్రుడేదేవత.

పైమంత్రములలో మొదటిది "సహస్రాణి సహస్రశః" అనునది. ఇందలి రుద్రపదమునకు (1) సంహారకములు, (2) భయంకరములు (3, రుద్రతేజస్సుతో నిండినవి, (4) రుద్రాంశగలజీవులు, (5) కిరణములు (6) వాయురూపములు, (7) రుద్రగణములు, అని పెక్కు అర్థములుకలవు. "రుద్రోబహుశిరాబభ్రుః" అను విష్ణుసహస్రసూక్తిచే రుద్రపదము, శివునకు వలె విష్ణువునకును జెల్లునని తెలియుచున్నది. శివవిష్ణుశక్తులలో శివశక్తి ప్రళయసంహారకముకాగా విష్ణుశక్తి రక్షణలో దుష్టసంహారకమని తెలియుచున్నది. శివవిష్ణుతేజస్సులు రెండును భయంకరములేయని శివశిష్యుడితుడైన రావణుడును, విశ్వరూపముచూచిన అర్జునుడును గొనియాడిరి శివకేశవులు సూర్యస్వరూపులు కాన, వారులోకములను రుద్ర = తీవ్రమైనతేజస్సుతో నింపిరి. ఇరువురి కిరణములును లోకప్రకాశకములే యనువిషయము "తస్యభాసాసర్వమిదంవిభాతి" అను శ్రుతిచేఁ తెలియుచున్నది. ఇరువురును ప్రాణాపానాది వాయురూపులే. శివ విష్ణుగణములు రెండును బాపులను ఏడిపించునవే "పాదోఽస్యవిశ్వాభూతాని" అను శ్రుతిలో శివకేశవస్వరూపుడైన పరమాత్మయొక్కపాదమే సర్వభూతములని చెప్పఁబడుటచేవారు సహస్రప్రకారముల సహస్రసంఖ్యాకజీవులై భూమిపైనుండిరి. వారు ఇరువురును భూమీశ్వరులే. వారుకర్మానుకూలముగాఁ బ్రాణులను అనుగ్రహించుచు, శిక్షించుచున్నారు. ఇవ్విధమున బృధివీశులైన మీరు మీ యాధనుస్సులను వింటిత్రాటితో వేరుచేసియుంచెదరుగాక. మిమ్ములను స్తుతులతో, నమస్కారములతో హవిస్సులతోఁ గృపావంతులుగాఁ జేయుదుము అందుచే మీధనుస్సులనుగొన్నియోజనాలదూరముననుంచుచు, అచటనుగూడ వానివలన హింసలేకుండుటకుఁగాను వింటిత్రాటితో శూన్యములుగా నుంచుదురుగాక; అని ప్రార్థించిరి.

-: 2 వ. ఋక్కు :-

"అస్మిన్ మహత్యర్ణవేఽంతరిక్షే భవా అధి"

అర్థము:-

అస్మిన్ = ఈకానవచ్చు, మహత్యర్ణవే = మహాసముద్రముతో సమానమైన, అంతరిక్షే అధి = అంతరిక్షము నాశ్రయించియున్న, భవాః = రుద్ర మూర్తి విశేషములు, సహస్రయోజనములదూరమున ఉండుఁగాక.

తాత్పర్యము:-

సా. భా:— మహాదేవ! భవములు అనగా నీమూర్తులు. చేతనాచేతన రూపమున అనేకవిధములుగానున్నవి. అవిమహాసముద్రమునందువలె సముద్రమువలెఁ బౌఢముగానున్న అంతరిక్షమునందునుగలవు వానిలో హింసాత్మకమగు నీశక్తికలదు. కావున అవియును జీవులు నివసించుప్రాంతములకు కొన్నివేఁయోజనములదూరమున నుండుగాక. అవి అణుశక్తివంటివి.

శివ+విష్ణు:

భ భా. భా: మహాశివుడు మహాసముద్రమున అగ్నిరూపముననుండగా విష్ణువు "రసోఽహమప్సు" అను గీతాసూక్తిలో జెప్పినట్లు రసరూపమునఁ గలడు. భూమ్యాకాశముల మధ్యభాగముఅంతరిక్షము. అందు శివుడు వాయురూపముననుండగా, విష్ణువు సూర్యచంద్రరూపమునఁగలడు. సముద్రమునందును, అంతరిక్షమునందునుగల శివకేశవశక్తులకు "భవములు" అని పేరుగలదు. హానికలుగకుండుటకుఁగాను, అభవములు దూరముగానుండి ఉపకారముచేయునుగాకయని భక్తులు ప్రార్థించిరి.

-: 3 వ. ఋక్కు :-

"నీలగ్రీవాశ్శితికంఠాఃశర్వాఅధఃక్షమాచరాః"

అర్థము:-

సా. భా:— రుద్రునియొక్క మూర్తివిశేషములు నీలగ్రీవాః = కొన్ని ప్రదేశములందు నీలవర్ణములును, ఇతరప్రదేశములందు శ్వేతవర్ణములై యుండును. శితికంఠాః = నీలకంఠములును, శర్వాః = హింసించునవియును అధఃక్షమాచరాః = పాతాళమునందు సంచరించునవియునైయున్నవి. (తాత్పర్యమునుభయము)

శివ+విష్ణు:

భ. శా. భా:— నీలగ్రీవ, శితికంఠ, శర్వఅనునామములకు అర్థములు శివ విష్ణుపరములుగ ఇంతకమున్నే వ్రాయబడినవి శివకేశవులమూర్తి విశేషములును, కిరణములును, నీలగ్రీవములును, శితికంఠములును శర్వములు = హింసించునవైయున్నవి అంతేకాదు. అవి జలరూపములు, సర్పరూపములునై భూమికి, క్రిందుగాఁగలపాతాళమునందును సంచరించుచున్నవి అవి జీవులకు గొన్నివేలయోజనముల దూరముననుండుఁగాక.

-: 4 వ. ఋక్కు :-

"నీలగ్రీవాశ్శితికంఠాదివగ్ం రుద్రాఉపశ్రితాః"

అర్థము:-

నీలగ్రీవాః = నీలశ్వేతవర్ణులును, శితికంఠాః = నలుపుకంఠమునందుఁ గల, రుద్రాః = రుద్రాంశగలదేవాదులు, దివం = స్వర్గమును, ఉపశ్రితాః = ఆశ్రయించియుండిరి.

తాత్పర్యము-

సా. భా.- రుద్రాంశ గలదేవతలందఱును, నీలగ్రీవులును, నీలకంఠులునై స్వర్గమునందుఁగలరు. వారు మిగిలిన భూలోకాదివాసులను రక్షించు చున్నారు.

శివ+విష్ణు-

భ. భా. భా:— శివకేశవులు ఇరువురును నీలగ్రీవులే. నీలకంఠులే. రుద్రులే వారిలో శివుడు ఇంద్రరూపమునను, కేశవుడు సూర్యరూపమునను, ఇంద్రాది లోకములను అధిష్ఠించి, ప్రభువులై, మిగిలినలోకవాసులను రక్షించుచున్నారు

పురశ్చరణము:—

చాంద్రాయణవ్రతమునాచరించి శరీరశోధనమునకై ఈమంత్రములను నాల్గింటిని 5 వేలసార్లు జపించవలెను. అట్లైనచో పురశ్చరణముపూర్తియగును. ముఖ్యముగా రాజులు శత్రునాశనమునకుఁగాను, ఈమంత్రములతో అభిచారిక హోమములను జేయుదురు. దూర్వాదిహోమములచే బైరితినిఁ జేసినహోమము లచేఁ గల్గినపాపములను బోగొట్టుకొందురు.

ధ్యానము:-

శ్లో॥ దంష్ట్రాకరాళవదనంజ్వాలజ్జ్వాలనమూర్ధజం।
బిభ్రాణంత్రిశిఖందీపంధ్యాయేభుజగభూషణమ్॥"

తాత్పర్యము:-

పైనాల్గుమంత్రములను జపించనర్హతలేనివారు, ఈ శ్లోకము ను జపించుచు శివుని ధ్యానించవలెను. మహాదేవుడు నాగభూషణుడు అతని

వదనమునిమ్నోన్నతముగానున్నకోరలచే భయంకరముగానుండును అతని జుత్తుమందుచున్న అగ్నివలెమెఱయును త్రిశూలమునువలె మూడు శిఖలుగల దీపమును జేతఁదాల్చును. అట్టిపరమేశ్వరుని ధ్యానించుటచే సకలకార్యములు నెఱవేరును.

-: 5 వ. ఋక్కు :-

"యేవృక్షేషుసస్పింజరా నీలగ్రీవా విలోహితాః"

అర్థము:-

వృక్షేషు = వృక్షములందు, యే = ఏరుద్రులుకలరో, తే = వారు, సస్పింజరాః = లేతగడ్డివలెపింజరవర్ణముకలవారు. నీలగ్రీవాః = నీలవర్ణమైన గ్రీవముకలవారు. విలోహితాః = కొందఱు విశేషముగా రక్తవర్ణముకలవారు.

తాత్పర్యము-

భగవంతుడైన రుద్రుని అంశలు వృక్షములందునుగలవు. కావుననే వృక్షనామమురుద్రునకుఁ జెల్లును. రుద్రులు లోకములందువలె, వృక్షములందును, సస్పింజరులై, అనగా పింజరవర్ణముకలవారైయున్నారు. వృక్షములందలి రుద్రులు నీలవర్ణగ్రీవులునై, విశేషముగ రక్తవర్ణముకలవారైయున్నారు.

శివ + విష్ణు:-

భ భా. భా — "వృక్షః, సస్పింజరః, నీలగ్రీవః, విలోహితః". అను నాల్గు నామములును శివవిష్ణుపరములుగా వ్యాఖ్యానింపఁబడినవి. మహాదేవుడు

స్థావరజంగమరూపమునఁగలడు. కావుననే వృక్షములు సస్యింజరముఁలై లోకములకు అనేకవిధములుగా ఉపకరించుచున్నవి. వానిలో నీలగ్రీవములు లోకపీడకులను నశింపఁజేయును ఏలోహితములు లోకములకు ప్రభువులై రక్షించుచున్నవి కావుననే అశ్వత్థాదివృక్షములను శివవిష్ణురూపములుగా భావించి, ప్రజలు పూజించుచున్నారు.

-: 6 వ. ఋక్కు :-

"యేభూతానామధిపతయోవిశిఖాసఃకపర్దినః"

అర్థము:-

యే = ఏరుద్రులు, భూతానాం = కానరాని శరీరముకలవారై, మనుష్యులకు ఉపద్రవములను గావించుభూతగణములకు, అధిపతయః = ప్రభువులో, తేషు = వారిలో, కేచిత్ = కొందఱు, విశిఖాసః = నున్నగాఁ జేయఁబడిన శిరస్సులుకలవారై, కపర్దినః = జటాజూటముకలవారై జీవులను హింసించుచున్నారు. వారు దూరముగానుందురుగాక.

తాత్పర్యము:-

సా. భా:— రుద్రుడు భూతప్రేతగణములందును, తనతేజస్సును ప్రవేశపెట్టినాడు. అట్టి భూతములగణములు, కానరాని శరీరముకలవై, మనుష్యులను కర్మఫలానుకూలముగాఁ బీడించుచున్నవి. వారందఱును భూతాధిపతులైనరుద్రులే. వారిలోఁగొందఱునున్ననితలకాయలు కల్గియుండిరి. మఱికొందఱు జటాజూటములనుదాల్చియున్నారు. వారుజీవులను హింసింప కుండుటకు కొన్నియోజనాలదూరముననుందురుగాక.

శివ+విష్ణు:—

భ. భా. భా:— శివకేశవులు ఇరువురును తమతేజస్సులను, భూమి, నీరు, గాలి, అగ్ని, అకాశము అనెడి పంచభూతములగణములకును, ఒసంగి, వారికి అధిపతులైయున్నారు. ఆభూతగణములు మానవుల ప్రవృత్తినివృత్తులకు హేతువులై, వారికి దుఃఖములతోఁబాటు సుఖములను సైతము ఒసంగుచున్నవి గణరూపులలోఁ గొందఱకు శిఖలులేవు. కొందఱు వివిధశిఖలను, అనేక విధకాంతులను, కల్గియున్నారు. కొందఱు జటామకుటములను, దాల్చి యున్నారు. జీవులకు ప్రమాదకరులుకాకుండుటకై వారు కొన్నియోజనముల దూరముననుందురుగాక. (కపర్దినామముయొక్క అర్థము ఇంతకుమున్ను వివరింపఁబడెను.)

-: 7 వ. ఋక్కు :-

"యేఅన్నేషువివిధ్యన్తిపాత్రేషుపిబతోజనాన్"

అర్థము:-

యే = ఏరుద్రులు, అనగా, రుద్రాంశగలవి అన్నేషు = భుజింపఁదగిన వస్తువులందుగూఢముగానున్నవై, జనాన్ = జనులను, వివిధ్యన్తి = విశేషముగా బాధించుచున్నవో, పాత్రేషు = త్రాగదగినపాలుమున్నగువానిలో నున్నవై, పిబతః = త్రాగుచున్న జనులను, వివిధ్యన్తి = విశేషముగా బాధించుచున్నవో, అవిదూరముగానుండుగాక.

తాత్పర్యము:-

సా. భా:— మహాదేవునితేజస్సు క్రిమికీటకాదులందునుగలదు. అవి అహారపదార్థములందుఁగలవు అవి తినఁదగిన వస్తువులను, అనగా, అన్నము కూర, పచ్చడి పిండివంటలుమున్నగువానిలోనుండి జనులను బీడించును. అటులనే నీరు, పాలుపాయసము మున్నగు త్రాగెడివస్తువులందుండి కీటకాదులు ప్రజలను బీడించును. అవి కంటికిఁగానరాకయుండును. అందుచే అవి కొన్నియోజనాలదూరముననుండుఁగాక యనిప్రార్థించుచున్నారు.

శివ + విష్ణు:-

భ భా. భా:— "అన్నంబ్రహ్మేతివిజానాత్; అన్నాద్ధ్యేవఖల్విమానిభూతాని జాయన్తే" అనుశ్రుతివలన అన్నము బ్రహ్మపదార్థము. దానినుండే భూతములు జన్మించినవి; అని తెలియుచున్నది. అన్నము బ్రహ్మవిష్ణుమహేశ్వరాత్మకము. త్రిమూర్తిస్వరూపులురుద్రులు. వారితేజస్సు ప్రాణులు తినదగిన ఆహారాది వస్తువులందుఁగలదు. శివకేశవులు అన్నమును ఆహారాదికమును భక్షించు జీవులుచేసినకర్మలకు అనుకూలమగు ఫలమును వారికొసంగుదురు. ముఖ్యముగాఁ బాపుల పాపఫలమునకు అనురూపమగు వ్యాధులు మున్నగు వానిని, వారికాహారపదార్థములద్వారాచేకూర్చెదరు. అంతేకాదు. పాత్రములందును త్రాగఁదగినపాలుమున్నగువానిలోనున్నవారై శివకేశవులు పాపజీవులకుఁ బానీయములద్వారారోగాదులనుజేకూర్చెదరు. అందుచే ఇట్టిబాధలువాటిల్లకుండుటకై జీవులు శివకేశవులను బ్రార్థింతురు.

-: 8 వ. ఋక్కు :-

"యేపథాంపథిరక్షయ ఐలబృదాయవ్యుధః"

అర్థము:-

యే = ఏరుద్రులు, పథిరక్షయః = లౌకికములును, వైదికములునగు మార్గములను రక్షించువారో, ఐలబృదాః = అన్నసమూహమును భరించువారో అన్నప్రదానముచే జీవులను బోషించువారో, తే = వారు, యవ్యుధః = మిత్రములై విరోధులతో యుద్ధముచేయువారు, అగుచున్నారు. వారుదూరముగా ఉందురుగాక.

తాత్పర్యము:-

సా. భా:— యోధులు రుద్రాంశగలవారై లౌకికములైన మార్గముల నన్నింటిని రక్షింకురు దేవతలు, మునులు, మున్నగువారు రుద్రతేజస్సు

గలవారై వేదములలోఁ జెప్పిన మార్గములనన్నింటిని రక్షింతురు. ఇర, అనగా, అన్నము. ఆహారము అనేకవిధములుగాగలదు. అన్నసమూహామునే ఇరము అందురు. అదియే ఇలము దానిని భరించువారే ఇలభృతులు. వారే ఇలబృదులు. రుద్రుడు సూర్యచంద్రకిరణములద్వారా తన తేజస్సును ఆహార పదార్థములందు ప్రవేశపెట్టెను అందుచే ఆహారసమూహామును భరించు చేతనాచేతనములు రుద్రులేఅగును. అవి అన్నప్రదానముచే జీవపోషకము లగును రుద్రులు అనేకవస్తువులలో నుండుటచే మిశ్రమములగుదురు. అవి కర్మఫలమునకు అనుకూలముగా జీవులయెడలఁ బ్రవర్తించుటచే విరోధులును అగును. ఆవిధముగా అవి జీవులయొక్క అనిష్టములను నివారించును. అందుచే రుద్రాంశగలవానినెల్ల జీవులు నమస్కరింతురు.

శివ+విష్ణు:—

భ. భా. భా:— "పంథ" అనగా మార్గము. అది లౌకికము, వైదికము అని రెండు విధములుగాఁగలదు 14 లోకములకుఁ జెందినది లౌకిక మార్గము. వేదములందుఁ జేతనాచేతనములచరిత్రకుఁ జెందినట్లుచెప్పినది వైదికమార్గము. పైరెండుమార్గములను రక్షించువారురుద్రులే వారు సకల ప్రాణులను నిరోధించుటకును, నడిపించుటకును సమర్థులు రుద్రులు సమష్టి స్వరూపులేకాదు. వ్యష్టిస్వరూపులు కూడ అగుచున్నారని వేదములందుఁగలదు. "వసూయవోవసుపతేవసూనామ్" "గవామసిగోపతిరేకఇంద్రః" ఇతి "నిధీనాంత్వానిధిపతిగ్ంహవామహే" "ఇత్యాది" తేజస్సును ధనము నొసంగుటచే వసువులలో వసుపతివైయుంటివి. గోవులను అనగా జీవులను రక్షించువాడవు; కావున గోపతియైన ఇంద్రుడవైతివి. నిధులను రక్షించు వాడవు కావున నిధిపతిగాఁగొనియాడఁబడుచున్నావు; అని పైమంత్రములచేఁ దెలియుచున్నది. శివకేశవులు ఇరువురును లౌకికవైదికమార్గరక్షకులే. కాన పథిరక్షకులగు రుద్రులగుచున్నారు. వారు సమష్టివ్యష్టిస్వరూపులు. కావుననే పైమంత్రములందు రుద్రుడు వసుపతిగా గోపతిగా నిధిపతిగాఁ గొనియాడఁ

బడెను. సకల మార్గరక్షకులు శివకేశవులని సాకల్యమును = సకలస్వరూపు డుగా నుండుటను ప్రతిపాదించుటకే "పథాం" అని బహువచనము చెప్పఁ బడెను. రేఫకు నులకారమునకు భేదములేదుగావున "ఇరా, ఇలా" అను పదములు రెండింటికిని అన్నమనియే అర్థము సన్మార్గమున మెఁగినవారిని గూర్చి అన్నమును భరించు శివకేశవులు ఇలాభృతులు అగుదురు. వ్యాకరణ శాస్త్రరీత్యా ఇలాభృతులే బలబృదులు అగుదురు. జీవులంపటును శివకేశవా ధీనులేకాన వారిని రక్షించు శివకేశవులు బలబృదులు అగుదురు. "పరోక్ష ప్రియా ఇవహిదేవాః" అను శ్రుతిచే దేవులు తమ పరోక్షమందున్నవారికి ఇష్టులగుదురని తెలియుచున్నది. "అన్నమన్నాదఏవచ" అను సూక్తిచే, అన్నము అన్నాదుడును శివకేశరూపుడగు భగవంతుడే అని తెలియుచున్నది. "అహమన్నాదో అహమన్నాదః" అను శ్రుతిచే అన్నాదుడు శివకేశవస్వరూ పుడే అని తెలియుచున్నది. "య" అనగా యువకులు. వారితో యుద్ధముచేసి సంహరించువారు "యవ్యుధులు" అగుదురు. శివకేశవులు యుద్ధరంగమున యువకులతోడను యుద్ధముచేసి, సంహరించువారే కావున "యవ్యుధులు" అగుదురు. శరీరేంద్రియ ప్రాణములను మిళితముచేసి జీవులను నిర్మింతురు కాన "యవ్యుధులు" అగుదురనియు జెప్పవచ్చును.

పరికింపగా శివకేశవులు లౌకిక వైదిక మార్గములందుఁ ప్రవర్తించు జీవులకు ప్రారబ్ధకర్మానుగుణముగా ఒకప్పుడు అన్నమును, ఒకప్పుడు ఆయువును ఇచ్చుచు ఒకప్పుడు ఆరెండింటిని అపహరింతురు, అనియును దెలియుచున్నది. వారు హింసింపఁ దగినదానినే హింసింతురనియును జెప్పవచ్చును

—: 9 వ. యజుస్సు :—

'యేతీర్థాని ప్రచరంతి సృకావన్తో నిషంగిణః'

అర్థము:-

యే = ఏరుద్రులు, తీర్థాని = కాశీప్రయాగాదిక్షేత్రములను, ప్రచరన్తి = రక్షించుటకు సంచరించుచున్నారో, తే = వారు, సృకావన్తః = ఈటెలుకల వారును, నిషంగిణః = కత్తులుగలవారును అయియుండిరి.

తాత్పర్యము:-

సా. భా:— దేవాలయములుగల ప్రదేశములు క్షేత్రములు. పుణ్య నదులుగల ప్రదేశములు తీర్థములు. తీర్థపదము క్షేత్రములకు ఉపలక్షకము. కాశీగయాప్రయాగాదిక్షేత్రతీర్థములు దేవతలకు నిలయములు. వానిని రాక్షసులు పాడుచేయఁదలంతురు. వానికేగుత్రోవలందు, చోరులు, క్రూరమృగములు మున్నగునవి ఉండి అటకువచ్చుజనులను బీడించును. రుద్రాంశకల వారు ఆదుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించుటకు, శూలములు, ఖడ్గములు మున్నగునవిచేతఁ దాల్చియుందురు. తీర్థములకేగువారిలో, దుష్టులు పాపాత్ములు కొందఱుందురు. వారిని అటకేగకుండ నిరోధించుటకును రుద్రులు ఖడ్గావిధారులైయుందురు. భక్తులమగుమమ్ము కాపాడుటకు ఆరుద్రులను కొన్నియోజనాలదూరమున నుంచుమని భక్తులు శివుని ప్రార్థించిరి.

శివ + విష్ణుః

భ. భా. భా:— కాశీ, శ్రీశైలము మున్నగునవి శివక్షేత్రములు. తిరుపతి భద్రాచలము మున్నగునవి విష్ణుక్షేత్రములు. రుద్రరూపులైన శివకేశవులు అయాక్షేత్రములకు వచ్చుప్రజలకు ఫలముఁనొసంగుటకును, క్షేత్రాగతభక్తులను బాధించువారిని రానీయక నిరోధించుటకును ఖడ్గాద్యాయుధములను జేతఁ దాల్చియుందురు. ప్రతిప్రాణియొక్క హృదయమునను బరమాత్మగలడు అప్పరమాత్మను దర్శించు భక్తులను మనసునిలువనీయక కామక్రోధాదులు బాధించుచుండును. వానిని దొలగించుటకై పరమాత్మ సూక్ష్మరూపమున శమదమములు మున్నగు నాయుధములను జేతఁదాల్చిభక్తులలోనుండి, జ్ఞానమొసగి రక్షించును. అప్పరమాత్మయే దుష్టజీవులకు గర్మఫలమనుభవింపజేయుటకై జ్ఞానము కలుగనీయక, కష్టములఁ గల్గించి, శిక్షించును, అని తెలియుచున్నది.

పురశ్చరణము:—

మానవుడు కృచ్ఛ్రచాంద్రాయణాది వ్రతములనాచరించి, పైమంత్రములను 5 వేలజపముచేయవలెను. ఋతుగమనదినమున భార్యతోఁ గలియుటకు ముందుస్వాగ్నిలో, కపిలగోవుపాలనునేతిని గలిపి పైమంత్రములతో 8 వేలు హోమముచేసి, భార్యతోఁగలిసినచో విద్వాంసుడును వంశకరుడునగు పుత్రుడు జన్మించును. మహాతీర్థములకేగునపుడు, స్వాగ్నిలో నేతితోఁ దడిపిన శుద్ధతండులములతోఁ బైమంత్రములు పఠించుచు, 10 వేలుహోమముచేయవలెను. వెళ్ళునపుడు మాటాడరాదు. స్నానముచేసివచ్చి, అగ్నినారాధించి, పైమంత్రములను జపించినచో యథార్థముగా తీర్థఫలమును బొందును. పూర్వమువలె ధ్యానముచేయవలెను.

— 10 వ. యజుస్సు —

"యఏతావన్తశ్చభూయాగ్ంసశ్చదిశో రుద్రావితస్థిరే।
తేషాగ్ం సహస్రయోజనేవధన్వానితన్మసి"

అర్థము:-

యేరుద్రాః = ఏరుద్రులు, ఏతావంతశ్చ = వేలకొలదికలరో భూయాగ్ంసశ్చ = అంతకంటె అధికులై, :దిశః = అన్నిదిక్కులను ప్రవేశించి, వితస్థిరే = కలరో; తేషాం = వారియొక్క, ధన్వాని = ధనుస్సులను, సహస్రయోజనే = వేయియోజనములదూరమున, అవతన్మసి = వింటిత్రాడు తొలగించి ఉంచుదుు.

తాత్పర్యము:-

సా. భా:— మహాశివుడు తనతేజస్సును, సూర్యచంద్రాగ్ని వాయునక్షత్రాదులందుఁ బ్రవేశపెట్టెను. రుద్రతేజస్సుకలవారు రుద్రనామకులే. వారు వేళ

కొలదిగా అన్నిదిక్కులందునుగలరు. అందుచే హింసాత్మకములైన వారి ధనుస్సులు కొన్నివేలయోజనములదూరమందుండుగాక.

శివ + విష్ణు:-

భ. భా. భా:— మహాదేవుడు, మహావిష్ణువును తమశక్తులను భూమిపైఁ గల చేతనాచేతనములందును, అంతరిక్షమునందుగల సూర్యచంద్రాదు లందును, మహాసముద్రమునఁగల జలములందును, జలచరములందును, పాతాళమునందును, దివమునందును, వృక్షాదులందును, భూతములందును, అన్నపానీయములందును, మార్గములందును, తీర్థములందును, వ్యాపింపఁ జేసిరి అందుచే రుద్రాఖ్యకలశివ విష్ణుస్వరూపములను ఎవ్వరును లెక్కింపఁ జాలరు. అందుచే వారందఱును నమస్కరింపఁబడిరి. దీనిపురశ్చరణము పూర్వమువలెనే చేయవలెను.

— 11 వ. యజుస్సు —

నమోరుద్రేభ్యోయేపృథివ్యాం, యేఽంతరిక్షే।
యేదివి, యేషాంమన్నంవాతోవర్షమిషవ।
స్తేభ్యోదశప్రాచీర్దశదక్షిణాదశప్రతీచీ।
ర్దశోదీచీర్దశోర్ధ్వాస్తేభ్యోనమస్తేనోమృడయంతు।
తేయంద్విష్మోయశ్చనోద్వేష్టి, తంవోజంభేదధామి"

అర్థము:-

యే = ఏరుద్రులు, పృథివ్యాం _ భూమిపైఁగలరో, యేషాం = ఏరుద్రులకు, అన్నం = ఆహారమే, ఇషవః = బాణములో, తేభ్యః = అన్నమేబాణము గాఁగల, రుద్రేభ్యః = రుద్రులకు, - నమః = నమస్కారము.

యే = ఏరుద్రులు, అంతరిక్షే = ఆకాశమునందుఁగలరో, యేషాం = ఏరుద్రులకు, వాతః = వాయువు ఇషవః = బాణములో, తేభ్యఃరుద్రేభ్యః = ఆరుద్రులకు నమః = నమస్కారము యే = ఏరుద్రులు, దివి = స్వర్గమునందు గలరో, యేషాం = ఏరుద్రులకు, వర్షం = వర్షము ఇషవః = బాణములో, తేభ్యః = ఆరుద్రులకు, నమః = నమస్కారము, దశప్రాచీః = తూర్పుముఖముగాఁ బదివ్రేళ్ళచివరలుగల అంజలులతోడను, దశదక్షిణాః = దక్షిణముఖముగాఁ బదివ్రేళ్ళ చివరలుగల అంజలులతోడను, దశప్రతీచీః = పడమటి ముఖముగాఁ బదివ్రేళ్ళచివరలుగల అంజలులతోడను, దశోదీచీః = ఉత్తరముఖముగాఁ బదివ్రేళ్ళచివరలుగల అంజలులతోడను, దశోర్ధ్వాః = ఊర్ధ్వముఖముగాఁ బదివ్రేళ్ళచివరలుగల అంజలులతోడను, తేభ్యః = ఆరుద్రులకు, నమః = నమస్కారము. తే = ఆరుద్రులు, నః = మమ్ములను, మృడయన్తు = సుఖపఱచుదురుగాక. యం = ఎవనిని, ద్విష్మః = ద్వేషింతుమో, యశ్చ = ఏశత్రువు, నః = మమ్ములను, ద్వేష్టి = ద్వేషించునో, తం = ఆశత్రుద్వయమును, వః = రుద్రులారా! మీయొక్క, జంభే = తెఱచిఉన్ననోటిలో, దధామి = ఉంచుచున్నాను.

తాత్పర్యము:-

సా. భా:— (1) పృధివి, (2) అంతరిక్షము, (3) ద్యులోకముఅని, లోకములుమూడువిధములుగాఁగలవు. (1) భూలోకవాసులగురుద్రులకు అన్నము బాణము (2) అంతరిక్షవాసులగు రుద్రులకు వాయువుబాణము. (3) ద్యులోవాసులగు రుద్రులకు వర్షముబాణము. పృధివీవాసులగురుద్రులు తప్పుచేసినవారిచే అపథ్యమైన అన్నముతినిపించి, రోగములు తెప్పించి, వారిని హింసించుచున్నారు. అన్నముకొఱకుదొంగతనముచేయించి, ఆదొంగలను హింసించుచున్నారు. కావున భూలోకవాసులైన రుద్రులకు నమస్కారము. అటులనే అంతరిక్షవాసులగురుద్రులు నేరముచేసినవారికి తీవ్రమైనవాయువుచే రోగములుపుట్టించి, హింసించుచున్నారు. కావున వారికి నమస్కారము. అటులనే ద్యులోకవాసులైన రుద్రులు అతివృష్టిచేతను, అనావృష్టిచేతను,

బ్రాణులను హింసించుచున్నారు. రుద్రులు ఐదు దిక్కులందునుగలరు. దోసి లొగ్గి, తూర్పుదిక్కున నున్నవారికిని, దక్షిణాభిముఖులై దక్షిణదిగ్వాసులకును పశ్చిమాభిముఖులై పడమటి దిక్కునందలి వారికిని, ఉత్తరాభిముఖులై ఉత్తర దిగ్వాసులకును, ఊర్ధ్వాభిముఖులై ఊర్ధ్వదిగ్వాసులకును నమస్కరించుచున్నారు పదివ్రేళ్ళచివరలుకలిపి, చేతులతో రుద్రులను జూపుచున్నారు. ఆరుద్రులు మాకుసుఖముచేకూర్చెదరుగాక. ఊరకనేయున్నశత్రువును, ఊరకనేయున్న మమ్ములను ద్వేషించుశత్రువులను తెరువబడియున్నరుద్రులనోటిలోఁ ద్రోసి యుంచుచున్నాము. వారిని హింసింపుడని ప్రార్థించిరి. "ప్రభ్రాజమానా వ్యవదాతాః" అనెడి అరుణమంత్రముచేఁ దెలియు స్త్రీపురుషవాయువులను, అష్టదిక్పతులను రుద్రులుగాఁ దెలిసికొనవలసియున్నది.

మంత్రవినియోగము:-

పంచమప్రశ్నలో శతరుద్రీయహోమముచెప్పఁబడెను. "నమస్స భాపతిభ్యః" అను నంతవరకును 1. వ. మంత్రము "అవార్యాయ" అను నంతవరకును 2. వ. మంత్రము. "జమ్మసి" అను నంతవరకును 3. వ. మంత్రము. నమోరుద్రేభ్యః" అనుదానిలో పృధివ్యాదిభేదముతో మూడు మంత్రములునుగలవు. మొత్తము ఈయారుమంత్రములతో హోమము చేయవలెను.

> *శ్లో॥ వేదార్థస్యప్రకాశేనతమోహార్దంనివారయన్।*
> *పుమర్థాంశ్చతురోదేయాత్ విద్యాతీర్థమహేశ్వరః"*

తాత్పర్యము-

తీర్థమనగా సద్విషయముల నుపదేశించువాడు. మహేశ్వరుడు లోకు లకు విద్యలను దక్షిణామూర్తిరూపుడై ఉపదేశించుటచే విద్యాతీర్థుడాయెను. అతడు నాలువేదములందలి విషయములను వెల్లడిచేసి, తెలయఁజేసి, లోకుల హృదయములందున్నమోహమును (అజ్ఞానమును) నివారించుచు నాలుగుపురు షార్థములను, ధర్మార్థకామమోక్షములను లోకులకు ఒసంగునుగాక.

సాయనాచార్య విరచితమైన వేదార్థప్రకాశమను భాష్యమున యజుర్వేద సంహితలో చతుర్థకాండలోఁగల్గు పంచమప్రపాఠకమందలి రుద్రమునకు నమకమునకు వ్రాసిన భాష్యము సమాప్తము:—

(•)

శివ + విష్ణు:-

భ. భా. భా:— "నమోరుద్రేభ్యః" అను మంత్రమునకు భగవంతుడేఋషి అనుష్టుప్ఛందస్సు. రుద్రుడేదేవత. పృధివ్యాదిలోకములు మూడింటఁగల రుద్రులను నమస్కరించి, తనకుసుఖమును, దనశత్రువులకునాశమును జేకూర్పుమని ఈమంత్రమునఁ బ్రార్థింపఁబడెను. "నమోరుద్రేభ్యఃఅని మొదలగు మూడుయజుస్సులతో "తేభ్యోదశప్రాచీః" మున్నగుమంత్రములను జోడించి, అర్థము చెప్పవలెను. "సూర్యోనోదివస్పాతు,వాతో అంతరిక్షాత్, అగ్నిర్నఃపార్థివేభ్యః" అను సౌరమంత్రమునఁ జెప్పినట్లు సూర్యుడు దివమున నుండియు, వాయువు అంతరిక్షముననుండియు, అగ్నిభూమిపైనుండియు, ప్రజలకుమేలుచేయుచున్నారు. ఆవిషయమే ఈమంత్రమునఁగలదు. పృధివి, అంతరిక్షము, దివము, అని మూడులోకములుకలవు శివకేశవులు ఇరువురును అగ్నిరూపరుద్రులై భూమిపైఁగలరు శివుడు యజ్ఞాగ్ని స్వరూపమునుదాల్చియు విష్ణువు, "బడబము దావము, జఠరము, లౌకికాగ్ని, అనునాల్గురూపములను దాల్చియు, లోకరక్షణకైనేలపైఁగలరు. వారు అగ్నిరూపులై ఆయువును, అన్నమును ఒసంగుదురని "ఆయుర్దాఅగ్నేహవిషోజుషాణః" అను మంత్రమున జెప్పఁబడెను. అందుచే నేలపైఁగల అగ్నిరూపరుద్రులకు, జీవులను రక్షించుటకుఁగాని, శిక్షించుటకుఁగాని అన్నమేసాధనము(బాణము) అగునని తెలియుచున్నది. అందుచేవారు కర్మఫలానుకూలముగా జీవులచే అపథ్యమైన అన్నము తినిపించి, వ్యాధులుపుట్టించి, బాధించుచున్నారు. కొందఱు జీవులకు అన్నము లేకుండఁజేసి, ఆకలితో బాధపడునట్లుచేయుచున్నారు. ఆహారమునకవసరమగు ధనమును వస్తువులను, సంపాదించుటకై జీవులచే దొంగతనము మున్నగు దుష్కార్యములు చేయించి, మరణదండనాదులను అనుభవింపఁజేయుచున్నారు. అందుచే జీవులు అన్నసాధనుడగు అగ్నియొక్కరూపముదాల్చిన రుద్రులను నమస్కరించుచున్నారు. అపథ్యాహారముచే జ్ఞానేంద్రియములగునేత్రాదులై దింటికిని, కర్మేంద్రియములగు కరచరణాదులెదింటికిని, బాధకల్గింపకుడని

తెల్పుటకై పదివ్రేళ్ళను జోడించి, జీవులు రుద్రులను నమస్కరించుచున్నారు. పంచభూతములవలన బాధకలుగ నీయకుడని తెల్పుటకై తూర్పు, దక్షిణము పడమర, ఉత్తరము, ఊర్ధ్వము అనెడి ఐదుదిక్కులకు ఎదురుమోముకలవారై నమస్కరించుచున్నారు. "ఊరక సజ్జనుండొవ్వగియుండినన్నైన దురాత్మకుండు నిష్కారణమోర్వలేకయపకారముచేయుటవానివిద్యగా అని భాస్కరకవి చెప్పి నట్లు శత్రువులూరకనేయున్నను మమ్ములను బాధింతురు. అందుచే మేము వారిని ద్వేషించెదము ఋణశేషము, శత్రుశేషమును మిగులరాదు కావున ఆశత్రువులను మీనోళ్ళలో ఉంచుచున్నాము. వారిని సంహరింపుడు మీజంభము లతో (దన్తములతో) గొఱికి, అదుష్టులను నశింపఁజేయుడు. తనకోపము తన శత్రువు కావున మాకువారిపైకోపములేకుండఁ జేయుదురుగాక. మానవులు చేయుకర్మలు, వాచికములు, కాయికములు, మానసములు, అనిముప్విధములు కావున శివకేశవరూపరుద్రులారా! "నమోరుద్రేభ్యః" అనుచుమిమ్ముమాట లతో నమస్కరించుచున్నాము "నమస్తేభ్యోదశప్రాచీః" అనుచుమిమ్ములను జేతులతో నమస్కరించి, మీకు శారీరికనమస్కారములను సమర్పించు చున్నాము. తేభ్యోనమః" అని ధ్యానించుచు, మీకు మానసిక నమస్కారము లను సమర్పించుచున్నాము. మీరు మాకు సుఖముచేకూర్చెదరుగాక; అని తొల్తపృథివిపైగల రుద్రులను నమస్కరించిరి శివకేశవరూపరుద్రులారా! మీరు వాయురూపులై అంతరిక్షముననున్నారు. "ప్రభ్రాజమానావ్యవదాతాః" మున్నగు అరుణమంత్రములను బరిశీలించినచో బ్రహ్మాండమునఁ బంచప్రాణ వాయువులు, పంచఉపవాయువులు పదునొకండు పురుషవాయువులు, పదు నొకండుస్త్రీవాయువులు, ఇంద్రుడు వజ్రముతో దితిగర్భమును ఛేదింపగా వెలువడినసప్తవాయువులు, వానికిఁజెందిన 49 ఉపవాయువులునుగలవని తెలియుచున్నది. ఇట్లు పరిశీలించినచో వాయువులు అనన్తముగాఁగలవని తెలియును. వానిలో రజతాదివాయువులు శివస్వరూపములు. వైద్యుతాది వాయువులు విష్ణుస్వరూపములు. ఇట్లు శివకేశవస్వరూపములైన వాయువులు రుద్రములై అన్తరిక్షమునఁగలవు. ఇవన్నియును హింసాసాధనములే. ఇవి

కర్మఫలానుకూలముగా జీవులను రక్షించుటకును, శిక్షించుటకును, అధికముగానో, అల్పముగానో వీచుచుండును. ఒకప్పుడవి వాతస్తంభముగానేర్పడును. ఒకప్పుడు అగ్నిగుండములుగా, సుడిగాలులుగానేర్పడును అందుచేఁ ప్రాణులకు వాతరోగములు, రక్తపుఁబోటు, గుండెజబ్బుమున్నగునవి వాటిల్లును. అందుచే ప్రాణులు మృతిచెందుదురు. కావున జీవకోటి అగ్నిరూపరుద్రులను నమస్కరించిప్రార్థించును. శివకేశవులు సూర్యరూపరుద్రులై దివమునందున్నారు. "ఆరోగోభ్రాజః పటరఃపతంగః" అను నారుణమంత్రమును బట్టిఎనిమిది సూర్యమండలములుకలవనియు, వానిలో "ఆరోగుడు" అను సూర్యుని మండలము భూలోకమునకుఁ జెందియున్నదని తెలియుచున్నది. ఆరోగుడను సూర్యుడు భూమిపైగల తేమను ఆవిరిగాఁ దీసికొని, దానిని నీటిగామార్చి మఱలనేలపై దానిని వర్షింపఁజేయును. అవర్షజలముతోఁ బంటలుపండించి, వానివలనవచ్చిన ఆహారమును ప్రాణులు స్వీకరింతురు. ఆవర్షజలమును త్రాగుదురు. సూర్యుడు వర్షముకురిపించకున్నచో నీరులేక, ఆహారములేక, ప్రాణులునశింతురు. నరులేకాదు; జంతువులు, పక్షులు, క్రిమికీటకాదులు, వృక్షములు అన్నియును నీరులేకున్నచోనశించును. శివకేశవరూపరుద్రుడగు సూర్యుడు జీవుల కర్మఫలముననుసరించి, అనుకూలముగా వర్షింపక, అతివృష్టి, అనావృష్టి మున్నగునవిచేకూర్చి శిక్షించును. నశింపఁజేయును. ఆసూర్యుడు శివకేశవరూపుడనివేదాదులవలనఁ దెలియుచున్నది. అందుచే భక్తులు అగ్నిని వాయువును ప్రార్థించినట్లే, హింసాసాధనమైన వర్షమును జేపట్టిన సూర్యుని సైతము నమస్కరించుచున్నారు. "పృథివి, అంతరిక్షము దివి, అను మూడును శక్తియైన ప్రకృతియొక్కరూపములు. వాని నధిష్ఠించియున్న "సూర్యుడు, వాయువు, అగ్ని" అనువారు పరమాత్మస్వరూపులు. అందుచేఁ ప్రతిప్రాణియును ప్రకృతి సహితపరమాత్మను ఆత్మరక్షణకై ప్రార్థించును.

పురశ్చరణము :—

21 దినములు దీక్షవహించి, 10 దినములు అనుమునేతప్పవతి దేనిని భుజింపరాదు మొదటి ఐదురోజులుపాలుత్రాగి, తర్వాత ఐదురోజులు ఫలములు భక్షించి పిమ్మట ఐదురోజులు పెరుగుత్రాగి, ఆటుపిమ్మట ఐదురోజులు పండ్లుతినవలెను తుదిదినమున ఉపవాసముచేయవలెను ఇట్లుచేసి 21 దినములు హోమపదార్థమును భక్షించుచుండి. జపముచేయవలెను పిమ్మట ఐదుదినములు కత్తుకబంటినీటిలో నిల్చి జపముచేయవలెను. ఆటుపిమ్మట అఘమర్షణస్నానముచేసి, జపముచేసి, గురుసేవచేసి. ఆచార్యునకు 100 బంగారు నాణెములు దక్షిణగా నొసంగవలెను పిమ్మటను హోమాదులుచేసి. మౌనదీక్షతోనుండి, సిద్ధిపొందిన వానికిగలశత్రువులు జయింపఁబడుదురు. అభిమత సిద్ధివారికిచేకూరును. కాలజ్ఞానములభించును, ఆయుఃప్రమాణము అధికమగును.

భ. భా. భా:— సమష్టిరుద్రాధ్యాయము ననుసరించిఁ చేయదగిన జపహోమాదిక్రమము నిరూపింపఁబడుచున్నది. తత్ఫలముకూడఁ జెప్పఁబడుచున్నది.

శ్లో॥ వృషాధిరూఢందేవేశం సర్వలోకైకకారణం।
ధ్యాయేత్ బ్రహ్మాదిభిస్స్తుత్యం పార్వతీసహితంశివమ్॥

తాత్పర్యము—

పార్వతీ సహితుడైన మహాశివుడు వృషభమును అధిష్ఠించియుండెను. ఆతడు దేవతలకెల్లఁ బ్రభువు. సర్వలోకములకును ఆతడే ముఖ్యకారణము. బ్రహ్మాదులు ఆతనినిస్తోత్రముచేయుచున్నారు. ఆతనిని ధ్యానింపవలెను.

ఈ రుద్ర సముదాయమును జపించిన మాత్రాన సర్వసిద్ధులు చేకూరును త్రిషవణస్నానము చేసి జపము చేసినవాడు పంచమహాపాతకము లను బోగొట్టుకొని పవిత్రుడు అగును శౌనకుడుచెప్పిన రుద్ర పూజాఫలము ను గమనింపుడు. నమకమున ప్రథమానువాకమును, చమకమున ప్రథమానువాకమును జోడించి, జపముచేసి, శివుని బూజింపవలెను. పిమ్మట బ్రాహ్మణులకు భోజనము పెట్టవలెను. పైరీతినిజేసినచో సర్వకామములు నెరవేరును రాజ్యకాముకుడు రుద్రాధ్యాయమునుజపించి "మానస్తోకే" అనుమంత్రముతో హోమముచేసి, పద్మోత్పలాదులతోఁ బూజింపవలెను. "ప్రముంచధన్వనస్త్వమ్" అను మంత్రముతోఁ జందనాదులను సమర్పించవలెను. "నమో వఃకిరికేభ్యః" అను దానితో తండులహోమముచేయవలెను. బోధాయనుడు చెప్పిన విధమును ఆచరించినవాడును ఐశ్వర్యమును బొందును. కాళికాపురాణమున సనత్కుమారుడుచెప్పిన పూజావిధానమెట్టిదనఁ? స్నానమాచరించిన పిమ్మట నదీతీరమున, వృషభాదిరహితుడైన రుద్రుని బశ్చిమాభిముఖముగాఁ బ్రతిష్ఠించి, పంచగవ్యాదులతో స్నానముచేయించవలెను. గోరోచనము, బిల్వపత్రములు మున్నగువానితోఁ బూజించవలెను. ఇట్లు 11 దినములర్చించి, జపహోమాదులుచేసినచో సకలకాంక్షలు నేరవేరును. నిధులు మున్నగునవి లభించును కృష్ణపక్షాష్టమిమొదలు కృష్ణచతుర్దశివరకును అభిషేకాదులతో మహాదేవుని అర్చించి, నమోఽస్తునీలగ్రీవాయ" అను మంత్రమును జపించవలెను. దానిచే సర్వసిద్ధులుపొందుదురని కొందఱుచెప్పిరి. అన్నకాముడు "అసౌయస్తామ్రః" అను మంత్రమును ఆదిత్యునుద్దేశించి, జపించవలెను. వర్షముకురియుటకును ఈమంత్రమునే జపించవలెను. పూర్వోక్త విధిననుసరించి, దేవునారాధించి, రుద్రానువాకములు పదునొకండింటిని 11సార్లు జపించి, "ఆరాత్తేగోఘ్న" అనుమంత్రముతో షోడశోపచారములుచేసి, ఆమంత్రమును వేయిసార్లుజపించినచో దీర్ఘాయుష్మంతుడగును. ఆదివారమునాడు బ్రాహ్మణునకు దక్షిణనొసంగి వేయిజపముచేసినచో వ్యాధివిముక్తుడై శతాయుష్కుడగును. "పరిణోరుద్రస్య" అను మంత్రముతో వటసమిధలు

10 వేలుహోమముచేసినచో ఆయుష్మంతుడగు పుత్రునిబొందును. గోవృద్ధికి "నమోవఃకిరికేభ్యః" అను మంత్రముతో జపహోమములుచేయవలెను. మహారాజమార్గమునఁ బుట్టమన్నుతోఁజేసిన శివలింగమును బ్రతిష్ఠించి, పంచగవ్యస్నానముచేయించి పూజించి, "నమోవఃకికిరికేభ్యః" "మానస్తోకే" అను మంత్రములను దక్షిణామూర్తి చెంతనుజపించినచో మాటలురానివానికి మాటలువచ్చును. ఉపన్యాసకుడగును.

నాభిమాత్రజలమునఁదుండి, ఆదిత్యాభిముఖుడై జహూరుద్రములను జపించి, పిమ్మట శివున్బూజించినచో వరముఁడును. భక్తవత్సలుడునగు వృష కేతుడు ప్రత్యక్షమగును. అతడు విశ్వవిజేతయగును. "మానోమహాన్తమ్" అను మంత్రమును 10 వేలు జపించినచో బాలురకు పరిజనమునకు, యజ మానికిని ఆరోగ్యము లభించును. "మీఢుష్టమ" అనుమంత్రముతో షోడశోప చారములుచేసి, రుద్రమును 11 సార్లు జపించినచో సర్వభయమును, సర్వ క్లేశములునుతొలగును. మహాన్యాసపూర్వకముగా ఏకాదశవారాభిషేకమును ఆచరించినచో స్వస్థుడగును. "నమోభవాయ; నమోజ్యేష్ఠాయ" అనుమంత్రము లతో జపహోమాదులనాచరించి, భస్మనభిమంత్రించి, రక్షచేయవలెను. చేయించవలెను. రాత్రిశిఖాబంధము చేయవలెను. అందుచే గ్రహభయము తొలగును. "మీఢుష్టమ" అను మంత్రమును జపించినచో మహాభయము చోరభయము, అగ్నిభయము, ప్రాణభయమును దొలగిపోవును, "ఇమాగ్ంం రుద్రాయ" అను మంత్రజపముచే మహాజ్వరబాధతొలగిపోవును. "నమస్తే రుద్రమన్యవ" అను మంత్రమును జపించుటచే వాయుబాధతొలగును. "అధ్యవోచదధివక్తా" అను మంత్రముజపించి, రక్షాబంధముధరించి, ప్రయా ణముచేయమొదలిడినచో మార్గమున అతనికి బ్రహ్మరాక్షస భూతప్రేతపిశాచ బాధలు ఉండనేరవు. "యాతేరుద్రశివాతనూ" అను మంత్రముజపించి, ఏకాదశగ్రంధులను హస్తమునఁ గట్టినచో, బాలురును, గుర్వీణీలును (గర్భిణీ స్త్రీలును) సుఖముగా వృద్ధినొందుదురు. "సహస్రాణి సహస్రధా" అను

మంత్రముజపించి, భాష్యములోఁ జెప్పినట్లు శాంతి విధానమాచరించినచో సర్వలోకగత శత్రువులునునశింతురు నమోహిరణ్యబాహవే" అను మంత్రమును జపించి, హోమముచేసినచో చక్రాద్యాయుధబాధలుతొలగును. శౌనకమునిచెప్పిన అభిచారికహోమాదులు ఈకాలమున ఆచరణీయములుకావు

ప్రతిదినము శివలింగాభిషేకముగావించువారు జన్మజన్మాంతరకృత పాపములను దొలగించుకొనఁగలరు నమకచమకములతో ఏకవారాభిషేకము చేసినచో లఘురుద్రమగును. 11 సార్లు నమకచమకములతో అభిషేకము చేసినచో మహారుద్రముఅగును. దీనిచే నిర్ధనుడు ధనవంతుడగును. మేరు తంత్రోక్తవిధానమునననుసరించి, చెప్పిన విధానము సమాప్తము.

—: శ్రీ భట్టభాస్కరాచార్యకృతనమకభాష్యము సంపూర్ణము :—

—: ఏకాదశానువాకములుగల నమకమంత్రములకు, (1) యజ్ఞపరముగా, (2) శివపరముగా, (3) విష్ణుపరముగా, (4) బీజాక్షరసంపుటి ననుసరించి విజ్ఞానశాస్త్రసూచకముగా :—

శ్రీ తెలికిచెర్లోపనామకులును, కౌండిన్యసగోత్రులును

పుణ్యదంపతులునగు లక్ష్మీకాంతాకామేశ్వరులపుత్రుడగు

రాజేశ్వరశర్మచే వ్రాయఁబడిన

అర్థవివరణములుగల

శ్రీ రుద్రాంధ్ర భాష్యము

—: సమాప్తము :—

★★★
★★
★

ACHARYA KALA MANDIRAM LIBRARY
SRI VENKATESWARA CENTRAL LIBRARY & RESEARCH CENTRE
29285
TIRUPATI.